




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 275 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం బుధవారం 11 జూన్ 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 275 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM WED 11 JUNE 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


## జాతీయ మహిళా కమిషన్ నిర్ణయం అభినందనీయం

- అమరావతి మహిళలపై వీవీఆర్ కృష్ణంరాజు నీచమైన వ్యాఖ్యలు
- జాతీయ మహిళా కమిషన్, ఛైర్‌పర్సన్ విజయ రహత్కర్‌కు మంత్రి లోకేశ్ ప్రశంసలు
- కృష్ణంరాజుపై తక్షణ విచారణ, కఠిన చర్యలకు ఎన్‌సీడబ్ల్యూ ఆదేశం
- మహిళల త్యాగాలను అవమానించడం నేరంతో సమానమన్న లోకేశ్
- బాధితులకు సత్వర న్యాయం జరగాలని డిమాండ్



పెన్ పవర్ డెస్క్:అమరావతి మహిళలపై సాక్షి చానల్లో జర్నలిస్టు వీవీఆర్ కృష్ణంరాజు చేసిన దారుణమైన, అవమానకరమైన వ్యాఖ్యల పట్ల ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో తక్షణం స్పందించి, కఠిన చర్యలకు ఉపక్రమించిన జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) ఛైర్‌పర్సన్ విజయ రహత్కర్‌కు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఎన్‌సీడబ్ల్యూ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. అమరావతి కోసం పోరాడుతున్న మహిళా రైతులను కృష్ణంరాజు 'వేశ్యలు' అంటూ సంబోధించడం సిగ్గుచేటని, వారి త్యాగాలను అవమానించడమే కాకుండా ఇది నేరపూరిత చర్య అని నారా లోకేశ్ పేర్కొన్నారు. ఇటువంటి నీచమైన వ్యాఖ్యలు సమాజంలో మహిళల గౌరవానికి భంగం కలిగిస్తాయని స్పష్టం చేశారు.జాతీయ మహిళా కమిషన్ ఈ విషయంపై నిర్దిష్ట కాలపరిమితితో కూడిన విచారణకు, కఠినమైన చట్టపరమైన చర్యలకు ఆదేశించడం సరైన నిర్ణయమని లోకేశ్ అభిప్రాయపడ్డారు. ఇటువంటి చర్యల ద్వారా మహిళా వ్యతిరేకతను, అసభ్యకరమైన ప్రవర్తనను ఎంతమాత్రం సహించేది లేదనే బలమైన సందేశం వెళుతుందని ఆయన తెలిపారు."అమరావతి ఉద్యమానికి మహిళలు వెన్నెముక వంటివారు. వారి పోరాటానికి, త్యాగాలకు మేమంతా అండగా నిలుస్తాం" అని నారా లోకేశ్ స్పష్టం చేశారు. అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన

వివరాలు 2లో..

# ఏపీ పారిశ్రామిక ప్రగతికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్..

## సీఎం చంద్రబాబు నేతృత్వంలో కీలక నిర్ణయం

- ఏపీ పారిశ్రామికాభివృద్ధికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు
- సీఎం చంద్రబాబు ఛైర్మన్, టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్ కో-ఛైర్మన్
- 2047 నాటికి స్వర్ణాంధ్ర ప్రదేశ్ సాధన ప్రధాన లక్ష్యం
- విశాఖలో టీసీఎస్ కేంద్రం, విమానయాన అభివృద్ధికి టాటాతో చర్చలు
- అమరావతిలో సీఐఐ భాగస్వామ్యంతో గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్
- రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామికంగా అగ్రగామిగా నిలప డంతో పాటు, ఆర్థిక ప్రగతిని వేగవంతం చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సీఎం చంద్రబాబు ఛైర్మన్‌గా, ప్రముఖ పారిశ్రామికవేత్త, టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ కో-ఛైర్మన్‌గా ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. సభ్యులుగా సీఐఐ డీజీ చంద్రజీత్ బెనర్జీ, అపోలో ఆసుపత్రి వైస్ ఛైర్‌పర్సన్ ప్రీతారెడ్డి, భారత్ బయోటెక్ ఎండీ సుచిత్ర ఎల్ల, ప్రొఫెసర్ రాజ్‌రెడ్డి, సతీశ్ రెడ్డి, జీఎం రావు, ఎల్ అండ్ టీ ఛైర్మన్ సుబ్రమణ్యన్, టీవీఎస్ మోటార్ ఛైర్మన్ వేణు శ్రీనివాసన్, సీఎస్ విజయానంద్ ఉండనున్నారు. 'స్వర్ణాంధ్ర ప్రదేశ్ ఆర్థికాభివృద్ధి టాస్క్‌ఫోర్స్'గా నామకరణం చేసిన ఈ బృందం.. 2047 నాటికి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు వ్యూహర చన చేయనుంది.ఈ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుకు సంబంధిం చి సీఎం చంద్రబాబు గతేడాది ఆగస్టులో టాటా గ్రూప్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్‌తో భేటీ అనంతరం ప్రకటన చేశారు. 2027 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ప్రథమ స్థానంలో నిలపాలన్నది తమ ప్రభుత్వ దార్శనికత అని ఆయన అప్పుడు స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా 2024 నవంబరులో ఈ టాస్క్‌ఫోర్స్ తొలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రాథమిక లక్ష్యాలు, దృష్టి సారించాల్సిన కీలక రంగాలపై చర్చించారు. ప్రభుత్వ అధికారులు, పరిశ్రమల ప్రముఖులు, వివిధ రంగాల నిపుణులతో కూడిన ఈ టాస్క్‌ఫోర్స్.. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడానికి, ఆర్థిక ప్రగతిని పరుగులు పెట్టించడానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికలను రూపొందిస్తుంది.మౌలిక సదుపాయాల కల్పన, నవ పారిశ్రామికవేత్తల ప్రోత్సాహం, నైపుణ్యాభివృద్ధి, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ)కు చేయూత, తయారీ రంగం అభివృద్ధి వంటి కీలక అంశాలపై ఈ టాస్క్‌ఫోర్స్ ప్రధానంగా దృష్టి సారిస్తుం దని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అలాగే విశాఖలో టీసీఎస్ అభివృద్ధి కేంద్రాన్ని నెలకొల్పడానికి, ఎయిర్ ఇండియా, విస్తారా విమానయాన సంస్థల ద్వారా రాష్ట్రంలో విమాన సేవలను మెరుగుపరచడానికి టాటా గ్రూపుతో భాగస్వామ్యం కుదుర్చుకునే అంశాలను కూడా ప్రభుత్వం చురుగ్గా పరిశీలిస్తోంది.

## సజ్జలకు నోటీసులు పంపిస్తాం... విచారణకు రావాల్సిందే

- సజ్జల రామకృష్ణారెడ్డికి నోటీసులు పంపనున్న ఏపీ మహిళా కమిషన్
- రాజధాని మహిళలపై అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో చర్యలు
- మంగళగిరిలో ఛైర్‌పర్సన్‌ను కలిసి ఫిర్యాదు చేసిన అమరావతి మహిళలు
- వైసీపీ నేతలు మానసిక క్షోభకు గురిచేస్తున్నారని ఆవేదన
- ఫిర్యాదు అందకముందే సుమోటోగా స్వీకరించిన మహిళా కమిషన్
- విషయాన్ని జాతీయ మహిళా కమిషన్‌కు నివేదిస్తామన్న ఛైర్‌పర్సన్ శైలజ

వివరాలు 2లో..



## అఖిల పక్ష బృందాలతో సమావేశమైన ప్రధాని మోదీ.. థరూర్ కు షేక్ హ్యాండ్!

- ఆపరేషన్ సిందూర్" తర్వాత వివిధ దేశాలకు భారత ప్రతినిధి బృందాలు
- పాక్ ప్రేరిత ఉగ్రవాదంపై భారత్ గట్టి వైఖరిని ప్రపంచానికి వెల్లడి
- మంగళవారం సాయంత్రం ప్రధాని మోదీతో ప్రతినిధుల సమావేశం
- తమ విదేశీ పర్యటన అనుభవాలను ప్రధానికి వివరించిన సభ్యులు
- ఉగ్రవాదంపై పోరులో జాతీయ ఐక్యతను చాటిన వివిధ పార్టీల నేతలు
- మొత్తం ఏడు బృందాల్లో 50 మందికి పైగా ప్రస్తుత, మాజీ ఎంపీలు, దౌత్యవేత్తలు

వివరాలు 2లో..



## కొమ్మినేని శ్రీనివాసరావుకు 14 రోజుల రిమాండ్

- సాక్షి టీవీ యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావుకు 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్
- అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యల కేసులో అరెస్ట్
- సోమవారం హైదరాబాద్‌లో కొమ్మినేనిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- మంగళగిరి కోర్టులో హాజరుపరిచిన వైనం
- గుంటూరు జిల్లా జైలుకు తరలించిన అధికారులు

పెన్ పవర్ డెస్క్:అమరావతి మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలకు సంబంధిం చిన కేసులో అరెస్టయిన సాక్షి ఛానల్ న్యూస్ యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావుకు న్యాయస్థానంలో చుక్కెదురైంది. ఆయనకు 14 రోజుల పాటు జ్యుడిషియల్ రిమాండ్ విధిస్తూ గుంటూరు జిల్లా మంగళగిరి కోర్టు నేడు ఆదేశాలు జారీ చేసింది.సోమవారం నాడు కొమ్మినేని శ్రీనివాసరావును హైదరాబాద్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. ఆయనను

వివరాలు 2లో..



## కాకాణి గోవర్ధన్ రెడ్డికి రిమాండ్

- కాకాణికి 14 రోజుల రిమాండ్ విధించిన గుంటూరు సీఐడీ కోర్టు
- ఎమ్మెల్యే సోమిరెడ్డిపై అసభ్య పోస్టులపై మంగళగిరిలో కాకాణిపై కేసు
- పీటీ వారెంట్‌పై ఆయన్ను గుంటూరు కోర్టులో హాజరుపరిచిన సీఐడీ అధికారులు

వివరాలు 2లో..

పెన్ పవర్ డెస్క్:అక్రమ మైనింగ్ కేసులో రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి గుంటూరు సీఐడీ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది.



## ఉగ్రవాదం ప్రపంచ సమస్యే... ద్వైపాక్షికం కాదు



- ఉగ్రవాదం ప్రపంచ సమస్య... రెండు దేశాల మధ్యది కాదన్న జైశంకర్
- అనేక ఉగ్రదాడుల మూలాలు పాకిస్థాన్‌తో ముడిపడి ఉన్నాయన్న కేంద్ర మంత్రి
- ఐరోపా పర్యటనలో భారత సంతతి ప్రజలతో విదేశాంగ మంత్రి జైశంకర్ సమావేశం
- కొన్ని దేశాలు ఉగ్రవాదాన్ని అధికారిక విధానంగా మార్చుకున్నాయన్న జైశంకర్

వివరాలు 2లో..

## ఆస్ట్రియా స్కూల్లో కాల్పులు... 10 మంది మృతి

- గ్రాజ్ నగరంలోని ఓ పాఠశాలలో కాల్పుల ఘటన
- కనీసం 10 మంది మృతి, పలువురికి తీవ్ర గాయాలు
- నిందితుడైన విద్యార్థి స్కూల్ టాయిలెట్‌లో కాల్చుకుని ఆత్మహత్య
- మృతుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నట్లు ఓఆర్ఎఫ్ కథనం



పెన్ పవర్ డెస్క్:ఆస్ట్రియాలోని రెండో అతిపెద్ద నగరమైన గ్రాజ్‌లో మంగళవారం తీవ్ర విషాదం చోటుచే సుకుంది. ఇక్కడి బోర్గ్ డ్రెయిర్ షుట్జెన్‌గాస్సే పాఠశాలలో ఓ విద్యార్థి

వివరాలు 2లో..

## ఎన్సీపీ చీలిక కలలో కూడా ఊహించలేదు: శరద్ పవార్ ఆవేదన

- పార్టీ చీలిపోతుందని కలలో కూడా అనుకోలేదన్న శరద్ పవార్
- కొంతమంది సిద్ధాంతాల వల్లే ఎన్సీపీలో చీలిక వచ్చిందని వ్యాఖ్య
- సవాళ్లను ఎదుర్కొన్న కార్యకర్తలకు పవార్ అభినందనలు
- స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపు
- మహిళలకు 50 శాతం రిజర్వేషన్లపై దృష్టి సారించాలని సూచన
- అధికారం కోసం కాకుండా, ప్రజాసేవకే ప్రాధాన్యమన్న పవార్

పెన్ పవర్ డెస్క్:నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) రెండుగా చీలిన పరిణామం తనను తీవ్రంగా కలచివేసిందని, పార్టీ ఇలా ముక్కలవుతుందని కలలో కూడా ఊహించలేదని ఎన్సీపీ (శరద్ పవార్) వర్గం అధ్యక్షుడు శరద్ పవార్ ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పుణెలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. పార్టీ చీలిపోయినప్పటికీ, మొక్కవోని దీక్షతో సవాళ్లను ఎదుర్కొంటూ పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళుతున్న నాయకులు, కార్యకర్తలను ఆయన ఈ సందర్భంగా అభినందించారు.పార్టీ ఆరంభం నుంచి ఎన్నో ఒడిదొడుకులను, సవాళ్లను ఎదుర్కొందని శరద్ పవార్ గుర్తుచేశారు. అయినప్పటికీ, నిరుత్సాహపడకుండా పార్టీని

వివరాలు 2లో..



## 'సంకరజాతి' అంటూ సజ్జల చేసిన వ్యాఖ్యలపై షర్మిల ఫైర్



- అమరావతి మహిళలపై సజ్జల వ్యాఖ్యలను ఖండించిన షర్మిల
- సజ్జల ఒక మూర్ఖుడిలా మాట్లాడారని తీవ్ర విమర్శ
- సొంత చెల్లికే జగన్ ప్రభుత్వంలో గౌరవం లేదంటూ వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:వైసీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అమరావతి మహిళల విషయంలో 'సంకరజాతి' అంటూ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలను ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా ఖండించారు. సజ్జల తీరుపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో షర్మిల మాట్లాడుతూ, మహిళలను కించపరిచేలా సజ్జల మాట్లాడటం ఆయన మూర్ఖత్వానికి నిదర్శనమని ఘాటుగా విమర్శించారు. వైసీపీ పదే పదే తప్పులు చేస్తోందని ఆమె ఆరోపించారు.ఈ సందర్భంగా షర్మిల తనపై జరిగిన సోషల్

వివరాలు 2లో..

## నన్ను చూసుకునే నాకు పొగరు... ఇక బాలకృష్ణ అంటే ఏంటో చూస్తారు



- బాలకృష్ణ 64వ పుట్టినరోజు
- బసవతారకం ఆసుపత్రిలో జన్మదిన వేడుకలు
- వయసు కేవలం అంకె మాత్రమేనన్న బాలయ్య
- తనకు పొగరు ఎక్కువని అంటుంటారని, అది నిజమేనని వ్యాఖ్య

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# బీఆర్ఎస్ కవితక్కను సైడ్ చేయడానికే సిద్ధమయిందా?

### వదిలించుకోవడానికే రెడీ అయ్యారా?

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ను పార్టీలో ఎవరూ దరి చేరనివ్వడం లేదు. ఆమెను ఒంటరి చేసినట్లే కనపడుతుంది. ఈ నెల 4వ తేదీన ఇందిరాపార్కువద్ద మహా ధర్నా చేశారు. అదీ కూడా కేసీఆర్ కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇచ్చిందని ఆమె ధర్నాకు దిగారు. తెలంగాణ జాగృతి తరుపున కల్వకుంట్ల కవిత ధర్నాకు దిగారు. అంత వరకూ ఓకే. గతంలో కవిత ఏ కార్యక్రమం చేసినా బీఆర్ఎస్ లోని ముఖ్యమైన నేతలందరూ హాజరయ్యేవారు. తెలంగాణ ఉద్యమం నాటి నుంచి మొన్నటి వరకూ కవిత జాగృతి తరుపున తలపెట్టిన కార్యక్రమానికి నేతలందరూ హాజరై ఆమెకు అండగా నిలిచేవారు. కాని కట్ చేస్తే.. ఇప్పుడు సీన్ మారింది. కల్వకుంట్ల కవిత తన తండ్రి కేసీఆర్ కు ఘాటుగా లేఖ రాయడం, బీజేపీలో బీఆర్ఎస్ ను విలీనం చేస్తున్నారని ఆఫ్ ది రికార్డులో అన్న మాటలతో నాయకత్వం కూడా ఆమెకు దూరమయింది.

**బీఆర్ఎస్ నేతలు ఎవరూ...**

కల్వకుంట్ల కవిత కూడా తాను ఒంటరిగానే ప్రయాణం చేసేందుకు సిద్ధమయినట్లు కనపడుతుంది. తెలంగాణ జాగృతి సంస్థ కార్యాలయాన్ని ప్రారంభించడంతో పాటు తనకు కేసీఆర్ ఒక్కరే నాయకుడని చెప్పడం, జాగృతి తరుపున అనుబంధ సంస్థలను ఏర్పాటు చేసుకుంటూ వెళుతుండటం కొంత ఇబ్బందికరంగా మారింది. ప్రధానంగా తన సోదరుడు కేటీఆర్ పై ఆమె పరోక్షంగా చేసిన వ్యాఖ్యలతో కుటుంబానికి కూడా ఆమె దూరమయినట్లే కనిపిస్తుంది. ఆమె తన సోదరుడికి దూరం కావాలనే ఈ కామెంట్స్ చేశారు. దీంతో తెలంగాణ జాగృతి నిర్వహించే కార్యక్రమానికి బీఆర్ఎస్ నేతలు ఎవరూ హాజరు కావద్దంటూ అధినాయకత్వం నుంచి మౌఖిక ఆదేశాలు వచ్చాయట.

**అటు వైపు రాకుండా...**

అందుకే కవిత ఇందిరాపార్కు వద్ద తలపెట్టిన ధర్నాకు బీఆర్ఎస్ నేతలు ఎవరూ అటు వైపు చూడలేదు. బీఆర్ఎస్ లో ఉన్న మహిళా నాయకులు, మాజీ మంత్రులు కూడా రాకపోవడంతో కారు పార్టీ నేతలు కవితకు దూరంగానే ఉండాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉండటంతో పాటు కేసీఆర్ ఆదేశాలతోనే కవిత కార్యక్రమానికి నేతలు ఎవరూ హాజరు కాలేదని తెలిసింది. దీన్ని బట్టి చూస్తుంటే కవితకు కారు పార్టీ నుంచి సహకారం ఇక భవిష్యత్ లోనూ అందే అవకాశాలు కనిపించడం లేదు. అదే సమయంలో ఆమెను బీఆర్ఎస్ లో ఒంటరి చేసే ప్రయత్నం ముమ్మరం అయిందని చెప్పాలి. మరి రానున్న కాలంలో అన్నాచెల్లెళ్ల మధ్య వైరం ఏ స్థాయికి వెళుతుందన్నది చూడాలి.

# నన్ను చూసుకునే నాకు పొగరు... ఇక బాలకృష్ణ అంటే ఏంటో చూస్తారు

“చాలామంది నాకు పొగరని అనుకుంటారు, అది నిజమే!... నన్ను చూసుకునే నాకు పొగరు... ఇకపై బాలకృష్ణ అంటే ఏంటో చూపిస్తాను!” అంటూ ప్రముఖ కథానాయకుడు, టీడీపీ హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. బాలయ్య ఇవాళ (జూన్ 10) తన 64వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రిలో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా మిత్రులతో మాట్లాడుతూ, పలు ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. తొలుత ఆసుపత్రి ప్రాంగణంలోని తన తల్లిదండ్రులు, స్వర్గీయ నందమూరి తారక రామారావు, బసవతారకం దంపతుల విగ్రహాలకు బాలకృష్ణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అభిమానుల కేరింతల మధ్య పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “తల్లిదండ్రుల ఆశీస్సులు, అభిమానుల అండదండలతో 64 వసంతాలు పూర్తిచేసుకున్నాను. వయసు అనేది కేవలం ఒక అంకె మాత్రమే, దాని గురించి నేను పెద్దగా పట్టించుకోను. చాలామంది నాకు పొగరని, అహంకారమని అంటుంటారు. అవును, నన్ను చూసుకుంటే, నా క్రమశిక్షణ, నా అంకితభావం చూసుకుంటే నాకే పొగరుగా అనిపిస్తుంది. అందులో తప్పేముంది?” అని తనదైన శైలిలో వ్యాఖ్యానించి అందరినీ ఆశ్చర్యపరిచారు. బిరుదులు వస్తుంటాయని, పోతుంటాయని, వాటికి తాను అలంకారమే తప్ప అవి తనకు అలంకారం కాదని, మన పని మనం నిజాయతీగా చేసుకుంటూ పోవడమే ముఖ్యమని ఆయన వ్యాఖ్యానించారు. బసవతారకం ఆసుపత్రితో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, 15 ఏళ్ల క్రితం ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఆసుపత్రి అభివృద్ధికి, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వైద్యాన్ని పేదలకు అందించడానికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. తన తండ్రి ఎన్టీఆర్ ఆశయం మేరకు, ఒకప్పుడు తాను కూడా మెడిసిన్ ఎంట్రన్స్ పరీక్ష రాశానని, అయితే విధి మరోలా తలచి సినిమాల్లోకి వచ్చానని, కానీ సినిమాల్లో డాక్టర్ పాత్రలు పోషించడం ద్వారా ఆ కోరిక తీర్చుకున్నానని సరదాగా వ్యాఖ్యానించారు.

# సజ్జలకు నోటీసులు పంపిస్తాం... విచారణకు రావాల్సిందే

వైసీపీ సీనియర్ నేత, ఆ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. రాజధాని అమరావతి ప్రాంత మహిళలను ఉద్దేశించి ఆయన అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ తీవ్రంగా స్పందించింది. సజ్జల రామకృష్ణారెడ్డికి త్వరలోనే నోటీసులు పంపిస్తామని ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ మంగళవారం స్పష్టం చేశారు. వ్యక్తిగతంగా కమిషన్ ఎదుట హాజరై వివరణ ఇవ్వాలని ఆ నోటీసుల్లో ఆదేశించనున్నట్లు తెలిపారు.మంగళగిరిలోని మహిళా కమిషన్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజను కలిసిన రాజధాని ప్రాంత మహిళలు, సజ్జల వ్యాఖ్యలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ ఫిర్యాదు అందజేశారు. వైసీపీ నాయకులకు అమరావతి మహిళలంటే చులకన భావం ఏర్పడిందని వారు వాపోయారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అక్రమ కేసులు బనాయించి తమను తీవ్రంగా వేధించారని, ఇప్పుడు ఎన్నికల్లో ఓటమి అనంతరం ఆ పార్టీ నాయకులు తమను మానసికంగా మరింత క్షోభకు గురిచేస్తున్నారని కన్నీటిపర్యంతమయ్యారు. రాష్ట్రంలో వైసీపీ కేవలం 11 అసెంబ్లీ స్థానాలకే పరిమితం కావడానికి రాజధాని మహిళలే కారణమంటూ తమను కించపరిచేలా సజ్జల వ్యాఖ్యానించడం తగదని వారు హితవు పలికారు. ఇటువంటి వ్యాఖ్యలు తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.రాజధాని మహిళల నుంచి ఫిర్యాదు స్వీకరించిన అనంతరం ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ మాట్లాడుతూ, ఈ విషయాన్ని జాతీయ మహిళా కమిషన్ కు కూడా వివరిస్తామని తెలిపారు. మహిళల నుంచి అధికారికంగా ఫిర్యాదు అందకముందే, మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా కమిషన్ ఈ ఘటనను సుమోటోగా విచారణకు స్వీకరించిందని, ఈ మేరకు ఇప్పటికే జాతీయ మహిళా కమిషన్‌కు ఒక లేఖ కూడా రాసినట్లు ఆమె పేర్కొన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తులు మహిళల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడటం తగదని శైలజ అన్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి కమిషన్ ఎదుట హాజరై తన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాల్సి ఉంటుందని ఆమె తేల్చిచెప్పారు.

# ఉగ్రవాదం ప్రపంచ సమస్యే... ద్వైపాక్షికం కాదు

ఉగ్రవాదాన్ని ప్రపంచ సమస్యగా పరిగణించాలని, కేవలం రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక అంశంగా చూడకూడదని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. ఐరోపా దేశాల పర్యటనలో భాగంగా బెల్జియం, లక్సంబర్గ్‌లలో భారత సంతతి ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. చారిత్రకంగా చూస్తే, ప్రపంచవ్యాప్తంగా జరిగిన అనేక ఉగ్రవాద దాడుల మూలాలు పాకిస్థాన్‌తో ముడిపడి ఉన్నాయని ఆయన ఆరోపించారు. బెల్జియంలో జరిగిన కార్యక్రమంలో ఆ దేశ విదేశాంగ మంత్రి మాక్సిమ్ ప్రెవోట్ కూడా జైశంకర్‌తో పాటు పాల్గొన్నారు. ఈ సందర్భంగా, భారతదేశ పురోగతి, దేశ సంపదను కాపాడేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను జైశంకర్ వివరించారు. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం జరిగిన పరిణామాలపై మాట్లాడుతూ, “ఉగ్రవాదం అనేది ఫలానా దేశానిది, మీది కాదు, నాది కాదు అని అనుకోవద్దు. ఇది ఒక ప్రపంచ సమస్య” అని ఆయన అన్నారు. మీడియా కూడా కొన్నిసార్లు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తుందని, భారత్–పాకిస్థాన్ సమస్యను ద్వైపాక్షిక అంశంగానో లేదా కశ్మీర్ సమస్యగానో చూపిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.
“వాస్తవానికి ఉగ్రవాద సమస్య ఇతర దేశాలకు భిన్నంగా ఉంటుంది. కొన్ని సంస్థలు ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహిస్తాయి. కానీ, కొన్ని దేశాలు ఉగ్రవాదాన్ని తమ అధికారిక విధానంగా పెట్టుకుని నిర్వహిస్తున్నాయి” అని జైశంకర్ తీవ్రంగా విమర్శించారు. ఐరోపాలోని ప్రజలు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని ఆయన సూచించారు. “యూరప్‌లో కూడా ఉగ్రవాద దాడులు జరుగుతున్నాయి. కానీ, దానిని రెండు దేశాల మధ్య అంశంగా ఎవరూ చూడరు. వారి పొరుగు దేశాల్లో ఏదీ ఉగ్రవాదాన్ని అధికారిక విధానంగా పెట్టుకోలేదు. ఇది ఏ రెండు దేశాలకు సంబంధించిన అంశమని నేను భావించడం లేదు. ఉగ్రవాదం కేవలం భారత్‌కు సంబంధించిన సమస్యే కాదు. గత 20–30 ఏళ్లుగా గమనిస్తే, చాలా ఉగ్రదాడుల మూలాల దర్యాప్తులు పాకిస్థాన్‌లోకి వచ్చి ఆగిపోతాయి” అని ఆయన వ్యాఖ్యానించారు.

**అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై చర్చలు**

అంతకుముందు ఫ్రాన్స్‌లో పర్యటించిన జైశంకర్, అమెరికాతో వాణిజ్యపరమైన అంశాలపై కీలక ప్రకటన చేశారు. అమెరికా కొన్ని భారతీయ ఉత్పత్తులపై విధించిన టారిఫ్‌ల సస్పెన్షన్ గడువు ముగిసేలోపే ఆ దేశంతో ద్వైపాక్షిక ఒప్పందం కుదుర్చుకుంటామని ఫ్రాన్స్‌కు చెందిన ‘లా ఫిగారో’ పత్రికకు వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్ 2న భారత్‌పై అమెరికా 26 శాతం టారిఫ్‌లు విధించగా, ఆ తర్వాత దానిని జులై 9 వరకు సస్పెండ్ చేసింది. వాస్తవానికి ఏప్రిల్ 2 నుంచే ద్వైపాక్షిక చర్చలు ప్రారంభించినట్లు జైశంకర్ తెలిపారు.

# ఎన్సీపీ చీలిక కలలో కూడా ఊహించలేదు: శరద్ పవార్ ఆవేదన

- మొదటి పేజీ తరువాయి

నిలబెట్టుకున్నామని తెలిపారు. “కొద్ది మంది వ్యక్తుల విభిన్న భావజాలాల కారణంగా పార్టీ విడిపోయింది. దీని గురించి ఎక్కువగా మాట్లాడాలనుకోవడం లేదు. పార్టీ సిద్ధాంతాలపై విశ్వాసం ఉన్నవారే పార్టీలో కొనసాగుతారు” అని శరద్ పవార్ పేర్కొన్నారు.రాబోయే ఎన్నికల్లో సరికొత్త రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటాయని ఆయన జోస్యం చెప్పారు. పార్టీలోకి ఎవరు వస్తున్నారు, ఎవరు వెళ్లిపోతున్నారు అనే విషయాలను పట్టించుకోవద్దని, అందరూ కలిసికట్టుగా ప్రజలను ఏకం చేయగలిగితే ఎలాంటి సమస్యలూ దరిచేరవని పార్టీ శ్రేణులకు హితవు పలికారు. “చాలా మంది నాయకులు ప్రజలకు సేవ చేయాలనే దృఢ సంకల్పంతో ఉన్నారు. వారే పార్టీకి అసలైన బలం, బలగం. అధికారం గురించి ఆలోచించవద్దు. మనమంతా ఐక్యంగా ఉంటే, అధికారమే మనల్ని అనుసరిస్తుంది” అని పవార్ ఉద్బోధించారు.

మరో రెండు, మూడు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయని, పార్టీ నాయకులంతా క్రియాశీలకంగా పాల్గొని మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని శరద్ పవార్ పిలుపునిచ్చారు. ఎన్సీపీ (ఎస్పీ) కొత్త తరం నాయకులను తయారు చేసేందుకు కృషి చేస్తోందని ఆయన తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయని, ఏయే ప్రాంతాల్లో మహిళా అభ్యర్థులను నిలబెడితే ప్రయోజనకరంగా ఉంటుందో అంచనా వేసి ప్రణాళికలు రచించాలని సూచించారు.

# ఆస్ట్రియా స్కూల్లో కాల్పులు... 10 మంది మృతి

- మొదటి పేజీ తరువాయి

జరిపిన కాల్పుల్లో పలువురు మరణించగా, మరికొందరు గాయపడ్డారు. అనంతరం నిందితుడైన విద్యార్థి పాఠశాల టాయిలెట్‌లో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో నగరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో ఈ దారుణం జరిగింది. పాఠశాల భవనం లోపలి నుంచి తుపాకీ కాల్పుల శబ్దాలు వినిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందింది. ఆస్ట్రియా ప్రభుత్వ ప్రసార సంస్థ ఓఆర్ఎఫ్ కథనం ప్రకారం, ఈ కాల్పుల్లో కనీసం 10 మంది మరణించగా, పలువురు గాయపడ్డారు. అయితే, మృతుల సంఖ్యను అధికారులు ఇంకా అధికారికంగా ధృవీకరించలేదు. మరణించిన వారిలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా ఉన్నారని స్థానిక మీడియా తెలిపింది. కాల్పులు జరిపిన విద్యార్థి కూడా మరణించిన వారిలో ఉన్నాడని గ్రాజ్ నగర మేయర్ ఎల్కే ఖర్ వెల్లడించారు.“డ్రెయిర్‌షుట్జెన్‌గాస్సేలోని ఫెడరల్ అప్పర్ సెకండరీ పాఠశాలలో ఈ కాల్పులు జరిగాయని” ఆస్ట్రియా పోలీసులు సోషల్ మీడియా

ద్వారా ధృవీకరించారు. ప్రజలు ఆ ప్రాంతానికి దూరంగా ఉండాలని, అధికారుల సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం, పాఠశాలను పూర్తిగా ఖాళీ చేయించి, విద్యార్థులు, సిబ్బంది అందరినీ సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు పోలీసులు ఎక్స్ ద్వారా తెలిపారు. గాయపడిన విద్యార్థులకు పాఠశాలకు సమీపంలోని హెల్మట్ లిస్ట్ హాల్ అనే ఈవెంట్స్ వేదిక వద్ద వైద్య సహాయం అందిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. గ్రాజ్ నగరం ఆస్ట్రియాలో ఆగ్నేయ ప్రాంతంలో ఉంది. ఇక్కడ సుమారు 3 లక్షల మంది ప్రజలు నివసిస్తున్నారు.

# ‘సంకరజాతి’ అంటూ సజ్జల చేసిన వ్యాఖ్యలపై షర్మిల ఫైర్

- మొదటి పేజీ తరువాయి

మీడియా దాడిని కూడా ప్రస్తావించారు. “సజ్జల కుమారుడు భార్గవ్‌రెడ్డి సోషల్ మీడియాను అడ్డుపెట్టుకొని నాపై కూడా తీవ్రమైన దుష్ప్రచారం చేశారు. నేను వైఎస్ రాజశేఖరరెడ్డి కుమార్తెనని, ఒక మహిళనని కూడా చూడకుండా నన్ను కించపరిచారు” అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ అందరినీ తన అక్కాచెల్లెళ్లుగా సంబోధిస్తారని, కానీ ఆయన సొంత చెల్లికే కనీస మర్యాద దక్కడం లేదని విమర్శించారు. అలాంటప్పుడు రాష్ట్రంలోని ఇతర మహిళలను ఆయన ఎలా గౌరవిస్తారని షర్మిల ప్రశ్నించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలోని కొందరు నేతల తీరుపై కూడా షర్మిల తన అసహనాన్ని వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీని ఒక మహాసముద్రంతో పోల్చిన ఆమె, అందులో మంచి వ్యక్తులతో పాటు కొంత చెత్త కూడా ఉంటుందని వ్యాఖ్యానించారు. “పార్టీ అభివృద్ధి పథంలో పయనిస్తుంటే, కొందరు దాన్ని కిందికి లాగే ప్రయత్నం చేస్తున్నారు. వారే పార్టీకి వ్యతిరేకంగా కార్యక్రమాలు చేపడుతున్నారు” అని అన్నారు. పార్టీలో క్రమశిక్షణా కమిటీ ఉందని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సొంత పార్టీపైనే దుష్ప్రచారం చేసే వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని షర్మిల స్పష్టం చేశారు.

# జాతీయ మహిళా కమిషన్ నిర్ణయం అభినందనీయం

- మొదటి పేజీ తరువాయి

వారికి తగిన శాస్తి జరగాలని, బాధితులకు త్వరితగతిన న్యాయం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని లోకేశ్ ఉద్ఘాటించారు. మహిళల ఆత్మగౌరవాన్ని కించపరిచే ఎటువంటి చర్యలనైనా తీవ్రంగా పరిగణించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

# కొమ్మినేని శ్రీనివాసరావుకు 14 రోజుల రిమాండ్

- మొదటి పేజీ తరువాయి

గుంటూరు జిల్లా మంగళగిరిలోని కోర్టు ముందు హాజరుపరిచారు. వాదనలు విన్న న్యాయస్థానం ఆయనకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. కోర్టు ఉత్తర్వుల అనంతరం కొమ్మినేని శ్రీనివాసరావును తదుపరి చర్యల నిమిత్తం గుంటూరు జిల్లా జైలుకు పోలీసులు తరలించారు.

# కాకాణి గోవర్ధన్ రెడ్డికి రిమాండ్

- మొదటి పేజీ తరువాయి

టీడీపీ నేత, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలపై మంగళగిరిలో కాకాణిపై సీఐడీ కేసు నమోదు చేసింది. దీంతో పీటీ వారెంట్‌పై ఆయన్ను గుంటూరు కోర్టుకు తీసుకొచ్చారు. కోర్టు రిమాండ్ విధించడంతో కాకాణిని సీఐడీ అధికారులు నెల్లూరు జిల్లా జైలుకు తరలించారు.
కాగా, గతంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి ఫొటోలను మార్ఫింగ్ చేసి ఆయన పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారంటూ కాకాణిపై ఆరోపణలు ఉన్నాయి. దీనిపై మేకల నరేంద్ర అనే వ్యక్తి చేసిన ఫిర్యాదు మేరకు సీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. పీటీ వారెంట్‌పై కాకాణిని విచారణ నిమిత్తం కస్టడీలోకి తీసుకుని నెల్లూరు నుంచి భారీ భద్రత నడుమ మంగళగిరికి తరలించారు. ఈ రోజు గుంటూరులోని కోర్టులో మాజీ మంత్రిని హాజరుపరిచారు.

# అఖిల పక్ష బృందాలతో సమావేశమైన ప్రధాని మోదీ.. థరూర్ కు షేక్ హ్యాండ్!

- మొదటి పేజీ తరువాయి

బృందాల సభ్యులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, ప్రతినిధి బృందాల సభ్యులు తమ పర్యటన అనుభవాలను ప్రధానితో పంచుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ తో ప్రధాని మోదీ ప్రత్యేకంగా ముచ్చటించారు. ఆయనకు షేక్ హ్యాండ్ ఇచ్చి అభినందించారు. విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జైశంకర్ ఇప్పటికే ఈ ప్రతినిధి బృందాలతో సమావేశమై, పాకిస్థాన్ ప్రేరిత ఉగ్రవాదంపై భారతదేశం యొక్క బలమైన వాదనలను ప్రపంచానికి తెలియజేయడంలో వారు చేసిన కృషిని ప్రశంసించారు. సుమారు 50 మందికి పైగా సభ్యులతో కూడిన ఏడు ప్రతినిధి బృందాలు ఈ పర్యటనలు చేపట్టాయి. వీరిలో అధికశాతం ప్రస్తుత పార్లమెంట్ సభ్యులు కాగా, మాజీ పార్లమెంట్ సభ్యులు, మాజీ దౌత్యవేత్తలు కూడా ఉన్నారు. ఈ బృందాలు మొత్తం 33 విదేశీ రాజధానులు మరియు యూరోపియన్ యూనియన్‌ను సందర్శించాయి.

ఈ ప్రతినిధి బృందాలలో నాలుగు పాలక కూటమికి చెందిన ఎంపీల నేతృత్వంలో పర్యటించాయి. వీటిలో రెండు బీజేపీ, ఒకటి జేడీ(యూ), మరొకటి శివసేన పార్టీలకు చెందినవి. మిగిలిన మూడు బృందాలకు ప్రతిపక్ష పార్టీల ఎంపీలు నాయకత్వం వహించారు. కాంగ్రెస్, డీఎంకే, ఎన్సీపీ(ఎస్పీ) పార్టీల నుంచి ఒక్కో ఎంపీ చొప్పున ఈ బృందాలకు నేతృత్వం వహించారు.వివిధ ప్రాంతాలకు వెళ్లిన ఈ బృందాలకు బీజేపీ ఎంపీలు రవిశంకర్ ప్రసాద్, బైజ్యంత్ పండా, కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్, జేడీ(యూ) ఎంపీ సంజయ్ ఝా, శివసేన ఎంపీ శ్రీకాంత్ షిండే, డీఎంకే ఎంపీ కనిమొళి, ఎన్సీపీ(ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే వంటివారు నాయకత్వం వహించారు. ఉగ్రవాదంపై పోరాటంలో జాతీయ ఐక్యత సందేశాన్ని ప్రపంచానికి చాటిచెప్పేందుకే కేంద్ర ప్రభుత్వం ఈ అఖిలపక్ష ప్రతినిధి బృందాలను పంపింది. కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్, ఏఐఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వంటి వారు కూడా పాలక కూటమి సభ్యులతో కలిసి విదేశాల్లో భారత వాణిని బలంగా వినిపించారు.

ఈ ప్రతినిధి బృందాలలో కేంద్ర మాజీ మంత్రులు గులాం నబీ ఆజాద్, సల్మాన్ ఖుర్షీద్ వంటి ప్రముఖ మాజీ పార్లమెంట్ సభ్యులు కూడా పాలుపంచుకున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి.

# మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసినవారి శిక్షించాలి





**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం జూన్ 10:** మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని తక్షణం శిక్షించాలని, ఆరిలోవ 9 10 11 12 13 వార్డుల మహిళల ఆధ్వర్యంలో పెద్ద గదిలి కూడలి నిరసన తెలియజేశారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన 10,13 వార్డుల కార్పొరేటర్లు మద్దిల రామలక్ష్మి .కెల్లా సునీత సత్యనారాయణ.మహిళలు. అనంతరం సాక్షి పేపర్ టెలివిజన్ ఛానల్లకు వ్యతిరేకంగా మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సాక్షి దినపత్రికలను మహిళలు తగలబెట్టారు. అనంతరం ర్యాలీగా కదలివెళ్లి ఆరిలోవ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణకు ఈ సందర్భంగా ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో.మజ్జి రమణి. అధిక సంఖ్యలో మహిళలు మరియు టిడిపి నాయకులు పోత్రకొండ ధర్మారావు.ఒమ్మి అప్పలరాజు.బుడుమూరి గోవిందు.గాడి సత్యం. అచ్యుతరావు.తురకపూడి బాలస్వామి. ముగడ రాజారావు.మహిళా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# యోగాంధ్ర అత్యంత కీలకమైంది,ప్రపంచమంతా విశాఖవైపు చూస్తోంది



- రాజకీయాలకు అతీతంగా ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి
- పట్టుదల, కమిట్ మెంట్ తో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- కార్యక్రమానికి వచ్చే ప్రజలు ఇంటికి వెళ్లేవరకు అధికారులదే బాధ్యత
- అధికారులతో రాష్ట్ర విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్ సమీక్ష



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం, జూన్ 10.** :విశాఖపట్నంలో అంతర్జాతీయ యోగా దినోత్స వం సందర్భంగా నిర్వహించే యోగాంధ్ర కార్యక్ర మం అత్యంత కీలకమైంది, ఆరోజున మనం సాధించబోయే రికార్డు కోసం ప్రపంచ మంతా విశాఖ మహానగరం వైపు చూస్తోంది, ప్రధాని మోడీజీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ కార్య క్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులకు విజ్ఞప్తిచేశారు. ఆంధ్రా యూనివర్సిటీలోని సాగరిక కన్వెన్షన్ హాలులో ఈనెల 21న యోగా డే నిర్వహణ ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.ఒకే ప్రాంతంలో 5 లక్షలమంది తో నిర్వహించే ఈ ఈవెంట్ ప్రపంచంలోనే అతిపెద్ద దిగా చరిత్ర సృష్టించబోతోంది, ప్రధాని మోడీజీ హాజరు కాబోతున్నారు, అధికారులంతా పట్టుద ల, క్రమశిక్షణ, కమిట్ మెంట్ తో పకడ్బందీగా కార్యక్రమాన్ని నిర్వహించాలి. ఇది రాష్ట్రప్రజలం దరి కార్యక్రమం, రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయపక్షాలు భాగస్వాములు కావాలి. యోగావల్ల ప్రజల మానసిక, శారీరక ఆరోగ్యం బాగుంటుందని ప్రధాని చెబుతున్నారు. దీనిపై ప్రసార మాధ్యమాల్లో విస్తృత ప్రచారం కల్పిం చాలి. జూన్ 21న ఆర్ కె బీచ్ నుంచి భీమిలి వరకు 26 కి.మీ.ల పొడవున 247 కంపార్ట్ మెంట్లలో నిర్వహించే ఈ కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలి. ఆరోజు ఉదయం 6.30గంటలకు ప్రధాని ఆర్ కె బీచ్ ఖాళీమాత ఆలయం వద్ద ప్రధాన ప్రాంగణానికి చేరుకుంటారు. అంతకు గంటముందే ప్రజలంతా ఆయా కంపార్ట్ మెంట్లకు చేరేలా రవాణా సౌకర్యం కల్పించండి. సుదూర ప్రాంతాల్లో నిలిపివేసి ఇబ్బందులకు గురిచేయొద్దు. 600 మీటర్లకు మించి ప్రజలను నడిపించకుండా వాహనాలను వదలాలి. ప్రజలను ఇళ్లవద్ద నుంచి ప్రాంగణానికి చేరేదగ్గర నుంచి తిరిగి వారు ఇంటికి చేరేవరకు బాధ్యత తీసుకోవాలి. 19,20,21 తేదీలు కీలకం, అధికారులంతా ప్రణాళికాబద్ధంగా, కలసికట్టుగా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మంత్రి నారా లోకేష్ అధికార యంత్రాంగాన్ని కోరారు. సమావేశానికి ముందు ఎయు గ్రౌండ్స్ లో నిర్వ సిస్తున్న యోగా శిక్షణను మంత్రి లోకేష్ తిలకిం చారు.ప్రతి కంపార్ట్ మెంట్ కు ఒక గెజిటెడ్ అధికారి,విశాఖలో నిర్వహించే 11వ అంతర్జా తీయ యోగా దినోత్సవానికి రాష్ట్రస్థాయి నోడల్ ఆఫీసర్ గా నియమితులైన ఎంటి కృష్ణబాబు మాట్లాడుతూ... యోగాడే నిర్వహించే 247 కంపార్ట్ మెంట్లలో ప్రజలకు ఎటువంటి అసౌక ర్యం కలగకుండా ప్రతి కంపార్ట్ మెంట్ కు ఒక గెజిటెడ్ అధికారికి బాధ్యతలు అప్పగించాం, కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలంతా ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా వారిని నిర్ణీత కంపార్ట్ మెంట్లలోకి అనుమతి స్తాం. సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారిని రాత్రి 2గంటలనుంచే అనుమతించేలా చర్యలు చేపట్టాం. జనాన్ని తీసుకొచ్చే వాహనాలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్రమబద్ధీక రించేందుకు వీలుగా కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి, 1200 కెమెరాలను అమర్చాం. ఆర్ కె బీచ్ నుంచి భీమిలివరకు 30 ప్రధాన లోకేషన్లతోపాటు మరో 18అదనపు లోకేషన్లలో కూడా ఏర్పాట్లు చేశాం. కార్యక్రమ నిర్వహణ కోసం 2వేలమంది యోగా ఇన్ స్ట్రక్టర్లకు బాధ్య తలు అప్పగించాం. వారందరినీ ముందురోజు రాత్రే ఎయు గ్రౌండ్స్ కి రప్పిస్తాం. ముందుజాగ్రత్త చర్యగా 116 అంబులెన్స్ లను సిద్ధం చేశాం. హాజరయ్యే వారందరికీ మ్యాట్స్, టీషర్ట్స్ ఆయా కంపార్ట్ మెంట్ల వద్దే అందించేలా ఏర్పాట్లు చేశాం. 1400మంది బయో టాయ్ లెట్లను అందుబాటులో ఉంచుతాం. విశాఖతో పాటు పరిసర జిల్లాల నుంచి వచ్చే ప్రజల కోసం 3,500 ఆర్టీసి బస్సులు, 8వేల ప్రైవేటు, స్కూ లు బస్సులను సిద్ధంచేశాం. ప్రజలను సురక్షితం గా రప్పించే తిరిగే తీసుకెళ్లేలా సెక్రటేరియట్ ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించామని కృష్ణబాబు తెలిపారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, జిల్లా ఇన్చార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయుస్వామి, రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, అనగాని సత్య ప్రసద్, గుమ్మడి సంధ్యారాణి, కలెక్టర్ హరీంద్రప్ర సాద్, రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారులు, ప్రజాప్రతి నిధులు పాల్గొన్నారు.



## పల్లా కుటుంబ సభ్యులను పరామర్శించి

మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం చిత్రపటానికి నివాళులు అర్పించిన మంత్రి లోకేష్





**విశాఖ దక్షిణం,పెన్ పవర్,జూన్ 9** :టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తండ్రి, మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం గారికి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ నివాళు లు అర్పించారు. గత శనివారం ఆయన స్వర్గస్థ లయ్యారు. మంగళవారం ఉదయం విశాఖ సీతంపేటలో ని పల్లా శ్రీనివాసరావు నివాసానికి చేరుకున్న మంత్రి లోకేష్.అక్కడ పల్లా సింహాచ లం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిం చారు. పల్లా సింహాచలం మంచికి మారు పేరుగా నిలిచారని, విశాఖ-2 ఎమ్మెల్యేగా ని యోజకవర్గ అభివృద్ధికి కృషిచేశారని ఈ సంద ర్భంగా ఆయ న సేవలను మంత్రి గుర్తుచేసుకు న్నారు. పల్లా శ్రీనివాసరావు, ఇతర కుటుంబ సభ్యులను పరా మర్శించి ధైర్యం చెప్పారు. పల్లా సింహాచలం గారి మృతి పట్ల తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎం.పీ. భరత్, హోంమంత్రి వంగలపూడి, సాంఘి క సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామితో పాటు పాటు ఉత్తరాంధ్ర ప్రాంత ఎమ్మె ల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలంలో..పక్కా బిల్డింగ్ అనుమతులు!









- నకిలీ డాక్యుమెంట్లతో జీవీఎంసీని బురిడీ కొట్టించిన ప్రభుత్వ ఉద్యోగి!
- ప్రభుత్వ ఉద్యోగే.. ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసిన వైనం!
- భూమి సర్వే చెయ్యకుండానే అనుమతులిచ్చారని ఆరోపణలు!
- ఫిర్యాదులిచ్చినా పట్టించుకోని రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు!
- నిర్మాణంపై తక్షణమే విచారణ జరిపించాలని స్థానికులు డిమాండ్!

**ఎన్ఏడి, పెన్ పవర్, జూన్ 10 :** జీవీఎంసీ, రెవెన్యూ అధికారుల తీరు స్థానికులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. రూ.కోట్ల విలువ చేసే సర్కారు భూమిని కాపాడాల్సిన రెవెన్యూ, జీవీఎంసీ అధికారులే అవినీతి మత్తులో నిద్రనటిస్తూ..వైట్‌కాలర్ కేటుగాళ్లకు సహకార మందిస్తూ.. అందినకాడికి దండుకుంటున్నారనే ఆరోపణలకు సాక్ష్యాలుగా ఈ అక్రమ నిర్మాణం దర్శనమిస్తుంది. "కంచె చేను మేసే" చందాన ప్రభుత్వ ఉద్యోగే..ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి, ఉద్యోగ ధర్మాన్ని విస్మరించాడు. ప్రభుత్వ ఉద్యోగిగా రూ.లక్షల జీతాలు తీసుకుంటూ..అవీ చాలక ప్రభుత్వ భూమినే కబ్జా చేసి, అవినీతి సంపాదనకు అలవాటు పడి, సర్కారు భూమికే ఎసర పెట్టాడు.

### పక్క ప్రభుత్వ స్థలంలో..బిల్డింగ్ అనుమతులు..

జోన్ 8, జివిఎంసి, 90వ వార్డు, సుశర్లకాలనీ నుంచి ఎన్ఎస్‌టిఎల్ వేళ్లే దారిలో స్మశానం ముందు బిఏ.నెం.1086/0904/బి/జెడ్8/బిఈఎమ్/2023తో సర్వే నెం.2/1,2/2తో నిర్మిస్తున్న ఇండివిజ్యువల్ రెస్పిడెన్సియల్ బిల్డింగ్ పక్కా ప్రభుత్వభూమిలో నిర్మించడమేంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు విశాఖపట్నం, మెట్లోపాలిటన్ రీజియన్ మాష్టర్ ప్లాన్ ప్రకారం 2041 సంవత్సరానికి భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని, డిఆర్‌డిఓ (ఎన్ఎస్‌టిఎల్) నుంచి సుశర్లకాలనీ, బాజీజంక్షన్, లక్ష్మినగర్ మీదగా 24 మీటర్లు అంటే సుమారు 80 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్ కు ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలానికి బిల్డింగ్ అనుమతులు ఇచ్చేసింది. ఈ వ్యవహారంలో రెవెన్యూ జీవీఎంసీ అధికారులు భారీగా ముడుపులు వసూళ్లు చేశారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### నకిలీ డాక్యుమెంట్లతో బురిడీ కొట్టించిన ప్రభుత్వ ఉద్యోగి..

గోపాలపట్నం మండల తాసిల్దార్ కార్యాలయానికి కూసంత దూరంలోనే నిర్మాణం జరుగుతుంది. రెవెన్యూ, జీవీఎంసీ, మీ భూమి రికార్డుల్లో సర్వే నెం.2/1, 2/2లో 5 ఎకరాల 72 సెంట్లు ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని ఎలాగైనా కాజేయాలని దురుద్దేశంతో ముందునుంచి పక్క ప్రణాళికతో రెవిన్యూ, జీవీఎంసీ, అధికారులు, సర్వేయర్లను గుప్పెట్లో పెట్టుకొని, ప్రభుత్వ భూమిని కబ్జా చేసి, పక్క బిల్డింగ్ నిర్మించుకోవడానికి అధికారులే సహాయ సహకారాలు అందిస్తున్నారని, అందువలనే బిల్డింగ్ పై చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారని, విమర్శిస్తున్నారు. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ లో ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ..సచివాలయం ప్లానింగ్ సెక్రెటరీ, రెవెన్యూ, జీవీఎంసీ అధికారులతో కుమ్మక్కై భారీగా ముడుపులు చెల్లించారని, అందువలనే ప్రభుత్వభూమి సర్వే నెంబర్లతో డాక్యుమెంట్లు ఉన్నప్పటికీ బిల్డింగ్ అనుమతులు ఇచ్చేశారు. అందువలనే గత రెండేళ్లుగా అక్రమం నిర్మాణం జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు బిల్డింగ్ పై చర్యలు తీసుకోకుండా ఉన్నారని విశ్వసనీయ సమాచారం!

### ప్రభుత్వ ఉద్యోగే.. ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసిన వైనం..

మళ్ల అనురాధ భర్త జగదీశ్వరరావు జీవీఎంసీలో ప్రభుత్వ ఉద్యోగి. డిపార్ట్మెంట్లో ఉన్న పలుకుబడితో టౌన్ ప్లానింగ్ అధికారులను గుప్పెట్లో పెట్టుకుని, కబ్జా చేసిన ప్రభుత్వ స్థలంలో బిల్డింగ్ అనుమతులు తెచ్చుకున్నారని, బాధ్యతగల ప్రభుత్వ ఉద్యోగంలో ఉంటూ..ప్రభుత్వాన్నే మోసం చేయడంపై స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి!

### సరిగ్గా సర్వే చెయ్యకుండానే అనుమతులిచ్చారని..

జీవీఎంసీ, టౌన్ ప్లానింగ్ నిబంధనలకు ప్రకారం బిల్డింగ్ అనుమతుల కోసం ఆన్లైన్లో దరఖాస్తు చేసిన తర్వాత సంబంధిత రెవెన్యూ, జీవీఎంసీ సర్వేయర్లు డాక్యుమెంట్లో సర్వే నెంబర్లు, సరిహద్దులు పరిశీలన చేసి, కరెక్టు ఉన్నవాటికే (ఎన్ఓసిలు)నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ లు జారీ చేయాలి. లేనిపక్షంలో అనుమతులను నిరాకరించాలి. అయితే ఈ బిల్డింగ్ వ్యవహారములో సర్వేయర్లు రికార్డులను సరిగ్గా పరిశీలన లేకుండా గుడ్డిగా అనుమతి ఇచ్చినట్లు తెలుస్తుంది. వాస్తవానికి ఒక నిర్మాణం జరగాలంటే ప్రభుత్వ సర్వేయర్ రిపోర్టు తప్పనిసరి. అయినప్పటికీ పక్క సర్కార్ భూమిలో బిల్డింగ్ ప్లాన్ ఎలా ఇచ్చారో.. జిల్లా ఉన్నతాధికారులే తేల్చాలి!

### ఫిర్యాదులిచ్చినా పట్టించుకోని రెవెన్యూ.. జీవీఎంసీ..

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం జరుగుతుందని సంబంధిత రెవెన్యూ, జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకున్న పాపాన పోలేదు. గోపాలపట్నం మండల తాసిల్దార్ కార్యాలయం దగ్గర, మెయిన్ రోడ్ పై భారీ నిర్మాణం జరుగుతున్నప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, కమిషనర్ దృష్టి సారించాలని, ప్రభుత్వ భూములో అడ్డగోలగా అనుమతులిచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు!

### నిర్మాణంపై తక్షణమే విచారణ జరిపించాలని..

సర్కార్ భూమిలో నిర్మాణం మొదలుపెట్టి రెండు సంవత్సరాలు గడుస్తున్నా యాక్షన్ తీసుకోకపోవడంపై టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై పలు సందేహాలు కలుగుతున్నాయి. ఫిర్యాదు చేసినా కావాలనే కాలయాపన చేస్తూ..మరొపక్క భవనాన్ని పూర్తి చేసుకోవాడానికి అవకాశం కల్పించడంతో బిల్డర్ చకచకా నిర్మాణాన్ని పూర్తి కానిస్తున్నాడు. ఇప్పటికైనా అక్రమ భవనాన్ని కూల్చి, ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు!

# ఒకే ఏడాదిలో రూ. 9 లక్షల కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలు





- టీడీపీ - ఎన్డీయే ప్రభుత్వానికి మళ్లీ పెట్టుబడిదా రుల నమ్మకం తిరిగి వచ్చింది
- ఫాప్సీ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2025 లో పాల్గొన్న మంత్రి టీజీ భరత్, ఎం.పీ.భరత్

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం, జూన్ 10** :విశాఖపట్నంలో జరిగిన ఎఫ్ ఏ పి పి సి సి ఐ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2025 కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ పరిశ్రమల మంత్రి టీజీ భరత్ మాట్లాడు తూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయు డు నేతృత్వంలోని టీడీపీ – ఎన్డీయే ప్రభుత్వా నికి మళ్లీ పెట్టుబడిదారుల నమ్మకం తిరిగి వచ్చిందని చెప్పారు.కేవలం ఒకే ఏడాదిలో రూ. 9 లక్షల కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలు అందించడం చిన్న విషయం కాదని, ఇది ఆంధ్ర ప్రదేశ్ పట్ల పెట్టుబడిదారుల విశ్వాసాన్ని ప్రతి బింబిస్తోందని పేర్కొన్నారు.అమరావతి అభి వృద్ధిపై మాట్లాడుతూ, ఇప్పటికే రూ. 60,000 కోట్ల టెండర్లు పిలవబడినట్లు తెలిపారు. ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంటోందని చెప్పారు.విశాఖ ఎంపీ మతుకుమిల్లి భరత్ మాట్లాడుతూ, పరిశ్రమలు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, సమస్యలు మాత్రమే కాకుండా ప్రయోగాత్మక పరిష్కారాలను కూడా సూచించాలని కోరారు.విశాఖపట్నం నగరంలో 15 ప్రధాన రోడ్ల అభివృద్ధి పనులు రూ. 500 కోట్ల వ్యయంతో ప్రారంభించామని తెలిపారు.

%వా%విశాఖపట్నం మెట్రో ప్రాజెక్టు గురించి మాట్లాడు తూ, డీపీఆర్ సిద్ధమైందని, ఇది డబుల్ డెక్కర్ మెట్రో ప్రాజెక్టుగా రూపుదిద్దుకుంటుందని పేర్కొ న్నారు. ఇది రూ. 15,000 కోట్ల బడ్జెట్‌తో చేపట్ట బడే ప్రాజెక్ట్ అని తెలిపారు.పౌరసేవలకు డిజి టల్ వినియోగం విషయానికి వస్తే, 300 కంటే ఎక్కువ ప్రభుత్వ సేవలు ఇప్పుడు వాట్సాప్ ద్వారా అందుబాటులో ఉన్నాయని, దీంతో ప్రజలూ ప్రభుత్వ యంత్రాంగం మధ్య ప్రత్యక్ష సంబంధం తగ్గిందని తెలిపారు.ఇలా యూనివ ర్సిటీలు, పరిశ్రమలు, ప్రభుత్వ రంగం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది అని భరత్ పేర్కొన్నారు.కార్యక్రమంలో 11 విభాగాలలో విజేతలకు అవార్డులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఫాప్సీ అధ్యక్షులు మల్లికార్జు నరావు, మాజీ అధ్యక్షులు కరుణేంద్ర జాస్తి, సీవీ అచ్చుత్ రావు, ఉపాధ్యక్షులు ఏ. సత్యనా రాయణ, మరియు ఓపీ గోయెంకాలు పాల్గొ న్నారు.

# భీమిలి పుర వీధుల్లో జగన్మోహన్ రెడ్డి డౌన్ డౌన్,అంటూ ర్యాలీ

- సాక్షి మీడియాను నిషేధించాలి భీమిలిలో నినదించిన మహిళా శక్తి




**భీమిలి, పెన్ పవర్ జూన్ 10.** :మహిళలను కించపరిచేలా చేసిన వ్యాఖ్యా నాలకు వేదికగా నిలిచిన సాక్షి మీడియాను నిషే ధించాలని వివిధ వర్గాలకు చెందిన మహిళలు మంగళవారం భీమిలి పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ప్రతినిధులు మాట్లాడుతూ డిబేట్ పేరుతో సాక్షి యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావు, గెస్ట్ ప్యానెల్ కృష్ణంరాజులు మనోభావాలు దెబ్బ తీసేలా మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేశారని అన్నారు. అమరావతి రాజధానిపై అక్కసుతో సాక్షి మీడియా కుట్రకు తెరతీసిందని వారు ఆరోపించారు. దీని వెనుక మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ఆయన సతీమణి భారతిరెడ్డి ఉన్నారన్నారు. బాధ్యులైన వారిని అరెస్ట్ చేసి.. తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకుముందు ఆర్టీసీ బస్టాండ్ నుంచి జూని యర్ కాలేజీ మీదుగా గంట స్తంభం వరకూ ర్యాలీ చేశారు. సాక్షి మీడియాను నిషేధించాలి. జగన్మోహన్ రెడ్డి డౌన్ డౌన్,అంటూ ర్యాలీలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

# మహిళలంటే వైసిపికి చులకన ఎక్కువ

- టిడిపి మహిళా నేతలు




**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జూన్ 10** :కొమ్మినేని శ్రీనివాసరావు కృష్ణంరాజు లు ఆంధ్రు ల రాజధాని అమరావతి మహిళలను కించప రుస్తూ చేసిన వ్యాఖ్యలు ఖండిస్తూ మంగళవా రం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద నుండి జిల్లా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా మహి ళలను కించపరుస్తూ చేసిన వాక్యాలను ప్రసా రం చేసిన సాక్షి మీడియాను రద్దు చేయాలి , జగ న్ షేమ్ షేమ్ , సైకోలకి వత్తాసు పలుకుతున్న జగన్ డౌన్ డౌన్ , భారతి మౌనం వీడాలి , జగన్ అరాచకాలకు అడ్డుకట్ట వేయాలి వంటి నినాదా లతో మహిళలు పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ తెలుగు మహిళ అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత,తెలుగు మహిళా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి, ప్రధాన కార్యదర్శి గనగల్ల సత్య, దవల విజయ్ కుమా ర్, అవ్వకాంతం, హారతి, తదితర మహిళా నా యకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నా రు.

# దువ్వాడ రైల్వే స్టేషన్ సమస్యలపై ఎంపీకి వినతి



**గాజువాక : పెన్ పవర్,జూన్ 10**:విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు శ్రీ భరత్ విశాఖపట్నం అభివృద్ధికి రైల్వే స్టేషన్ లో 14 ఫ్లాట్ ఫారాల విస్తరణకు ఆయన చేస్తున్న కృషిని, ప్రత్యేక జోన్ ఏర్పాటులో జిఎం నియామకముగా నియమకానికి ఆయన చేసిన కృషి మరువలేనిదని పేర్కొన్నారు. దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కలిసి అభినందించారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దువ్వాడ దువ్వాడ రైల్వే స్టేషన్ లో వందే భారత్ రైలు హాల్టుకు, కోచ్ మెయిన్ టెనెన్స్ వరకు రాక్స్ రిపేరు కొరకు కృషి చేయాలని, ఎన్టిపిసి క్వార్టర్స్ నుండి ఆర్టీసీ కాంప్లెక్స్ కు వయా అగనంపూడి దువ్వాడ రైల్వే స్టేషన్ ప్లాట్ఫారం వన్ నుంచి ఒక బస్సు,అదే విధంగా సబ్బవరం నుంచి దువ్వాడ ఎస్ టి బి ఎల్ షీలా నగర్ మీదుగా విశాఖపట్నం ఒక బస్సు సౌకర్యాన్ని కల్పించాలని, దువ్వాడ స్టేషన్ ఫ్లాట్ ఫామ్ నాలుగు వైపు తక్కువ ధరల దుకాణాలు ఏర్పాటు చేయాలని, దువ్వాడ స్టేషన్ లో విశాఖపట్నం నుంచి వచ్చే రైళ్లకు రెండు నిమిషాల బదులు ఐదు నిమిషాల హాల్టు చేయాలని విజ్ఞప్తి చేశారు . ఈ మేరకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఇటీవల దువ్వాడ స్టేషన్ లో రైల్వే ప్రయాణికులకు ఉచితంగా నీళ్ల సీసాలు అందజేసిన రైల్వే యూజర్స్ అసోసియేషన్ సభ్యులను ఎంపీ శ్రీ భరత్, డి ఆర్ యు సి సి సభ్యులు చలసాని గాంధీ అభినందించారు కార్యక్రమంలో జడ్ ఆర్ సి సి సభ్యులు కంచు మూర్తి ఈశ్వర్, రైల్వే యూజర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి జాషువా, ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఎం ఎస్ ఎన్ మూర్తి, బీకామేశ్వరరావు పాల్గొన్నారు.



**గాజువాక పెన్ పవర్ జూన్ 10**:జివియంసి 87వ వార్డ్ పరిధిలో సిదార్ధ నగర్ మరియు కళింగ విధికీ అనుకోని ఉన్న 4 .30 ఎకరాల ఆటల స్థలాన్ని జీ వి యం సి జేసీబీ సహాయంతో పిచ్చి మొక్కలు తీసి సదును చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి స్థానిక వార్డ్ కార్పొరేటర్ బోండా జగన్నాథం ముఖ్య అతిథులుగా పాల్గొని ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిదార్థ నగర అనుకోని ఉన్న స్థలాన్ని స్పోర్ట్స్ కాంప్లెక్స్ గా అభివృద్ధి చేయాలని గతంలో కమిషనర్ , రాష్ట్ర అధ్యక్షుడు గాజువాక నియోజకవర్గం శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు అన్నారని, అందులో భాగంగా జెసిబి తో క్లీన్ చేస్తున్నారని, ఈ స్థలంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం అయితే వార్డు ప్రజలకు మంచి ఆహ్లాదకరమైన వాతావరణం లభిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షులు సాగి విజయరామరాజు, సెక్రెటరీ బొట్టా ప్రకాష్, మాటూరి రాము, బోట్టా రవి, గోకాడ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# లింగంపేట గ్రామం నుండి జనసేన పార్టీలోకి భారీగా చేరికలు.....





**పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు నచ్చి చేరికలు...**

**జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ సూర్య చంద్ర....**

**గొలుగొండ,పెన్ పవర్ (జూన్ 10)** : మండలంలో గల లింగంపేట గ్రామం నుండి జనసేన పార్టీ అధ్యక్షులు గండెం దొరబాబు,సీనియర్ నాయకులు రేగుబల్ల శివ ఆధ్వర్యంలో మండలంలోని లింగంపేట గ్రామానికి చెందిన 60 వైసీపీ కుటుంబాలు జనసేన పార్టీలో చేరారు. వైసీపీ మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు మద్దపు కామునాయుడు (అబ్బాయి నాయుడు), వైసీపీ సీనియర్ కర్త గోలకొండ సాంబమూర్తి, వైసీపీ నాయకులు పెద్దాడ ప్రసాద్, మాడెం నాగేశ్వరరావు, బొద్దున రమణ,గోలకొండ నూకినాయుడు తదితరులు. జనసేన పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. వీరందరికి జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలు, పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాబ్ ఆశయాలకు ఆకర్షితులై జనసేన పార్టీలో చేరుతున్నారన్నారు.పార్టీలో చేరిన వారు పార్టీ సిద్ధాంతాలు, పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా క్రమశిక్షణతో నడుచుకొని పార్టీ బలోపేతమై లక్ష్యంగా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సలాదుల ప్రసాద్ బాబు,మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు బోయిన చిరంజీవి, నాతవరం మండల జనసేన పార్టీ నాయకులు పోలుపర్తి శ్రీనివాసరావు,పండ ప్రసాద్, వండ ఉమా,బట్ట గణేష్, వాసం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచుల గైర్హాజరీ - కారణమేంటి ?



**సర్పంచు ల గైర్హాజరీపై మండలంలోని అధికారు లు ఆవేదన వ్యక్తం**

**భీమిలి, పెన్ పవర్, జూన్ 10** :ఆనందపురం మండలంలోని ప్రాథమిక పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11.00 గంటలకు నిర్వహించిన మండల ప్రాజెక్ట్ స్థాయి సమీక్ష సమావేశానికి మండల స్థాయి అధికారులు, ఎంపీడీఓ హాజరైనప్పటికీ, మండలంలోని మొత్తం 26 పంచాయతీలకు చెందిన సర్పంచులలో లోగగలవాణిపాలెం మరియు ముచర్ల సర్పంచు తప్ప మిగిలిన వారు హాజరుకాలేదు. సర్పంచు ల గైర్హాజరీపై మండలంలోని అధికారులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో మండల స్థాయిలో అమలు చేయవలసిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించాల్సి ఉండగా, ప్రజాప్రతినిధుల గైర్హాజరీతో సమావేశం నిర్మాణా త్మకంగా సాగలేదు. సర్పంచులు సమావేశానికి హాజరుకాకపోవడం వల్ల ప్రజాసమస్యలపై చర్చ జరగకుండానే సమావేశం ముగిసిపోయింది.

ఈ విషయమై స్థానికంగా వివిధ వర్గాలలో చర్చ సాగుతోంది. సర్పంచుల గైర్హాజరీకు కారణం అధికారుల వైఖరా వల్లా? లేదా ఇతర రాజకీయ కారణాలా? అనే అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధు లు దీనిపై స్పష్టత ఇవ్వాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సర్పంచులు సమావేశానికి ఎందుకు రాలేదన్న విషయంపై అధికారికంగా ఎటువంటి ప్రకటన వెలువడకపోవడం గమనార్హం.

# కృత్రిమ మేధ ఆధారంగా రూపొందించిన యాప్ సాయంతో యోగా శిక్షణ

- 21 రోజుల పాటు ఆన్లైన్ లింకు సాయంతో ఉచిత యోగా శిక్షణ
- యోగాపై విస్తృత అవగాహన, శిక్షణ కొరకు
- రాష్ట్ర ప్రభుత్వంతో రెండు సాంకేతిక సంస్థలు ఒప్పందం
- విశాఖలో మంత్రుల సమక్షంలో ఒప్పంద పత్రా లు మార్చుకున్న అధికారులు



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్టణం, జూన్ 10 :** యోగాంధ్ర కార్యక్రమాలు, జూన్ 21న విశాఖప ట్టణం వేదికగా జరగనున్న అంతర్జాతీయ యో గా దినోత్సవ వేడుకల నిర్వహణలో భాగంగా విస్తృత అవగాహన, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఆధారంగా యోగా శిక్షణలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో రెండు సాంకేతిక సంస్థలు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ మేరకు ఏయూ కన్వెన్షన్ హాలు సమీపంలోని సాగరిక హాలులో మంగళవారం జరిగిన సమీక్షా సమావేశం అనంతరం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ఇతర మంత్రులు డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి తదితరుల సమక్షంలో సంబంధిత సంస్థలకు చెందిన అధికారులు, ఆయూష్ విభాగం రాష్ట్ర స్థాయి అధికారులు ఒప్పంద పత్రాలు మార్చు కున్నారు. వాటిలో కర్నూలులోని ట్రిపిల్ ఐటీ డీఎం (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేష న్ టెక్నాలజీ, డిజైన్, మాన్యుఫాక్చరింగ్) సాంకేతిక విద్యా సంస్థ, మహారాష్ట్రకు చెందిన సాంకేతిక సంస్థ హాబిల్డ్ హెల్త్ టెక్ ప్రయివేటు లిమిటెడ్ సంస్థలు ఉన్నాయి. మంత్రుల సమ క్షంలో ఐఐఐటీ డీఎం-కర్నూలుకు చెందిన ఆచా ర్యులు కృష్ణనాయక్, ఎం. నరేశ్ బాబు, హాబిల్డ్ సాంకేతిక సంస్థ ప్రతినిధి అన్సుల్ అగర్వాల్, ఆంధ్రప్రదేశ్ ఆయూష్ విభాగం డైరెక్టర్ దినేశ్ కుమార్ పాల్గొని ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. అనంతరం ఎంవోయూలు కుదుర్చుకు న్న పత్రాలను మార్చుకున్నారు.ఐఐఐటీ డీఎం -కర్నూలు సంస్థ కృత్రిమ మేధ ఆధారంగా రూ పొందించిన యాప్ సాయంతో యోగా శిక్షణ ఇచ్చేందుకు రూపొందించినది కాగా.మరొకటి ప్రత్యేక కోర్సు రూపంలో 21 రోజుల పాటు ఆన్లైన్ లింకు సాయంతో ఉచిత యోగా శిక్షణ అందించేందుకు రూపొందించిన సాంకేతిక సాధనం.

# అమ్మవార్ల జాతరకు “వాసుపల్లి” రూ.1,00,000 విరాళం

**మాజీ ఎమ్మెల్యే గణేష్ కుమారికి కృతజ్ఞతలు తెలిపిన ఆలయ నిర్వహకులు**

**విశాఖ దక్షిణం,పెన్ పవర్, జూన్ 10** :శ్రీశ్రీ కుంచాలమ్మ, దుర్గాలమ్మ, అమ్మవార్లు పండుగ మహోత్సవానికి మాజీ ఎమ్మెల్యే, దక్షిణ వైసీపీ సమన్వయకర్త లక్ష రూపాయలు విరాళం అందజేశారులి. 104 ఏరియాలో కొలువుదీరిన అమ్మవార్ల జాతరకు సొంత నిధులతో రూ. 1,00,000లను వాసుపల్లి ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి ఏటా ఘనం గా జరిగే అమ్మవారి జాతరకు వాసుపల్లి గణేష్ కుమార్ అందిస్తున్న సహాయ సహకారాలకు కృతజ్ఞతలు తెలిపారు. దుర్గాదేవి అమ్మవారిని ఆరాధించడంలో వాసుపల్లి గణేష్ కుమార్ ప్రతి దసరాలో 104 లో కార్యాలయంలో అమ్మవారి ని ప్రతిష్టించి నవరాత్రి ఉత్సవాలు ఎంతో ప్రతి ష్టాత్మకంగా నిర్వహిస్తారన్నారు. అమ్మవారీ ఆశీస్సులు కలిగిన వాసుపల్లి గణేష్ కుమార్ అమ్మవార్ల జాతరకు తన వంతు ఆర్థిక సహా యం చేస్తూ ప్రోత్సహిస్తారని చెప్పారు, అనంత రం వాసుపల్లి గణేష్కుమార్ మాట్లాడుతూ ఇక్కడి స్థానిక ప్రజల ఆరాధ్య దైవం అమ్మవార్ల కరుణాకటాక్షం విశాఖ ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. వేలాది మంది భక్తులు ఇక్కడి అమ్మవారిని తరచూ దర్శించుకుని మొక్కలు చెల్లించుకుంటారన్నారు. జాతర కూడా ఎంతో వైభవంగా నిర్వహిస్తారని వాసుపల్లి తెలిపారు.



# పల్లె సమస్యల పరిష్కారానికే పల్లెనిద్ర...








**శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ**

**కశింకోట,పెనపవర్,జూన్ 10:**పల్లె సమస్యల పరిష్కారానికే పల్లెనిద్రని అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పల్లెనిద్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామనిఅన్నారు. మండలంలోని పల్లపు సోమవారం గ్రామంలో తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన పల్లెనిద్ర కార్యక్రమాన్ని ఆయన మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ తో కలిసి సోమవారం రాత్రి నిర్వహించారు. రాత్రి గ్రామస్తులతో పాటు కూర్చుని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముందుగా గ్రామం అంతా విస్తృతంగా పర్యటించారు. ఈనెల 21న జరగబోవు ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఉదయాన్నే గ్రామస్తులు నాయకులు అందరూ కలిసి యోగాబ్యాసాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అందరూ వయోభేదం లేకుండా చురుకుగా పాల్గొన్నారు. యోగాబ్యాస గురువుల ద్వారా యోగా విశిష్టత గురించి తెలుసుకున్నారు. రోగానికి పరిష్కారమే యోగా అన్నారు. తరువాత 8 గంటల నుండి ప్రకృతి వైద్యం గురించి,అనంతరం వ్యవసాయం, ఉద్యానవన పంటల కోసం రైతులకు సంబంధిత అధికారులు అవగాహన కల్పించారు. పశు వ్యాధుల గురించి వాటి నివారణ గురించి పశు వైద్యులు తెలిపారు. అదేవిధంగా అటవీ మొక్కల పెంపకం ఎన్ ఆర్ ఈ జి ఎస్ గురించి ఫారెస్ట్ అధికారులు వివరించారు. వీటిపై బ్యాంకులో రుణాలు గురించి బ్యాంక్ అధికారులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మధ్యాహ్నం నుండి 6 గంటల వరకు వీటిపై పూర్తి గా సంబంధిత అధికారులు తెలియజేస్తారు. అనంతరం సంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ గొంతిన నాగరత్నం, కూటమి నాయకులు, ప్రభుత్వ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## భూ సర్వేలో అయోమయం,పాత భూముల కు పట్టాలు జారీ చేయకుండానే వాటిని పెండిం గ్‌లో ఉంచడం అన్యాయమని సభ్యుల ఆగ్రహం





**భీమిలి, పెన్ పవర్, జూన్ 10 :**ఆనందపురం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో భూ సర్వే, వ్యవసాయం, గృహని ర్మాణం, విద్యుత్, త్రాగునీటి సమస్యలు వంటి అనేక అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. ఈ సమావేశానికి ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక అధ్యక్షత వహించగా, ఎంపీడీవో డా. వి. జానకి సమన్వయం నిర్వహించారు.సమావేశంలో జడ్పీటీసీ కోరాడ వెంకటరావు మాట్లాడుతూ, రీ-సర్వేలో కొన్ని భూములు వాడుతున్న రైతుల పేర్లకు బదులుగా ఇతరుల పేర్లు నమోదు కావ డం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు.పాత భూముల కు పట్టాలు జారీ చేయకుండానే వాటిని పెండిం గ్‌లో ఉంచడం అన్యాయమని అభిప్రాయపడ్డా రు.ఈ నేపథ్యంలో డిప్యూటీ సర్వే అధికారి గోవిందరావు మాట్లాడుతూ, “మండలంలోని 33 రెవెన్యూ గ్రామాల్లో 26 గ్రామాల్లో సర్వే పూర్తయింది. మిగిలిన 7 గ్రామాల్లో పనులు ప్రారంభించాం. 2026 సెప్టెంబర్ నాటికి మొత్తం సర్వే పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం,” అని తెలిపారు. సమస్యలేని భూములకు త్వరితగతిన పట్టాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు.వ్యవసాయ అధికారి సంధ్యా రత్నప్రభ మాట్లాడుతూ, వేరుశనగ విత్తనాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అంగన్ వాడీ సూపర్వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ, కొన్ని చోట్ల హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, త్వరలో నియామకాలకు నోటిఫికేషన్ విడుదల వుతుందని వివరించారు.గృహనిర్మాణ శాఖ ఏఈ శ్యాంసుందర్ మాట్లాడుతూ గత ప్రభు త్వంలో మంజూరైన ఇళ్లలో కొన్నిటిలో నిర్మాణం పూర్తయ్యిందని, మరికొన్ని వివిధ దశలలో ఉన్నాయన్నారు. కొత్తగా 63 మంది సొంత స్థలం కలిగిన వారు దరఖాస్తు చేసినట్టు వెల్లడిం చారు.విద్యుత్ శాఖ ఏఈ అప్పలనాయుడు వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల నివారణపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తాగు నీటి విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎస్ఎస్ఆ ర్ మూర్తి మాట్లాడుతూ, జల జీవన మిషన్ కింద ఐదు జోన్లుగా విభజించి మేఘాద్రిగడ్డ నుండి నీటిని సరఫరా చేసే ప్రణాళిక అమలులో ఉందని తెలిపారు.ఇక జూన్ 21న జరగబోయే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి మండలం నుండి 8000 మందిని భీమిలిలోని ఆర్కే బీచ్ కు తరలించేందుకు 160 బస్సులు ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీడీవో డా. జానకి పేర్కొన్నారు.

ఎంపీపీ శారదా ప్రియాంక మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతి నిధులు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శరదా ప్రియాం క జడ్పిటిసి కోరాడ వెంకటరావు ఎంపీడీ వో డాక్టర్ వి జానకి డిప్యూటీ ఎంపీడీవో సత్యనారా యణ వైస్ ఎంపీపీ లు బోట్ట ధనలక్ష్మి ,శ్రీను మజ్జి వెంకట్రావు బి ఆర్ బి నాయుడు, బోట్ట రామకృష్ణ కలిమి గంగరాజు, బంక శ్రీను తదిత రులు పాల్గొన్నారు.

## కిశోర వికాస శిక్షణ ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహణ





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జూన్ 10:**వేసవి సెలవులను పురస్కరించుకుని కౌమార దశలో ఉన్న బాలికల సాధికారతకు కృషి చేసే విధంగా ‘కిశోర వికాసం’ పేరిట నిర్వహించిన శిక్షణా కార్యక్రమం మంగళవారం రింతాడ అంగన్వాడి కేంద్రంలో ముగిసింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొబ్బిలి లక్ష్మి, ఉప సర్పంచ్ సోమేశ్ కుమార్ పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా జీకే వీధి ఐసిడిఎస్ సిడిపిఓ లక్ష్మీదేవి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ఫలితాలపై కిశోరి బాలికలతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పించామన్నారు.మే 2 నుంచి జూన్ 10 వరకు జరిగిన శిక్షణా కార్యక్రమంలో విద్య, నైపుణ్యం,వ్యక్తిగత శుభ్రత, పోటీతత్వం, ఎదుగుదల వంటి 12 అంశాలపై విస్తృతంగా చర్చించామని తెలిపారు.సర్పంచ్ బొబ్బిలి లక్ష్మి మాట్లాడుతూ, బాల్య వివాహాల నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.ఇది ఆడపిల్లల భవిష్యత్‌ను వెలుగుల బాటలో నడిపించడమేనని అన్నారు.ఉప సర్పంచ్ సోమేశ్ కుమార్, ఐసిడిఎస్ సూపర్వైజర్ మోహిని, మహిళా పోలీస్ శాంతి కూడా బాలికల అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలపై తల్లిదండ్రులకు, బాలికలకు అవగాహన కల్పించారు.కార్యక్రమం ముగింపులో కిశోరి బాలికలు, తల్లిదండ్రులతో కలిసి బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ర్యాలీ రూపంలో మానవహారం ఏర్పాటుచేసి గ్రామస్తులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో రింతాడ, అసరాడ, తోటమాడి వీధి, నూతి బంధ, ఇంద్రనగర్ కొత్తూరు, ఊబపాలం, తీముల బంధ, కడుగుల గ్రామాలకు చెందిన అంగన్వాడి టీచర్లు రమాజ్యోతి, పార్వతి, పద్మ, లక్ష్మి, పూర్ణ, సత్యవేణి, కుమారి, రూబీ, లక్ష్మి పాల్గొన్నారు. బాలికలు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రైతులకు వ్యవసాయ శాఖ పనులు, పథకాల గురించి అవగాహన కల్పించిన వ్యవసాయ అధికారులు..



**కశింకోట, పెన్ పవర్,జూన్ 10:**మండలం లోని,పల్లపు సోమవారం గ్రామం నందు పల్లె నిద్ర కార్యక్రమం మంగళవారం నిర్వహించారు.ఈ కార్యక్రమం లో శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడిఎ బి.మోహనరావు , మాట్లాడుతూ వ్యవసాయ శాఖ లో జరుగుతున్న పనులు పథకములు గురించి పూర్తిగా వివరించారు. కౌలు రైతులు కార్డులు గురించి , అన్నదాత సుఖీభవ , ప్రధానమంత్రి కిసాన్, ప్రకృతి వ్యవసాయం , పీఎండీస్ విత్తనాలు , వరి విత్తనాలు వాటి గుణగణాలు , యంత్ర పరికరాల, వ్యవసాయ పనిముట్లు ఇలా వ్యవసాయానికి సంబంధించి ప్రతి అంశమూ చాలా క్లుప్తంగా అందరికీ వివరించి చెప్పడం జరిగింది. అనంతర. ఎంఎల్ఏ రామకృష్ణ చేతుల మీదుగా వరి విత్తనాలు పంపిణీ వ్యవసాయ పనిముట్లుచేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారిని స్వప్న మాట్లాడుతూ వరి విత్తనాలు కావాల్సిన రైతులు అందరూ తమ గ్రామ రైతు సేవా కేంద్రంలో నమోదు చేయించు కోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, రైతులు, మండల వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## అనకాపల్లిలో అమరావతి నిరసన సెగలు





**అనకాపల్లి, పెనపవర్, జూన్ 10:**అమరావతి మహిళలపై అసభ్యకరంగా మాట్లాడిన సాక్షి టీవీని మూసివేయాలంటూ అనకాపల్లి జిల్లా తెలుగు మహిళ ల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. అనకాపల్లి జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆడారి మంజు ఆధ్వర్యంలో అనకాపల్లి ఎన్టీఆర్ జంక్షన్ నుంచి నెహ్రూ చౌక్ జంక్షన్ వరకు తెలుగు మహిళలు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం నెహ్రూ చౌక్ జంక్షన్లో మానవహారంగా ఏర్పడి సాక్షి డౌన్డౌన్ అంటూ నినాదాలు చేశారు.తెలుగు మహిళలు సాక్షి పత్రికను చించి తగలపెట్టి నిరసన వ్యక్తం చేశారు.అనకాపల్లి జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆడారి మంజు మాట్లాడుతూ మహిళలపై ఎంత నీచంగా మాట్లాదిన వారిని కఠినంగా శిక్షించాలని, సాక్షి టీవీ యాజమాన్యంపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## పిల్లలను హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో నమోదు చేయడం తప్పనిసరి

**ప్రజలకు పసుపులేటి నాగమణి అవగాహన కల్పన**

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూన్ 10:**రాష్ట్రంలోని పలు గ్రామాల్లోని తల్లిదండ్రులు తమ పిల్లలను రేషన్ (రైస్) కార్డుల్లో మాత్రమే నమోదు చేయించుకుంటున్నప్పటికీ, హౌస్ హోల్డ్ మ్యాపింగ్ ప్రక్రియలో నమోదు చేయడం పట్ల అవగాహన లేకుండా ఉన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ పసుపులేటి నాగమణి ప్రజలకు స్పష్టంగా ఒక ప్రకటనలో తెలియజేశారు.రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం, అన్ని సంక్షేమ పథకాల అర్హత నిర్ణయానికి హౌస్ హోల్డ్ మ్యాపింగ్ ఆధారంగా మానదండుగా ఉంటుంది. ఈ నేపథ్యంలో, కుటుంబంలో ఉన్న చిన్న పిల్లలు ఎవరైనా వారు రైస్ కార్డులో ఉన్నా సరేహౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో నమోదు చేయడం అత్యవసరం.“తల్లిదండ్రులు గమనించాల్సిన ముఖ్యమైన విషయం ఏమంటే, పిల్లలను హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో నమోదు చేయకపోతే, వారు భవిష్యత్‌లో పథకాలకు అనర్హులవుతారు. ఇది ముఖ్యంగా విద్యా సంబంధిత పథకాలపై ప్రతికూల ప్రభావం చూపించవచ్చు,” అని పసుపులేటి నాగమణి తెలిపారు.అందువల్ల ప్రతి సచివాలయం పరిధిలో ఉన్న ప్రజలకు, ముఖ్యంగా పాఠశాలల్లో చదువుతున్న పిల్లల తల్లిదండ్రులకు ఈ విషయాన్ని తెలియజేయాలని కోరారు. గ్రామ సచివాలయం సిబ్బంది, విద్యా సిబ్బంది, స్థానిక నాయకులు కలిసి ఈ అవగాహన కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పకుండా హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో నమోదు చేయించుకుని, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేలా జాగ్రత్తలు తీసుకోవాలనీ పిలుపునిచ్చారు.



## ప్రివెంటివ్ హెల్త్ చెకప్ క్యాంప్‌ను విజయవంతం



**ములగాడ, పెన్ పవర్, జూన్ 10 :**హిందూస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ 85 వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా, ఎంప్లాయీ స్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ సహకారంతో, కాంట్రాక్ట్ కార్మికుల కోసం ప్రత్యేకంగా ప్రివెంటివ్ హెల్త్ చెకప్ క్యాంప్‌ను విజయవంతంగా నిర్వహిం చింది. ఈ శిబిరం 2025 జూన్ 9 %ఙ% 10 తేదీలలో ఉదయం 9:00 నుండి మధ్యా హ్నం 13:00 గంటల వరకు హిందూస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లోని ఓ హెచ్ సి లో జరిగింది. అనేక మంది కాంట్రాక్టు ఉద్యోగులు ఈ శిభిరం లో పాల్గొన్నారు.అనారోగ్యనివారణ ఆరోగ్య సంరక్షణను ప్రోత్సహించడం మరియు శ్రామిక శక్తిలో సంభావ్య ఆరోగ్య సమస్యలను ముందస్తుగా గుర్తించడం లక్ష్యంగా పెట్టుకుని ఈ శిభిరం ఏర్పాటు చేయడం జరిగింది.రక్తంలో చక్కెర, హిమోగ్లోబిన్, రక్తపోటు, ఈసీజీ వంటి వి ఆరోగ్య సంరక్షణ తనిఖీలు నిర్వహించారు. రెండు రోజులలో సుమారు 500 మంది కాంట్రా క్ట్ కార్మికులను పరీక్షించారు, ఆరోగ్య సమస్య లను వెంటనే గుర్తించి, సంబంధిత మందులను అందజేశారు. అవసరమైన చోట వైద్య సహా యం కోసం ఈఎస్ఐ ఆసుపత్రికి మరిన్ని సిఫా ర్సులు చేయడం జరిగింది.హిందూస్తాన్ షిప్ యార్డ్ యాజమాన్యం తన కాంట్రాక్ట్ కార్మికుల ఆరోగ్యం, భద్రత మరియు సంక్షేమం పట్ల నిరంతర శ్రద్ధ వహిస్తుందని ఉన్నతాధికారులు తెలియజేసారు.

ఈ కార్యక్రమం నకు జనరల్ మేనేజర్ హెచ్ ఆర్ రాజేంద్రన్, డి జి ఎం హెచ్ ఆర్ కోటేశ్వరరావు, షిప్ యార్డ్ ప్రధాన వైద్యాధికారి చంద్రశేఖర రెడ్డి, ఈ ఎస్ ఐ సి గాజువాక బ్రాంచ్ మేనేజర్ %ఙ% ఈ ఎస్ ఐ సి వైద్యులు పాల్గొన్నారు.

## జీకే వీధి పంచాయితీలో జనసేన పార్టీ పంచాయతీ నూతన కమిటీ ఏర్పాటు





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జూన్10:**అరకులోని పార్లమెంటు మరియు పాడేరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ డాక్టర్.వంపూరు గంగులయ్య యొక్క ఆదేశాల మేరకు, పాడేరు నియోజకవర్గ కోర్ కమిటీ సభ్యులు గొర్లె వీరవెంకట్ మరియు మండల జనసేన అధ్యక్షులు కొయ్యం బాలరాజు ఆధ్వర్యంలో జీకే వీధి పంచాయితీకి నూతన కోర్ కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.ఈ కార్యక్రమంలో గడుతూరి పరమేశ్వరరావు అధ్యక్షుడిగా, గెమ్మెలి నర్సింగరావు ఉపాధ్యక్షుడిగా, కిల్లో సూరిబాబు ప్రధాన కార్యదర్శిగా,కిల్లో రాంబాబు, కార్యదర్శిగా,కొర్ర కృష్ణ కార్యదర్శిగా,సోషల్ మీడియా బాధ్యతలు సురకత్తి నాగేశ్వరరావు, మహిళా విభాగ బాధ్యతలు సలిమితి రేణుక చేపట్టారు.ఈ సందర్భంగా గొర్లె వీరవెంకట్ మాట్లాడుతూ, “గ్రామ పంచాయితీల స్థాయిలో కమిటీలు ఏర్పడటంతో పార్టీ బలోపేతం సాధ్యమవుతుంది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను లక్ష్యంగా పెట్టుకుని పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి” అని అన్నారు. అలాగే, గ్రామాలలోని ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల అధ్యక్షులు కొయ్యం బాలరాజు మాట్లాడుతూ, “కొత్తగా నియమితులైన కమిటీ సభ్యులు తమ తమ పంచాయితీలో పార్టీ ప్రాధాన్యతను పెంచేందుకు, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయాలి” అని సూచించారు.ఈ కార్యక్రమంలో పెదవలస సర్పంచ్ పాంగి కృష్ణ వంశీ, సోషల్ మీడియా ఐటీ ఇంచార్జ్ కొయ్యం ఇమ్మానుయేల్ (సిద్దు), మొట్టడం వెంకటేష్, పాంగి చంటిబాబు, గెమ్మెలి వెంకటేష్, గెమ్మెలి ప్రసాద్, కొర్ర కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి రైతులపై అసభ్య పదజాలంతో అవమానించిన వారి పై తక్షణమే చర్య తీసుకోవాలి-ఎమ్మెల్యే






**చోడవరం పెన్ పవర్ జూన్ 10**: చోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ ఎస్ రాజు నేతృత్వంలో సాక్షి ఛానల్ లో అమరావతి మహిళలపై అసభ్య పదజాలంతో దూషించిన, అవమానించిన వైయస్ భారతి, కొమ్మినేని శ్రీనివాస్, కృష్ణంరాజులపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ నియోజకవర్గం నందు నిరసన ర్యాలీ కార్యక్రమం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో చేయడం జరిగింది.ఈ కార్యక్రమం లో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, ఎక్స్ జడ్పీటీసీ మత్స్య రాజు, ,కార్యకర్తలు, తెలుగుయువత,తెలుగు విద్యార్థి యువజన సంఘాలు,కార్యకర్తలు పాల్గొన్నారు

# జాతర గట్టు పై ఘనంగా వారాల పండగ .







**బిమిలి,పెన్ పవర్, జూన్ 10** :విశాఖపట్నం పరిసర ప్రాంతాల ఆరాధ్య దైవం మధురవాడ చంద్రంపాలెం జాతర గట్టు పై కొలువై ఉన్న శ్రీ దుర్గాలమ్మ అమ్మవారు , శ్రీ బంగారమ్మ అమ్మవార్ల వారాల పండగ ఘనంగా జరిగింది, జాతర గట్టు శ్రీదుర్గాలమ్మ అమ్మవారికి నిత్య అర్చనలతో ప్రారంబమై

పంచామృత సుగంధ జాలాభిషేకములు ఆలయ అర్చకులు పట్నాల హరిప్రసాద్ శర్మ మూర్తి శర్మలు జరిపి అనంతరం,అలంకరణ చేసి ప్రత్యేక కుంకుమార్చనలు, పుష్ప అర్చనలు మొదలగు పూజ కార్యక్రమాలు జరిపి నీరాజన మంత్ర పుష్పం సమర్పించి భక్తులకు అమ్మవారి దర్శనాలు తీర్ధ ప్రసాదాలు అందజేశారు ఈ వారాల పండగ ప్రతి ఏటా జేష్ఠ మాసం శుక్ల పక్షం పౌర్ణమికి ముందు వచ్చే మంగళవారం ఆనవాయితీ ఈ సంవత్సరం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం జేష్ఠ మాసం చతుర్దశి మంగళవారం జరపడం జరిగింది, అందులో భాగంగా అమ్మవారి వారాల పండగ ముందుగా మధ్యాహ్నం 3:00 గంటలకు శ్రీ బంగారమ్మ అమ్మవారికి చంద్రంపాలెం గ్రామంలో ఉన్న అమ్మవారి ఇంటి నుండి అమ్మవారి (జంగిడతో) సంబరం మేళ తాళాలు, మహిళా కోలాటం, కర్రసాము, బేతాళ డాన్సులు, మహిళల తీన్ మార్, సన్నాయి వాయిద్యాలు, మొదలగు నేల డాన్సులతో ఊరేగింపుగా బయలుదేరి గ్రామం లో అన్ని వీధులు తిరుగుతూ బంగారమ్మ గుడి కి చేరుకొని బంగారమ్మ అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించడం జరిగింది అనంతరం, సాయంత్రం 4:00 గంటల కు మరల అమ్మవారి ఇంటి నుండి పూజారి అమ్మవారి జంగిడ తలపై పెట్టుకొని సంబరం మేళ తాళాలు, మహిళల కోలాటం, కర్రసాము, మహిళల తీన్ మార్, సన్నాయి వాయిద్యాలు మొదలగు నేల డాన్సులతో ఊరేగింపుగా బయ లుదేరి గ్రామంలోని అన్ని వీధులు తిరుగుతూ శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకొని శ్రీ దుర్గాలమ్మ అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించడం జరిగింది,

వారాల పండగ సందర్భంగా వీరభద్ర స్వామి, విజయలక్ష్మి కుటుంబ సభ్యుల సహకారంతో శ్రీదుర్గాలమ్మ అమ్మవారికి తీపి బూంది నైవేద్యం నివేదించి భక్తులకు ప్రసాదం వితరణ చేశారు,

ఈ కార్యక్రమంలో చంద్రంపాలెం గ్రామ పెద్దలు, శ్రీ దుర్గాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు, చంద్రంపా లెం గ్రామస్తులు, మరియు యూత్ సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వరకట్న వేధింపుల కేసులో నిందితులకు 1సం. సాధారణ జైలు, జరిమానా



విజయనగరం మహిళా పిఎస్ డిఎస్పీ ఆర్.గోవిందరావు

**క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, విజయనగరం,జూన్ 10** :విజయనగరం మహిళా పోలీసు స్టేషనులో 2018సం.లో నమోదైన వరకట్న వేధింపుల కేసులో నిందితులు ముగ్గురికి 1సం. సాధారణ జైలు, రూ.51వేలు జరిమానా విధిస్తూ విజయ నగరం జె.ఎఫ్.సి.ఎం. (స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి కుమారి పి.బుజ్జి తీర్పు వెల్లడిం చినట్లుగా విజయనగరం మహిళా పిఎస్ డిఎస్పీ ఆర్.గోవిందరావు జూన్ 10న తెలిపా రు.వివరాల్లోకి వెళ్ళితే.. విజయనగరం పట్టణం కు చెందిన ప్రవీణ గోగులకు తమిళనాడు రాష్ట్రం పెరంబదూర్కు చెందిన పసుపులెట్టి జాషువతో 2017సం.లో వివాహం అయ్యిందని, వివాహ సమయంలో రూ.10 లక్షలు కట్నం, మూడు తులాలు బంగారు వస్తువులను కానుక గా తన కన్నవారు ఇచ్చినారని, వివాహం అనం తరం భర్త పసుపులెట్టి జాషువ,అతని తల్లిదం డ్రులు భాస్కరరావు, సుజాతలు అదనంగా మరో రూ.5లక్షలు కట్నంగా తీసుకురావాలని శారీరకంగా, మానసికంగా వేధింపులకు పాల్ప దేవారని మహిళా పోలీసు స్టేషనులోజూన్ 06 తేదిన ఫిర్యాదు చేసారు. ప్రవీణ గోగుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి మహిళా పిఎస్ ఎస్ఐ ఎ.వెంకటరావు కేసు నమోదు చేసి,దర్యాప్తు చేసి, నిందితులను అరెస్టు చేసి, కోర్టులో అభి యోగ పత్రం దాఖలు చేసారని డీఎస్పీ ఆర్.గో విందరావు తెలిపారు.కోర్టు విచారణలో ఫిర్యాది భర్త పసుపులెట్టి జాషువ (ఎ-1), మామ పసుపు లెట్టి భాస్కరరావు (ఎ-2) మరియు అత్త పసు పులెట్టి సుజాత (ఎ-3) వరకట్న వేధింపుల కు పాల్పడినట్లుగా రుజువు కావడంతో నిందితులు ముగ్గురికి 1సం. సాధారణ జైలు, రూ.51వేలు జరిమానా విధిస్తూ విజయనగరం జె.ఎఫ్.ఎం. సి. (స్పెషల్ మొబైల్ కోర్టు) న్యాయమూర్తి తీర్పు వెల్లడించారని మహిళా పిఎస్ డిఎస్పీ తెలిపారు. ఈ కేసులో పోలీసువారి తరుపున ఎపిపి శాంతి గౌతమి వాదనలు వినిపించగా, కేసును అప్పటి ఎస్ఐ ఎ.వెంకటరావు దర్యాప్తు చేయగా, కోర్టు కానిస్టేబులు వై.పూర్ణ సాకులను సకాలంలో కోర్టులో హాజరుపర్చారని మహిళా పిఎస్ డిఎస్పీ ఆర్.గోవిందరావు తెలిపారు.

## హెూంగార్డు కుటుంబ సంక్షేమానికి కృషి

- ఉద్యోగ విరమణ చేసిన హెూంగార్డు కుటుంబా నికి 'చేయూత' అందజేత
- విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్,



**క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, విజయనగరం జూన్ 10** :విజయనగరం జిల్లా పోలీసుశాఖలో హెూంగా ర్డుగా పని చేసి, ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన హెూంగార్డు బి.వి.రమణమూర్తికి 'చేయూత"ను అందించేందుకు హెూంగార్డు సిబ్బంది ప్రోగు చేసిన ఒక్క రోజు డ్యూటీ అలవెన్సు రూ.3,23,050/- ల చెక్ ను జిల్లాఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ జూన్ 10న జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేసారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ - పోలీసుశాఖలో పని చేస్తూ ప్రమాదవసాత్తు లేదా అనారోగ్యంతో మరణించిన లేదా ఉద్యోగ విరమణ చేసిన హెూంగార్డు కుటుంబాలను ఆర్థికంగా ఆదుకొనేందుకు హెూంగార్డ్స్ స్వచ్ఛం దంగా ముందుకు వచ్చి, ఒక్క రోజు డ్యూటీ అలవెన్సు మొత్తాన్ని ప్రోగు చేసి, వారి కుటుం బాలకు"చేయూత" గా అందజేయడం అభినంద నీయమన్నారు. ఈ తరహా చర్యలు చేపట్టడం వలన పోలీసు ఉద్యోగుల్లో ఐకమత్యం పెరగడం తోపాటు, వారి కుటుంబాలకు అండగా ఉన్నా మన్న భరోసా లభిస్తుందని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు.

ఈ కార్యక్రమంలో హెూంగార్డ్సు ఇన్చార్జ్ ఆర్ఐ ఆర్.రమేష్ కుమార్, ఆఫీసు సూపరింటెండెంట్ టి.రామకృష్ణ మరియు పోలీసు కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కృష్ణాపురం గ్రామ విద్యార్థినికి సైనింగ్ స్టార్స్ అవార్డ్

కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న గంపల సరిష్మ






**చింతపల్లి,పెన్ పవర్, జూన్ 10:** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన చల్లారావు నాగలక్ష్మి దంపతుల కుమార్తె జి సరిస్మా చింతపల్లిలోని సెంటెన్స్ హైస్కూల్లో పదవ తరగతి చదివింది. సరిస్మ కు 567 మార్కులు రావడంతో ఆమెకు విద్యాశాఖ అధికారులు సైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపిక చేశారు. సోమవారం పాడేరులో నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవంలో జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ గంపల సరిష్మకు సైనింగ్ స్టార్స్ అవార్డును ప్రధానం చేశారు. మెడల్ బహుకరించి, సర్టిఫికెట్ అందించి నగదు బహుమతిని అందించడం జరిగింది. సరిస్మ కు సైనింగ్ స్టార్ అవార్డు రావడంతో ఆమె తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాఠశాల యాజమాన్యం సంతోషం వ్యక్తపరిచారు.

# గంగాదేవి జాతర మహెూత్సవాల్లో వాసుపల్లి పూజలు

**ఘనంగా ఆహ్వానించిన మత్స్యకార, ఆలయ నిర్వాహకులు**

**భక్తులకు అన్న ప్రసాద వితరణ చేసిన మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్ జూన్ 10** :మత్స్యకార ఆరాధ్యదైవం గంగాదేవి పండుగ మహెూత్సవంలో మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజ కవర్గ వైసిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్కు మార్ హాజరై అమ్మవార్లను దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం దక్షిణ నియోజకవర్గం లో జరిగిన మత్స్యకార వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్వహకులు, మత్స్యకా ర నాయకులు వాసుపల్లి గణేష్ కుమార్ కి శాలువా కప్పి ఘనంగా స్వాగతించారు ముం దుగా అమ్మవారికి దర్శించుకుని ప్రత్యేక పూజ లు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజే శారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ ఫిషింగ్ హార్బర్, ఉత్తరాంధ్ర మత్స్యకారుల అభివృద్ధి సంక్షేమ సేవా సంఘం, వైశాఖ డాల్ఫిన్స్ బోట్ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన గంగాదేవి వేడుకలుకు తనని ఆహ్వానించడం పట్ల వారికి కృతజ్ఞతలు తెలిపారు. తమ మత్స్యకారులు గంగాదేవినీ కులదైవంగా కొలుస్తూ జీవనం సాగిస్తుంటారన్నారు. ప్రాణాలు పణంగా పెట్టి సముద్రంలోనే రెండు మూడు రోజులు కాకుండా నెలరోజుల పాటు చేపల వేటలో ఉండే సమయంలో తమ మత్స్యకార మహిళలు గంగమ్మ తల్లిని నమ్ముకుని ఇంటి పెద్దాయన కోసం ఎదురు చూస్తూ ఉంటారని వెల్లడించారు. గంగమ్మ తల్లి కరుణ కటాక్షంతో కష్టాన్ని నమ్ముకుని బ్రతికే తమ జాలర్లకు అమ్మ ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని వాసుపల్లి కోరారులి. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యులు మైలపిల్లి లక్ష్మణ్ రావు, సూరపతి నరసింగరావు, గరికిన పశురాముడి,%ూ౨% అప్పారావు,మునం బాలాజీ,అర్జిలా చిన్న, గర్కయ్య, మసీను, రాము, చింతపల్లి వీరన్న,సునీత,వైఎస్ఆర్సిపి జిల్లా వైస్ ప్రెసిడెంట్ %ు% 37వ వార్డ్ కార్పొరేటర్ చెన్నా జానకిరామ్, వైస్సార్సీపీ జిల్లా సెక్రెటరీ ఆది విష్ణు, వైస్సార్సీపీ జిల్లా బీసీ సెల్ సనపల రవీంద్ర భారత, ఎర్రినిమాంభ గుడి చైర్మన్ లండ రమణ, సౌత్ క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షులు సువార్త రాజు (బుజ్జి ),సౌత్ యూత్ అధ్యక్షులు తాడి రవి తేజ, సౌత్ %౦౨% సెల్ అధ్యక్షులు ఆకుల శ్యామ్,37 వ వార్డ్ అధ్యక్షులు ఆకుల యేసు, అచ్యుత్, గంగాల్ల రామరాజు, చింతకాయల వాసు, చేపల రాజు తదితరులు పాల్గొన్నారు



## శ్రీ బంగారమ్మ తల్లి జాతరలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి





**ప్రత్యేక పూజలు చేసిన గణేష్ కుమార్**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జూన్ 10** :దక్షిణ నియోజకవర్గం జీవీఎంసీ పరిధి 29 వ వార్డు ప్రకాశరావుపేట లో ప్రతిష్టాత్మకంగా జరి గిన బంగారమ్మ తల్లి జాతరలో వాసుపల్లి గణేష్ కుమార్ పాల్గొని పూజలు చేశారు ముందుగా ఆలయ కమిటీ నిర్వాహకులు వాసుపల్లిని ఘనంగా ఆహ్వానించారు. అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు అందజేశారు.అమ్మవారి ఆశీస్సు లు వాసుపల్లి గణేష్ కుమార్ పై ఉండాలని ప్రధాన అర్చకులు గణపతిరాజు ఆశీర్వచనాలు అందజేశారు. జాతరకు సహాయ సహకారాలు అందించిన మాజీ వాసుపల్లి గణేష్ కుమార్ తో పాటు, కార్పొరేటర్ చెన్నా జానకిరామ్, 29వ వార్డు వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు పీతల వాసు కు సాలువా కప్పి ఘనంగా సత్కరించారు,వాసుప ల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ బంగారమ్మ త ల్లి పండుగ ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహి స్తున్న నిర్వాహకులకు అభినందనలు తెలిపా రు. కార్యక్రమంలో రామాలయం అధ్యక్షుడు వి పార్థసారథి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వై ధర్మ, ఎర్ర శ్రీనివాస్, గండి రాజు లంకాడ మహేష్ తదితరులు ఉన్నారు.

ఈ కార్యక్రమంలో 37వ వార్డ్ కార్పొరేటర్ చెన్నా జానకిరామ్, సౌత్ అనుబంధ సంఘాల అధ్య క్షులు ఆకులు శ్యామ్, బేవార మహేష్, బొండాడ వెంకటరమణ, గుమ్మడి చంద్రమౌళి, 37 వ వార్డ్ అధ్యక్షులు ఆకుల యేసు, సతీష్, తదితరులు పాల్గొన్నారు

# జోరువానలోనూ ఆగని ప్రజాదర్బార్





- మంత్రి నారా లోకేష్ 65 వ రోజు ప్రజాదర్బార్
- వివిధ సమస్యలతో బాధపడుతున్న వారి నుంచి వినతులు స్వీకరణ
- చివరి వ్యక్తి వరకూ కలిసి ఫోటోలు దిగిన మంత్రి లోకేష్

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జూన్ 10** :విశాఖపట్నం: కూటమి ప్రభుత్వంలో ప్రజాసమ స్యల త్వరితగతిన పరిష్కారం కోసం అవిశ్రాం తంగా కృషిచేస్తున్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్.. ఉత్తరాంధ్రలో తన రెండో రోజు పర్యటనలో విశాఖ పార్టీ కార్యాలయంలో 65వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ సమస్యలతో బాధపడుతున్న సామాన్యుల నుంచి వినతులు స్వీకరించారు. ప్రతి ఒక్కరిని స్వయంగా కలుసుకుని వారి సమస్యలు విన్నారు. ఆయా వినతులపై అక్కడికక్కడే సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అనాథలా వదిలేశారు, ఆదుకోండి,రాష్ట్రవ్యాప్తంగా ప్రభు త్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకుల కు నెలవారీ జీతం చెల్లించడంతో పాటు ఇంటర్ జోనల్ బదిలీలకు అవకాశం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజెస్ గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఇటీవల తన భర్త మరణించారని, ఉన్న ముగ్గురు పిల్లలు తనను అనాథలా వదిలేశారని, వృద్ధాప్య పెన్షన్ అందించి ఆదుకోవాలని విశాఖకు చెందిన అవ్వా కాంతం విన్నవించారు. రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో తన భర్త మరణించారని, తమ కుటుంబానికి చెందవలసిన ఆస్తిని అత్త, మామ, మరిది అన్యాయంగా కాజేశారని విశాఖకు చెందిన రెడ్లదిన్నె శ్రావణి మంత్రి నారా లోకేష్ ను కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి ఆదరణ లేక ఇద్దరు చిన్నపిల్లలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని, విచారించి తగిన న్యాయం చేయాలని కోరారు. ప్రతిపక్ష నేతగా చంద్రబాబునాయుడు గారు 2020లో విశాఖ పర్యటనకు వచ్చినప్పుడు వైసీపీకి చెందిన కేకే రాజు సదరు పర్యటనను అడ్డుకుని నానా బీభత్సం సృష్టించారని, పోలీసులు తూతుమంత్రంగా కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారని విశాఖ తాటిచెట్లపాలెంకు చెందిన కే.గోపాల్ రెడ్డి మంత్రి నారా లోకేష్ ను కలిసి ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి గతంలో కేటాయించిన రెండున్నర ఎకరాల స్థలంలోనే శాశ్వత భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఆనందపురం ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. స్వలాభం కోసం సదరు స్థలంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నిర్మాణానికి కొందరు యత్నిస్తున్నారని, దీనివల్ల విద్యార్థులు నష్టపోతారని మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువచ్చారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం పరిటాల గ్రామంలో తమకు పసుపు-కుంకుమ కింద ఇచ్చిన 1.09 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, ఈ భూమి తమకు వంశపారపర్యంగా వచ్చిందని, అయితే 2022లో జరిగిన రీసర్వేలో ఎఫ్ఎమ్ బీలో సదరు భూమి సబ్ డివిజన్ ను తప్పుగా నమోదు చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని విశాఖ శాతవాహన నగర్ కు చెందిన వై.వసంత లక్ష్మి మంత్రి నారా లోకేష్ ను కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. రీసర్వేలో జరిగిన తప్పులను సరిదిద్ది సదరు భూమిని ఆన్ లైన్ లో నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. విశాఖ లంకలపాలెంలోని కోనేరు అభివృద్ధి పనుల్లో రూ.1.20 కోట్ల నిధుల గోల్ మాల్ జరిగిందని, దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస మంత్రి నారా లోకేష్ ను కలిసి ఫిర్యాదు చేశారు. ఆయా సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.విశాఖ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ జోరువానలోనూ కొనసాగింది. మంత్రి నారా లోకేష్ ను స్వయంగా కలిసి పలు సమస్యలపై వినతులు ఇచ్చేందుకు ఉదయం విశాఖ పార్టీ కార్యాలయానికి ప్రజలు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. ఈ సమయంలో భారీ వర్షం కురిసింది. జోరువానలోనూ ప్రజాదర్బార్ ను కొనసాగించిన మంత్రి.. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. చివరి వ్యక్తి వరకు కలిసి అందరితో ఫోటోలు దిగారు. ప్రజాసమస్యల పరిష్కారంపై మంత్రి లోకేష్ చిత్తశుద్ధి పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

## బాలివివాహాలు నిర్మూలన చేయాలి

- రాజీవ్ నగర్ సంతపాలెంలలో ముగిసిన "కిశోరి వికాసం"వేసవి శిబిరం





**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం జూన్ 10:** బాల్య వివాహాలు నిర్మూలన చేయాలని,18 సంవత్సరాలు పైబడి వయస్సును నిర్దేశిస్తూ శారీరక మానసిక పరివర్తన కలిగిన యువతులు వివాహానికి యోగ్యులని
కిశోర బాలిక కౌమార దశ పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ అర్బన్ చిన్నగదిలి సెక్టార్ సూపర్ వైజర్ వి.సిల్వియ అన్నారు. మద్దిలపాలెం, రాజీవ్ నగర్ సంతపాలెం లలోనిర్వహించిన కిషోరి వికాస్ సమ్మర్ క్యాంపెను ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సెషన్- 12 లో భాగంగా బాల్య వివాహల నిర్మూలన పై పలు చూచనలు చేశారు.ముఖ్యంగా కిశోర బాలికలు ఒకరికొకరు పరిచయం చేసుకోవడం, లక్ష్యాలు నిర్ధారించుకోవడం. కార్యక్రమం ముఖ్య ఉద్దేశం మని అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌమార బాలికలను సాధికారపరచడం, వారిని స్వావలంబనగా ఉండటానికి ప్రేరేపించడం, వారిలో రక్తహీనత సమస్యను అదిగమించేలా చేసి చదువులు మరియు వృత్తిలో వారికి సహాయం చేయడం,ఆరోగ్య సంరక్షణను ప్రోత్సహించడం వారు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి జ్ఞానాన్ని పొందడానికి సమాజానికి బహిర్గతం చేయడం పై ఉపయోగ పడుతుందన్నారు.
కిశోర బాలిక మహిళగా రూపొందే కీలక దశ కౌమార దశ. ఆమెను వర్తమానంలోనే కాదు భవిష్యత్తులోనూ సాధికరతా దిశలో నడిపించడానికి ఆమెకు అవగాహన అవసర మన్నారు. ఆ దిశగా బాలిక తల్లిదండ్రులు సైతం ఆమెను చైతన్యం పరచడంలో దృష్టి సారించారని కోరారు.
రాజీవ్ నగర్ లో అంగన్వాడి టీచర్ లీలారాణి ఆధ్వర్యంలో విద్యార్థులతో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా బాలివివాహలను నిర్మూలించాలని కోరుతూ వారిని చైతన్య పరుస్తూ రాజీవ్ నగర్ పరిసర ప్రాంతాలలో అవగాహన ర్యాలీని ఈ సందర్భంగా 18 సంవత్సరాలు వయసు పైబడి శారీరక మానసిక స్థిరత్వం కలిగిన యుక్త వయసు యువతులు వివాహం చేసుకోవచ్చుని అవగాహన ర్యాలీలో తెలియపరిచారు.కార్యక్రమంలో కిశోర అంగన్వాడీ
సభ్యులు కన్వీనర్ మహిళా సంరక్షణ కార్యదర్శిలు టీచర్లు ఏ ఎన్ ఏం ,ఆశ వర్కర్లు కిశోర బాలికలు పాల్గొన్నారు

## పారిశ్రామిక వేత్తలకు అనునిత్యం చేయూత

- డీసీసీబీ ని రాష్ట్రంలోనే అగ్రగామి సంస్థగా గుర్తింపు పొందాలి
- శాసనసభా సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు





**విశాఖ ఉత్తరం, పెన్ పవర్, జూన్ 10** :విశాఖపట్నం ఉమ్మడి జిల్లాలో ఉన్న చిన్న సన్నకారు రైతులకు,కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న వర్ధమాన వ్యాపారవేత్తలకు, పారిశ్రామిక వేత్తలకు అనునిత్యం చేయూతను అందిస్తూ..ప్రగతి పథంలో ముమ్మందుకు అడుగులు పడే విధంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)ను నడపడం వల్ల ఎంతో మందికి లబ్ది చేకూరుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభా సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు ఆశాభావాన్ని వ్యక్తంచేశారు, మద్రిపాలెం వద్ద జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న డీసీసీబీ కార్యాలయానికి శాసనసభ సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆకస్మాత్తుగా వచ్చి,బ్యాంకు ఛైర్మన్ గా నూతనంగా భాద్యతలను స్వీకరించిన జనసేన పార్టీ రాష్ట్ర పీఏసీ సభ్యులు,గాజువాక నియోజకవర్గం కన్వీనర్ కోన తాతారావుని కలిసి హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలను తెలియజేశారు,అనంతరం బ్యాంకు ఉన్నతాధికారులతో పలు విషయాలపై క్షుణ్ణంగా చర్చించిన అయ్యన్నపాత్రుడు పలు సూచనలు సలహాలను అధికారులకు సూచించారు,అనంతరం అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్నటువంటి బ్యాంకు ఛైర్మన్ కోన తాతారావు అపారమైన అనుభవం జిల్లా రైతాంగానికి,బ్యాంకు అభివృద్ధి పథంలో పయణించడానికి ఎంతగానో ఉపయోగపడు తుందని ఆశాభావాన్ని వ్యక్తంచేశారు,ఈ కార్యక్రమంలో జీవీఎంసీ 75వ వార్డు జనసేన పార్టీ అధ్యక్షులు, గాజువాక పురపాలక సంఘం మాజీ వైస్ చైర్మన్ కోన చిన అప్పారావు,జనసేన వీర మహిళ దాసరి జ్యోతీ రెడ్డి,బ్యాంకు ఉన్నతాధికారులు,అధికారులు,ఉద్యోగులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు,ముందుగా శాసనసభ సభాపతి చింతకాయల అయ్యన్నపా త్రుడుని దుశ్శాలువ,కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీశ్రీశ్రీ వేంకటేశ్వర స్వామి వారి ప్రతిమను అంద జేసి ఘనంగా సత్కరించిన డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు.

## కిషోర్ వికాసం పై సమీక్ష సదస్సు.







**చింతపల్లిపెన్ పవర్ జూన్ 10:-** చింతపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం కిషోర్ వికాసం కార్యక్రమాలపై సమీక్ష సదస్సు నిర్వహించారు. గత నెల 2వ తేదీ నుండి జూన్ 10వ తేదీ వరకు సాగిన ఈ కార్యక్రమాల నిర్వహణపై ఐసిడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి జి. వెంకటరమణి నేతృత్వంలో ఈ సమీక్ష జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీపీ కోరాబు అనూష దేవి, తహశీల్దార్ టి. రామకృష్ణ, ఎంపీడీవో శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రామస్థాయిలో అంగన్వాడి కార్యకర్తలు, ఆరోగ్యశాఖ సిబ్బంది సమన్వయంతో బాలికలలో అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించారని అధికారులు తెలిపారు. కిషోర్ వికాసంలో భాగంగా గ్రామాలలో బాల్యవివాహాలపై అవగాహన కల్పించటం, పౌష్టికాహార ప్రాముఖ్యతను వివరించటం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్టు వెల్లడించారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు మరియు చిన్నారులకు అవసరమైన పోషకాహారం అందించేందుకు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు విజయ కుమారి, గౌరీ, గౌహరున్నీషా, సత్యవతి అంగన్వాడి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## జనసేనలో చేరిన వార్డు సభ్యులు నాగెలి వెంకటరావు

జనసేన బలోపేతానికి కృషి, సమస్య పరిష్కారానికి హామీ





**చింతపల్లి పెన్ పవర్ జూన్ 10:-**
చింతపల్లి మండలం కొమ్మంగి గ్రామ పంచాయతీ కేంద్రంలో గసరి దిలీప్ ఆధ్వర్యంలో జరిగిన ఒక కార్యక్రమంలో చింతపల్లి జనసేన పార్టీ మండల అధ్యక్షులు వంతల బుజ్జిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మారుమూల గిరిజన ప్రాంతాల్లో జనసేన పార్టీని బలోపేతం చేయడానికి పార్టీ కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని కోరారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. తాగునీటి సమస్యపై హామీ కొమ్మంగి గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ఆడపడుచులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్థులు బుజ్జిబాబు దృష్టికి తీసుకొచ్చారు. నుయ్యి నుంచి పైపులైన్ ద్వారా గ్రామానికి వస్తున్న మంచి నీరు సరఫరా అందడం లేదని ఆయనకు వివరించారు. దీనిపై తగిన డిపార్ట్మెంట్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానని బుజ్జిబాబు గ్రామస్థులకు హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు నాగెలి వెంకటరావు తమ కార్యకర్తలతో కలిసి జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ, గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీ నిధులను వెనక్కి తీసుకోవడం ద్వారా సర్పంచులను అడుక్కునేలా చేశారని విమర్శించారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు, పవన్ కళ్యాణ్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి మనస్ఫూర్తిగా జనసేనలో చేరుతున్నానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల కో ఆర్డినేటర్ వంతల రాజు బాబు, సీనియర్ నాయకులు కారేగి మచ్చెరాజు, పాంగి సుబ్బారావు, కొర్ర బాలాజీ, పాంగి క్రిష్ణ, గుంట చంటి, గుంట కోటి, సిందేరి సురేష్ తో పాటు మద్దెల కోటేశ్వరరావు, లక్కే ఈశ్వరరావు, నూకరాజు, కవిత, కాంతమ్మ, చిన్నమి, విరమ్మ, రామ్, సాయి కుమార్, రాజా, సతీష్, కోటి బాబు తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

## పత్రికా కార్యాలయాలపై దాడులు చేసే సంస్కృతి ప్రమాదకరం

సాక్షి కార్యాలయంపై దాడిని ఖండించిన మాజీ మంత్రి మేరుగ నాగార్జున




**తాడేపల్లి: పెన్ పవర్ జూన్ 10:-**పత్రికా కార్యాలయాలపై దాడులు చేసే సంస్కృతి ప్రమాదకరమని వైయస్ఆర్సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున ఆందోళన వ్యక్తం చేశారు. ఏలూరు జిల్లా సాక్షి కార్యాలయంపై దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు.
-ఏలూరు జిల్లా సాక్షి కార్యాలయాన్ని తగలబెట్టడం అత్యంత దారుణం, ఇది పత్రికా స్వేచ్ఛపై దాడి. సాక్షి కార్యాలయాలపై దాడులు సరికాదు. సాక్షి కార్యాలయాలపై దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. దాడులతో పాటు పత్రిక ప్రతులను దహనం చేయడం వంటి చర్యలు దిగ్భ్రాంతి కలిగించాయి. పత్రికా కార్యాలయాలపై దాడులు చేసే సంస్కృతి ప్రమాదకరం. విశ్లేషకుడి మాటలను సాక్షి మీడియా ఖండించినప్పటికీ అరెస్ట్ చేయడం, 70 ఏళ్ల కొమ్మినేనిపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపడం అత్యంత దారుణం.దేశవ్యాప్తంగా ఇలాంటి టాక్ షోలు చేసే వారు అనేక అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తున్నారు.. కొమ్మినేనిపై పెట్టినట్టు వారందరిపైనా అక్రమ కేసులు పెట్టి జైళ్ళకు పంపుతారా%-% అని మేరుగు నాగార్జున ప్రశ్నించారు.

# సీసీఎల్ఏ కమిషనర్ తో ఎమ్మెల్యే ఏలూరి భేటీ

**నాలుగు గ్రామాల రైతుల సమస్య త్వరితగతిన సమస్యను పరిష్కరించండి పట్టాల మంజూరు కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వండి భేటీలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు**



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జూన్ 10**

ఇనాం భూముల సమస్య పరిష్కారానికి సీసీఎల్ఏ (చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్) కమిషనర్ జి. జయలక్ష్మి తో మంగళవారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గం గత 70 నుండి 80 సంవత్సరాలుగా రైతులు సాగు చేసుకుంటున్న ఇనాం భూములకు రైతువారీ పట్టాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రధానంగా పర్చూరు నియోజకవర్గంలోని మార్టూరు మండలంలోని లక్కవరం, జంగమహేశ్వపురం, పర్చూరు మండలంలోని ఏదుబాడు, చెన్నుంబొట్ల అగ్రహారం గ్రామాలలో ఈ భూములు ఉన్నాయన్నారు. రైతులు గత 80 సంవత్సరాలుగా ఇనాం, ఎస్టేట్ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. సన్న, చిన్నకారు రైతులు సాగు చేసుకుంటున్న ఈ భూములు ఇనాం భూములు కావటం వలన వీరికి పట్టాదారు పాసు పుస్తకాలు కానీ, ఏ ఇతర యాజమాన్య హక్కు పత్రాలు కానీ లేకపోవటం వలన వీరు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ల దృష్టికి తీసుకెళ్లాలని వివరించారు. సమస్యను పరిష్కరించేలా ఇప్పటికే ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వం పరంగా అందించే ఎటువంటి సంక్షేమ పథకాలు, సబ్సిడి పధకాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే సమస్యను పరిష్కరించేలా చొరవ చూపాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు.

# మనిషిని అందంగా తీర్చిదిద్దేది టైలర్

**- ఏపీ టైలర్స్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి**



**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ జూన్ 10**

టైలరింగ్ వృత్తి చాలా ఉన్నతమైందని, మనిషిని అందంగా తీర్చిదిద్దేది ఒక టైలర్ మాత్రమే అని ఏపీ టైలర్స్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి అన్నారు. మంగళవారం ఒంగోలులోని నెహ్రూ నగర్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ టైలరింగ్ కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఆయన సందర్శించారు.ఈ శిక్షణ కేంద్రంలో సుమారు 250 మంది కుట్టు మిషన్ పై శిక్షణ పొందుతున్నారు. శిక్షణ పొందుతున్న మహిళలకు ఆయన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు శ్రద్ధ తో నేర్చుకుని ప్రతి ఒక్కరూ వారి స్వయం శక్తితో నిలబడాలని సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి ఇంట్లో ఒక వ్యాపారవేత్త ఉండాలనే ధ్యేయంతో ఇలాంటి శిక్షణ తరగతులకు రూపకల్పన చేశారని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం మహిళా ఉపాధికి కట్టుబడి ఉందని,హ్యాండ్లూమ్ టెక్స్టైల్ మంత్రి ఎస్ సవితమ్మ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ కార్యాలయం ఉద్యోగి చిట్టిబాబు, టైలరింగ్ సంఘ నాయకులు పాల్గొన్నారు.





## రాజధాని మహిళలకు సంఘీభావంగా

# ఒంగోలులో మహిళల భారీ ర్యాలీ









**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 10**

అమరావతి రాజధాని మహిళలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని తెలుగు మహిళలు సూచించారు. ప్రతి ఇంట్లో మహిళను ఏ విధంగా గౌరవిస్తామో ఆదే విధంగా రాష్ట్రంలో ఉన్న ప్రతి మహిళను తమ ఇంటి ఆడ బిడ్డలా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అమరావతి మహిళలను కించపరిచే విధంగా వేశ్యల రాజధాని అని సాక్షి పత్రిక, టీవీ ఛానల్ ప్రసారాల్లో కోట్లాది ప్రజలను అవమాన పరిచేలా వ్యాఖ్యలు చేసిన సాక్షి ప్రతినిధులు ,వాటిని ప్రోత్సహించిన సాక్షి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం ఒంగోలు నగరంలో చర్చి సెంటర్ నుండి అద్దంకి బస్ స్టాండ్ ఎన్టీఆర్ విగ్రహం వరకు వందలాది మంది మహిళలు ,టీడీపీ అనుబంధ సంఘాల మహిళలు, జనసేన, బీజేపీ మహిళా నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా నాయకులు మాట్లాడుతూ, హిందూ మహిళలను కించపరిచే విధంగా వేశ్యల రాజధాని అని సాక్షి లో వ్యాఖ్యలు చేయడం హేయమైన చర్య గా అభివర్ణించారు. జగన్ సతీమణి భారతి కూడా ఒక మహిళ అని అదే ప్రాంతంలో నివాసం ఉన్నారనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని వైసిపి నేతలకు హితవు పలికారు. మహిళలను ప్రతి ఒకరు గౌరవించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఏ పార్టీలో మహిళలు ఉన్నా వారిని గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మన ఇంట్లో కూడా మహిళలు , అడ బిడ్డలు ఉన్నారు అనే విషయాన్ని ప్రతి మనిషి గుర్తు పెట్టుకోవాలి. నోరు ఉందని మహిళలను కించపరిచే విధంగా మాట్లాడటం మంచిది కాదని హితవు పలికారు. మహిళలపై కించపరిచే విధంగా వ్యాఖ్యలు సాక్షి ప్రతినిధులు, యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ మహిళా నాయకులు పాల్గొన్నారు.

# జగన్ పర్యటన వల్ల ప్రయోజనమేమిటి?

**మార్కాపురం శాసనసభ్యులు నారాయణరెడ్డి**



**పొదిలి, పెన్ పవర్, జూన్ 10**

పొదిలిలో బుధవారం నాడు జరగనున్న వైయస్ జగన్మోహన్ రెడ్డి పర్యటన వల్ల ప్రయోజన మేమిటని మార్కా పురం నియోజకవర్గ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ప్రశ్నించారు మంగళవారం నాడు ఆయన పొదిలిలో విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది 12 మిలియన్ల పొగాకు ఉత్పత్తి లక్ష్యం కాగా, 18 మిలియన్ల పొగాకు పండించడం జరిగిందన్నారు అయినప్పటికీ తాము ప్రత్యేక శ్రద్ధ వహించి పొగాకు రైతులతో మాట్లాడి రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పండించిన పొగాకును విక్రయించుకునేలా చూస్తున్నామని చెప్పారు తమ మాటలను పరిగణలోనికి తీసుకున్న పొగాకు వ్యాపారులు కూడా సానుకూలంగా స్పందిస్తున్నారని చెప్పారు సాఫీగా జరుగుతున్న పొగాకు విక్రయాలు జగన్ రాక వల్ల రైతులకు మేలు జరగక పోవడమే గాక, ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని నారాయణరెడ్డి చెప్పారు అంతే తప్ప జగన్ పొగాకు బోర్డు సందర్శన వల్ల రైతులకు కలిగే ప్రయోజనం ఏమి ఉండదని నారాయణ రెడ్డి స్పష్టం చేశారు తన ప్రభుత్వ హయాంలో ప్రజా సమస్యలను గాలికి వదిలేసి, మద్యం వ్యాపారం ద్వారా కోట్లు గడించడమే గాక, ఎంతోమంది పేద మద్యం ప్రియుల ఉసురుపోసుకున్న జగన్ కు హఠాత్తుగా పొగాకు రైతులపై ప్రేమ ఎందుకు పుట్టికొచ్చిందోనని నారాయణరెడ్డి అపహస్యం చేశారు వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండానే, పూర్తి చేసినట్లు చెప్పుకున్న జగన్ లాంటి కపట బుద్ధి గలవారికి గత ఎన్నికల్లో ప్రజలు సరిగ్గా బుద్ధి చెప్పారని నారాయణరెడ్డి విమర్శించారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని తెలుగుదేశ ప్రభుత్వం అమరావతి ని రాజధానిగా చేసేందుకు గట్టి కృషి చేస్తుంటే, జగన్ సొంత చానల్ ద్వారా అమరావతి వేశ్యల రాజధాని అనే అనుచిత వ్యాఖ్యలు వచ్చినప్పటికీ, వాటిని జగన్ ఎందుకు ఖండించ లేదో చెప్పాలని నారాయణరెడ్డి డిమాండ్ చేశారు రాజధాని నిర్మాణం కోసం ఎన్నో ఎకరాల భూములను ప్రభుత్వానికి ఇచ్చిన మహిళా రైతులను వేశ్యలుగా చిత్రీకరించడం ఎంతవరకు సమంజసమని నారాయణరెడ్డి ప్రశ్నించారు ఈ సంఘటన వల్లనే జగన్, ఆయన పార్టీకి మహిళల పట్ల ఏమాత్రం గౌరవ మర్యాదలు ఉన్నాయో ఇట్టే అర్థమవుతుందని నారాయణరెడ్డి ఆక్షేపించారు తన ఉనికిని చాటుకునేందుకే జగన్ పొదిలి పర్యటనకు వస్తున్నారే తప్ప, రైతుల పట్ల ఆయనకు ఏమాత్రం శ్రద్ధాసక్తులు లేవని నారాయణరెడ్డి చెప్పారు ఇప్పటికైనా జగన్, ఆయన పార్టీ నాయకులు ఇటువంటి జిమ్మిక్కులను మానుకొని, ప్రజలకు నిజమైన సేవలు అందించడం ద్వారా, ప్రజల మన్ననలు పొందాలని ఎమ్మెల్యే నారాయణరెడ్డి హితువు పలికారు ఈ సమావేశంలో మండల తెలుగుదేశం నాయకులు కూడా పాల్గొన్నారు.

## ఎస్ జి టి మ్యానువల్ కౌన్సిలింగ్ లో కీలకపాత్ర పోషించిన ఎమ్మెల్సీ శ్రీకాంత్

**శ్రీకాంత్ కు అభినందనల వెల్లువ**



**కందుకూరు పెన్ పవర్, జూన్ 10**

సెకండ్ గ్రేడ్ టీచర్ల కౌన్సిలింగ్ లో ఈసారి వెబ్ కౌన్సిలింగ్ కాకుండా మాన్యువల్ కౌన్సిలింగ్ కొరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తో చర్చించి పట్టుబట్టి నారా లోకేష్ ను ఒప్పించడంలో తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ,కుడా చైర్మన్, ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ కీలక పాత్ర పోషించి సఫలీకృతుడయ్యాడు. ఈసారి రాష్ట్రవ్యాప్తంగా సెకండ్ గ్రేడ్ టీచర్లు మాన్యువల్ కౌన్సిలింగ్ కోరుకున్నారు. టీచర్ల కోరిక మేరకు మంత్రి నారా లోకేష్ ఎమ్మెల్సీలతో చర్చలు జరిపారు. ఈ చర్చల్లో ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ప్రత్యేక చొరవ చూపి ఎస్ జి టి ల మనోభావాలకు అనుగుణంగా మాన్యువల్ కౌన్సిలింగ్ కు మంత్రి నారా లోకేష్ ను ఒప్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయ సంఘాలు మంత్రి నారా లోకేష్ కు ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ కు ధన్యవాదాలు తెలిపారు.

# ఘనంగా సినీ హీరో నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు



**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 10**

పద్మభూషణ్ గ్రహీత, ప్రముఖ సినీ హీరో, హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు ఒంగోలులోని సాయి సరోజ్ మయూరి థియేటర్ ఆవరణలో మంగళవారం నందమూరి బాలకృష్ణ అభిమానులు ఘనంగా నిర్వహించారు. ప్రకాశం జిల్లా నందమూరి బాలకృష్ణ అభిమానుల సంఘం నాయకులు కాట్రగడ్డ వంశీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో బాలకృష్ణ పుట్టినరోజు కేకు ఆయన సీనియర్ అభిమానులు పఠాన్ హనీఫ్ ఖాన్, చావలి గోపి లు సంయుక్తంగా కట్ చేసి అభిమానులకు తినిపించారు. ఈ సందర్భంగా హనీఫ్ ఖాన్ మాట్లాడుతూ స్వర్గీయ నందమూరి తారకరామారావు నట వారసత్వంగా సినీ రంగంలో ప్రవేశించిన బాలకృష్ణ అనంతరం తన స్వశక్తి తో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్నారని అన్నారు. జానపద, పౌరాణిక, సాంఘిక, సైన్స్ ఫిక్షన్ చిత్రాలలో నటించి తన ప్రత్యేకతను చాటుకున్నారని, ఫ్యాక్షన్ సినిమాలకు బాలకృష్ణ ఒక బ్రాండ్ అంబాసిడర్ గా నిలబడ్డారని ఆయన కొనియాడారు. బసవ రామ తారకం క్యాన్సర్ హాస్పిటల్ నిర్వహణలో.. క్యాన్సర్ పేషంట్ల సేవలో ఇండియాలో నెంబర్ - 1 గా కీర్తించడటంలో బాలకృష్ణ సేవలు అనర్వచనీయం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దారపనేని బాలు, రాజా, నాగిశెట్టి మధుసూదన్, చెన్నుపాటి. శ్రీను, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.








On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com

## అమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా బాపట్ల నివాసి నియామకం

**పెన్ పవర్ బ్యూరో బాపట్ల జోన్ 10**

అమలాపురం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమితులైనందుకు బాపట్ల నివాసి శ్రీ వడాలశెట్టి నిర్మల్ కుమార్‌కు అభినందనలు! ప్రస్తుతం (అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న నిర్మల్ కుమార్ తన కొత్త పాత్రకు విస్తృత అనుభవాన్ని తెస్తున్నారు. తాడేపల్లి మరియు అతని స్వస్థలమైన బాపట్ల కమిషనర్‌గా పనిచేసిన నిర్మల్ కుమార్ నియామకం బాపట్ల ప్రజల్లో ఆనందోత్సాహాలను రేకెత్తించింది. ఆయన సాధించిన విజయం పట్ల వారు ప్రగాఢ ఆనందం మరియు గర్వాన్ని వ్యక్తం చేస్తున్నారు, ఆయన కొత్త పదవిలో విజయం కొనసాగాలని కోరుకుంటున్నారు.



పెన్ పవర్
గుంటూరు । బాపట్ల । పల్నాడు

# లాభనష్టాలు చూడకుండా రైతుల కష్టానికి విలువ ఇవ్వండి

**రైతులు సాగుచేయకుంటే తమ కంపెనీలు ఉండవనే నిజాన్ని యాజమాన్యం, ప్రతినిధులు గుర్తించాలి.**
**ప్రతి రైతు వద్ద ఉన్న పొగాకు నిల్వలు కొనాల్సిన బాధ్యత కంపెనీలదే.**
**కంపెనీలు హామీ ఇచ్చినందునే రైతులు ఈ ఏడాది అధిక పెట్టుబడితో ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేశారు.**
**బర్లీ పొగాకు కొనుగోళ్ల సమీక్షలో రైతులు.. రైతుసంఘాలు.. బయ్యర్లు... అధికారుల సమావేశంలో ప్రత్తిపాటి.**












**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జూన్ 10**

బర్లీ పొగాకు రైతులకు అన్యాయం జరిగితే ముఖ్యమంత్రి సహించరని, కూటమిప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలన్న ధృఢచిత్తంతో ఉందని, ఇచ్చిన మాటకు కట్టుబడి కంపెనీలు రైతుల్ని ఆదుకోవాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. పల్నాడు జిల్లా కలెక్టరేట్లో బర్లీ పొగాకు కొనుగోళ్లపై కలెక్టర్ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన అత్యున్నతస్థాయి సమావేశంలో ప్రత్తిపాటి రైతులు, బయ్యర్లకు పలు కీలకసూచనలు చేశారు. తమ వద్ద ఉన్న పొగాకునిల్వలు అమ్ముకోవడానికి ఇన్నాళ్లు వేచిచూసిన రైతులకు తప్పకుండా న్యాయం జరుగుతుందన్న ప్రత్తిపాటి, కొనుగోలుదారుల ఒత్తిడితో ఎవరూ తొందరపడి తక్కువ ధరకు అమ్ముకోవద్దని హితవుపలికారు. ప్రభుత్వ ఒత్తిడితో కొనుగోళ్లు ప్రారంభించిన కంపెనీలు.. మొక్కుబడిగా తక్కువ ధరకు కొని చేతులుదులుపుకునే ప్రయత్నాలు చేయకుండా, రైతులకు నష్టం లేకుండా చూడాలని ప్రత్తిపాటి సూచించారు. పొగాకు కంపెనీలు హామీ ఇచ్చినందునే ఈ సంవత్సరం రైతులు అధికంగా పొగాకు సాగుచేశారని, తమను నమ్మిన రైతుల్ని ఆదుకోవాల్సిన బాధ్యత కంపెనీ యాజమాన్యాలపైనే ఉందని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. లాభనష్టాలు పక్కన పెట్టి, రైతుల కష్టానికి విలువ ఇవ్వాలన్నారు. పెట్టిన పెట్టుబడి కూడా రాకపోతే రైతులు ఎలా బతకాలని, ఎంతకాలం నష్టపోవాలని ప్రత్తిపాటి ప్రశ్నించారు.

**కొనుగోళ్లలో తొలి ప్రాధాన్యత రైతులకే ఇవ్వాలి..**

ప్రభుత్వం నిర్దేశించిన రూ.12వేల ధర ప్రతి రైతుకు అందించాల్సిన బాధ్యత కంపెనీలదేనని, రైతువద్ద ఉన్న చివరి ఆకువరకు కొనేబాధ్యత తీసుకోవాలని ప్రత్తిపాటి ఆదేశించారు. సరుకు బాగాలేదని, రంగు.. నాణ్యత తగ్గిందని చెప్పకుండా ఈ సంవత్సరం రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రత్తిపాటి కంపెనీల ప్రతినిధుల్ని కోరారు. ప్రధాన కంపెనీలన్నీ రైతులకు అండగా నిలిస్తే, ప్రభుత్వం కూడా తగిన సహాయసహాకారాలు అందిస్తుందన్నారు. లాభనష్టాల గురించి ఆలోచించకుండా, నష్టపోయిన రైతుల్ని ఆదుకోవడంపైనే కంపెనీలు శ్రద్ధ పెట్టాలని ప్రత్తిపాటి సూచించారు. నారు ఎంపిక దశలోనే చాలామంది రైతులు నష్టపోయారని, ఇబ్బందులు..సమస్యలు అధిగమించి సాగుచేసిన రైతులకు కూడా న్యాయం చేయకపోతే ఎలాగని ప్రత్తిపాటి కంపెనీల ప్రతినిధుల్ని ప్రశ్నించారు. ఎకరాకు రూ.1.25 లక్షల నుంచి రూ.1.50 లక్షలవరకు పెట్టుబడి పెట్టారని, రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా అందివ్వకపోతే ఎలాగన్నారు. ప్రభుత్వసూచనల ప్రకారం కంపెనీలు, బయ్యర్లు పొగాకు రైతులకు న్యాయంచేయాల్సిందేనని ప్రత్తిపాటి తేల్చిచెప్పారు. కొనుగోళ్లలో తొలిప్రాధాన్యత రైతులకే ఇవ్వాలని, వారివద్ద సరుకు లేకపోతేనే ఇతరుల వద్ద కొనాలని మాజీమంత్రి తెలిపారు. కంపెనీలు... వాటి తరుపు బయ్యర్లు వెంటనే వేగంగా కొనుగోళ్లు జరపాలని, ప్రభుత్వం కూడా 16వ తేదీ నుంచి మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోళ్లు ప్రారంబిస్తుందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్, మురళీ, జిల్లా అధికారులు, చిలకలూరిపేట అగ్రికల్చర్ అధికారులు, నాయకులు వీరారెడ్డి, నెల్లూరి సదాశివరావు , జవ్వాజి మధన్ మోహన్, గట్టినేని రమేష్ , టూరిష్, రైతులు పలువురు పాల్గొన్నారు.

## మహిళలను దూషించిన వారి పై అంత ప్రేమ ఎందుకు జగన్ రెడ్డి

**- ఎమ్మెల్యే గల్లా మాధవి.**





**పెన్ పవర్ గుంటూరు జూన్. 10**

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో మహిళలు, పార్టీ నేతల భారీ నిరసన కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ మహిళలను దూషించిన కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావు, సజ్జల రామకృష్ణ రెడ్డి పై జగన్ రెడ్డి, వై.యస్ భారతిలకు అంత ప్రేమ ఎందుకు అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి నిలదీసారు. మంగళవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి గారి ఆధ్వర్యంలో లక్ష్మీపురం మదర్ థెరిస్సా విగ్రహం నుండి లాడ్జి సెంటర్ అంబేద్కర్ గారి విగ్రహం వరకు మహిళల మరియు ఎన్డీయే కూటమి నేతల భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. వైయస్ భారతీ, జగన్ మోహన్ రెడ్డి, సజ్జల రామకృష్ణ రెడ్డి, కొమ్మినేని శ్రీనివాసరావు మరియు కృష్ణం రాజులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేసి, లాడ్జి సెంటర్ లో సాక్షి పత్రికలను దహనం చేశారు. ఈ సందర్భంగా మేయర్ కోవెలమూడి రవీంద్ర, దాసరి జ్యోతి, తాళ్ళ వెంకటేశ్ యాదవ్, కనపర్తి శ్రీనివాస్ రావు, కసుకుర్తి హనుమంతురావులు మాట్లాడుతూ..... గత ఐదేళ్లు మహిళలను అనేక ఇబ్బందులకు గురిచేసిన వైఎస్సార్సీపీ, ఆ పార్టీ ఛానల్ సాక్షి ఇప్పుడూ అదే పంథా కొనసాగిస్తోందని మహిళలు మండిపడ్డారు. ఘటనపై జగన్, ఆయన భార్య భారతీరెడ్డి కనీసం క్షమాపణ చెప్పక పోవడం దారుణమని, అమరావతి మీద మొదటి నుంచి విషం చిమ్ముతున్న సాక్షి, ఇప్పుడూ ప్రణాళిక ప్రకారం రాజధాని మహిళలపై సభ్య సమాజం తలదించుకునేలా అనుచిత వ్యాఖ్యలు చేయించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొమ్మినేని కోటేశ్వరరావు, ముత్తినేనీ రాజేష్ , శ్రీవల్లి, నేపకా పద్మ, చెంబెటి మణి కుమారి, లామ్ నవమి, శ్రీదేవి, విజయలక్ష్మి, శివలీల, బాల కోటమ్మ,గంటా మౌలిక,గుర్రం మల్లీశ్వరి, కూరాకుల శోభారాణి, శివ జ్యోతి, కరిమూన్, నాగురా, నంది సరస్వతీ, లంకా మాధవి, పోపూరి నరేంద్ర, తెలగతోటి సుధీర్, రాళ్లబండి రామరాజు, చిన్న మస్తాన్ వలి, లామ్ వర్ధన్ రావు, రాజీవ్ ఆనంద్,కోరంగి శ్రీను,దాసరి రమణ, దగ్గు కిరణ్, బండారు వెంకటేశ్వర రావు, సింగంశెట్టి వీరయ్య,వడ్లమూడి వెంకటేశ్వర రావు, గార్డెన్స్ శ్రీకాంత్, పఠాన్ అస్మా, చంద్ర గిరి బాబు,అబ్దుల్ రహీం, యాకోబు, గంధం చలపతి,గుర్రం ప్రసాద్, మొవ్వ వేణు, దామంచర్ల శ్రీనివాస్,కన్నసాని బాజీ తదితరులు పాల్గొన్నారు.

## న్యూ షావోలిన్ కంగూ అకాడమీ సమ్మర్ క్యాంప్ బెల్ట్ టెస్ట్ మరియు మెరిట్ సర్టిఫికెట్లు అందజేత

**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జూన్ 10 :**

చిలకలూరిపేట: సి.ఆర్ క్లబ్ నందు నడుపబడుతున్న న్యూ షావోలిన్ కుంగ్ ఫూ అకాడమీ విద్యార్థులు ఈ సమ్మర్ ఉచితంగా నేర్పించబడిన మార్షల్ ఆర్ట్స్ విద్యకు సంబంధించిన బెల్ట్ టెస్ట్ ప్రతిభ సర్టిఫికెట్లను అకాడమీ వారు స్థానిక రజక కమ్యూనిటి పోలు నందు కార్యక్రమం ఏర్పాటు చేసినారు. దీనికి అతిధులుగా న్యూ షావోలిన్ కుంగ్ ఫు అకాడమీ గౌరవ అధ్యక్షులు, జాతీయ బి.సి సంక్షేమసంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దుల వెంకట కోటయ్య, ప్రముఖ న్యాయవాది దానరి చిట్టిబాబు, లాలుదాసావాబ్ సేవాసమితి అధ్యక్షులు కరిముల్లా, అకాడమీ లీగల్ అడ్వయిజర్ పేరం నగేష్ బాబు, అడాడమీ చీఫ్ షేక్ దరియా వలి, విజయవాడ కుంగ్ ఫు మాస్టర్స్ బి. వెంకట్, రసూల్ పాల్గొని విద్యార్థులకు బెల్టులు మరియు ప్రతిభ సర్టిఫికెట్లను అందజేశారు. దాసరి చిట్టిబాబు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా ఇలా ఎంతోమంది విద్యార్థిని, విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్ లో ఉచిత శిక్షణ ఇస్తూ వారిని మంచిగా ట్రైన్ చేస్తున్న మాస్టర్లను అభినందించారు. షేక్ కరిముల్లా మాట్లాడుతూ సేవా కార్యక్రమంలో భాగంగా ఇలా ఉచిత శిక్షణా కార్యక్రమం నిర్వహించడం, ముఖ్యంగా ఆడపిల్లలను ఈ సమాజంలో మంచి యోధురాళ్ళుగా, సివంగులుగా వారిలోని ప్రతిభను ప్రేరేపించే విధంగా వారికి శిక్షణనిస్తూ మానసికంగా ఆత్మరక్షణకు అవసరమైన శిక్షణను తీసుకుంటున్న విద్యార్థినులకు వారి తల్లిదండ్రులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. మద్దుల వెంకట కోటయ్య మాట్లాడుతూ అకాడమీ స్థాపించిన నాటి నుండి నేటి వరకు అకాడమీకి సంబంధించిన ప్రతి కార్యక్రమానికి తనవంతు సహాయసహకారాలు అందజేసుకుంటూ మంచి కార్యక్రమాలను ఎప్పుడూ ప్రోత్సహించాలని, అదేవిధంగా మా అకాడమీ నిర్వహించే టోర్నమెంట్లలో మా విద్యార్థులు ఎన్నో జాతీయ స్థాయిలో, రాష్ట్రస్థాయిలో, జిల్లా స్థాయిలో విద్యార్థులు విజేతలుగా నిలవటం అలానే మున్ముందు రోజుల్లో కూడా దీనికి సంబంధించిన ఇంకా వారికి శిక్షణకు కావలసిన కిట్లను కూడా త్వరలో అందజేయుటకు ముందుంటామని, ప్రభుత్వం గుర్తించబడినటువంటి ఊషు క్రీడను కూడా మాకు రావడం, దానికి సంబంధించిన ప్రతి విద్యార్థికి అందేవిదంగా అకాడమీ వారు ఎప్పుడూ ముందుంటారని, వారితో మేము కూడా ఉంటామని తెలియజేస్తూ ఈ నెల 14వ తారీకున జైపూర్లో జరగనున్న ఊషూ జాతీయ స్థాయి సీవియర్ టోర్నమెంటుకు వెళుతున్నటువంటి మాస్టర్ విక్రమ్, వారి విద్యార్థులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు, వారు విజేతలుగా నిలవాలని ఆంధ్రప్రదేశ్ పేరు నిలబెట్టాలని కోరారు. మాస్టర్ యడ్ల సురేష్ మాట్లాడుతూ ఒక సమ్మర్ క్యాంప్ మాత్రమే కాకుండా ప్రతిరోజు ఉదయం గం.6.00 నుండి గం.7.30 వరకు ఉచిత మార్షల్ ఆర్ట్స్ శిక్షణ ఇవ్వబడుతుంది, ప్రతి తల్లిదండ్రులు, విద్యార్థిని విద్యార్థులకు ఈ విద్యను ఇప్పించవలసినదిగా కోరారు.తదుపరి వారి చేతుల మీదుగా సర్టిఫికెట్లు, బెల్టులను అందజేశారు.ఈ కార్యక్రమంలో అకాడమీ మాస్టర్స్ పాలపాటి నాగరాజు, కొర్రపాటి రాంబాబు, కుర్చేటి బ్రహ్మయ్య, కాకి ప్రసాద్, ఇన్స్ట్రక్టర్స్ యస్.కె. రబ్బాని, యం.దుర్గా ప్రసాద్, బ్లాక్ బెల్టర్స్ సాకేత్, సుధీర్, ఖమృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



## ఇళ్ల స్థలాల పంపిణీ వేగవంతానికి కృషి శాసనసభ్యులు చదలవాడ -అరవిందబాబు

**పెన్ పవర్ నరసరావుపేట ప్రతినిధి జూన్ 10**

స్థలాల పరిశీలనలో ఆర్ డి ఒ మధులత, ఇతర రెవెన్యూ అధికారులు. నియోజకవర్గ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలాలను అందిస్తామని, ఈ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు అన్నారు. మంగళవారం పట్టణంలో ఐదో వార్డు, రొంపిచర్ల మండల పరిధిలోని గోగులపాడు, ఇక్కుర్తి;;గ్రామాలలో ఉన్న లేఔట్లను ఆయన పరిశీలించారు. శాసన సభ్యులతోపాటు ఆర్డీవో మధులత, రొంపిచర్ల తహసిల్దార్ బండి నిర్మల ఇతర సిబ్బంది ఉన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలలో గత ప్రభుత్వం కేటాయించిన లేఅవుట్లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఇళ్ల స్థలాల విషయమై ఇటీవల శాసనసభ్యులు అరవిందబాబు ఆర్డివోను స్వయంగా కలిసి ప్రజల నుంచి వస్తున్న ఒత్తిడిని, సమస్యలను ఆమెకు వివరించారు. గత ప్రభుత్వం ఈ లేఔట్లను వారి అనుయాయులకు, అనర్హులకు, అడ్డదిడ్డంగా పంపిణీ చేసింది. ఇక్కుర్రు పరిధిలో మున్సిపాలిటీ కి కేటాయించిన లేఔట్ లో 26 ఎకరాల్లో 1205 ప్లాట్లు, గోగులపాడు గ్రామంలో 7.63 ఎకరాలను 280 ప్లాట్లు ఏర్పాటు చేశారు. వీటన్నిటిపై శాసనసభ్యులు అరవిందబాబు అధికారులతో చర్చించారు. పంపిణీకి అవరోధాలు లేకుండా ఆయన చర్యలు తీసుకుంటున్నారు. ఆయనతోపాటు ప్రజాప్రతినిధులు రెవెన్యూ అధికారులు ఉన్నారు.



# మార్క్ ఫెడ్ ద్వారా చీరాలలో బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలులు ప్రారంభించిన జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి, చీరాల మద్దులూరి మాల కొండయ్య

- మార్క్ ఫెడ్ ద్వారా 1.48 లక్షల క్వింటాల పొగాకు కొనుగోలు లక్ష్యం - జూన్16 నుంచి విస్తారంగా మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలులు
- మార్క్ ఫెడ్ ద్వారా జిల్లాలో ఐదు కేంద్రాలు ఏర్పాటు - రైతులకు నష్టం లేకుండా ప్రభుత్వం వేగంగా చర్యలు
- ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు ముగ్గు చూపేవిధంగా ప్రభుత్వం చర్యలు - రైతులను ఆదుకునేందుకే మార్క్ ఫెడ్ ను రంగం లోకి దించిన ప్రభుత్వం







**చీరాల, పెన్ పవర్, జూన్ 10**

బ్లాక్ బెర్లీ పొగాకును ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ప్రకటించారు. చీరాల మండలం పేరాలలోని ఏపీ మార్క్ ఫెడ్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాములో నూతనంగా ఏర్పాటుచేసిన బ్లాక్ బెర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ వెంకట మురళి, చీరాల శాసనసభ్యులు మద్దలూరి మాల కొండయ్య కలిసి రిబ్బన్ కత్తిరించి మంగళవారం ప్రారంభించారు. నష్టపోతున్న రైతులను ఆదుకోవడానికే ఏపీ మార్క్ ఫెడ్ ని ప్రభుత్వం రంగంలోకి దించిందని కలెక్టర్ చెప్పారు. కంపెనీల మాటలు నమ్మి గుంటూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాలలోని రైతులు బ్లాక్ బెర్లీ పొగాకును సాగు చేసి మోసపోయారన్నారు. అలాంటి రైతుల క్షేమాన్ని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని బ్లాక్ బెర్లీ పొగాకును కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం చీరాల, పర్చూరు మండలాలలో రెండు కేంద్రాలను ప్రారంభించామన్నారు. మరో మూడు కేంద్రాలు ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతుల వద్ద 7.48 లక్షల క్వింటాళ్ల పొగాకు ఉన్నట్లు గుర్తించామన్నారు. మార్క్ ఫెడ్ ద్వారా 1.48 లక్షల క్వింటాళ్ల పొగాకును కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈనెల 16 నుంచి విస్తృతంగా



పొగాకు కొనుగోలు చేపడుతామన్నారు. మార్క్ ఫెడ్ తోపాటు ఇతర కంపెనీలు కొనుగోలు చేసేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన పొగాకును ప్రాసెసింగ్ చేసి ఏడాది వరకు నిల్వ ఉంచేలా ఏర్పాట్లు చేశామన్నారు. వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాములను ఇందుకోసం వినియోగిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో రైతులు ఇలాంటి పరిస్థితులతో ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపేలా అవగాహన కల్పిస్తామన్నారు. బాపట్ల జిల్లా పరిధిలోని భూముల పరిస్థితులు, భూసారం ఆధారంగా ఎలాంటి పంటలు వేయాలో పరీక్షించి చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను గుర్తించి మొక్కజొన్న, శనగ, వేరుశెనగ వంటి పంటలను సాగు చేసేలా వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు. ఈ ఏడాది జూలై నెలలోనే కృష్ణా పశ్చిమ డెల్టా, ఎన్ఎస్పి నీరు విడుదల కానుందన్నారు. ఆ దిశగా పంటలు సాగు చేసుకునేలా రైతులను చైతన్య పరుస్తామన్నారు. పొగాకు రైతులను ఆదుకుంటాం, వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని చీరాల శాసనసభ్యులు ఎం మాలకొండయ్య తెలిపారు. బ్లాక్ బెర్లీ పొగాకుకు గత ఏడాది క్వింటా ధర రూ.17 వేలు పలికిందని, ప్రస్తుతం రూ.7000లకు దిగజారటంతో రైతులు నష్టపోతున్నారని చెప్పారు. కంపెనీల మాట విని పొగాకు పంటను అధికంగా ఉత్పత్తి చేయడంతోనే ఈ సమస్య ఎదురయ్యిందన్నారు. రైతుల ఇబ్బందులను తొలగించడానికే మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు పొగాకును కొనుగోలు చేయడానికి యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు ఈ కార్యక్రమంలో మార్క్ ఫెడ్ జిఎం కరుణశ్రీ, ఆర్డీవో చంద్రశేఖర్, తహసిల్దార్ గోపికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి

### ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

### పాపవినాశనంలో సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీ



**పెన్ పవర్ చల్లపల్లి జూన్ 10**

రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తున్నట్లు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఘంటసాల మండల పరిధిలోని పాపవినాశనం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వ్యవసాయ శాఖ సబ్సిడీపై అందించిన వరి విత్తనాలను ఎమ్మెల్యే రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక రైతులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. ధాన్యం అమ్మిన 48 గంటల్లోపు ప్రభుత్వం నగదు జమ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంపటి అనిత, ఘంటసాల మండల టిడిపి అధ్యక్షులు తుమ్మల చౌదరి బాబు, శ్రీకాకుళం ఎంపీటీసీ సభ్యులు తాటికొండ వెంకటేశ్వరరావు (చిన్న), నీటి సంఘాల అధ్యక్షులు బోయిన నాగేంద్ర, తహసీల్దార్ విజయ ప్రసాద్, ఏడిఏ శ్యామల, ఏవో మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శి అన్వర్ షరీఫ్, సచివాలయ ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

## విజయ జూనియర్ కళాశాల విద్యార్థినికి షైనింగ్ స్టార్స్ ప్రతిభా అవార్డు



**పెన్ పవర్ జూన్ 10**

విజయ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం గ్రూపులో అత్యధిక మార్కులు సాధించిన వంగర పావని మచిలీపట్నంలో సోమవారం ప్రభుత్వం వారు నిర్వహించిన షైనింగ్ స్టార్స్ ప్రతిభా అవార్డుల కార్యక్రమంలో కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ గంగాధర్ రావు, జెసి గీతాంజలి శర్మ, డిసిఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, సాల్మన్ రాజుల చేతుల మీదుగా ప్రతిభా అవార్డును అందుకున్నారు. గ్రూపులో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం (965/1000) సాధించిన వంగర పావని కి కళాశాల కరస్పాండెంట్ యార్లగడ్డ శివప్రసాద్, ప్రిన్సిపాల్ షేక్ అబ్దుల్ రహీమ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పెమ్మసాని రమేష్ బాబు మరియు అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

## ఘనంగా జనసేన ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ జన్మదినం...

### జనసేన నాయకులు విన్నకోట సురేష్..





పెన్ పవర్ బ్యూరో బాపట్ల జూన్ 10:

జనసేన పార్టీ అధ్యక్షులు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాజకీయ కార్యదర్శి ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు, ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్ జన్మదినం సందర్భంగా మంగళగిరి సెంట్రల్ పార్టీ ఆఫీస్ లో మంగళవారం బాపట్ల నియోజవర్గ నాయకులు విన్నకోట సురేష్ ఆధ్వర్యంలో వారి జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుత్ను అన్ని నియోజకవర్గ ప్రాంతాల్లో జనసేన పార్టీని మరింత బలోపేతం చేయటానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన తెలిపారు.. జనసేన నాయకులు విన్నకోట సురేష్ మాట్లాడుత్ను జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేసి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అడుగుజాడల్లో నడిచి డిప్యూటీ సీఎం మెచ్చిన నాయకులు ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ నేతృత్వంలో జనసేన పార్టీని బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరం కృషి చేస్తామని తెలిపారు. నాకెంతో ఆప్తులు జన్మదిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు..ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి తులసి కుమారి , కర్లపాలెం మండల అధ్యక్షుడు గొట్టిపాటి శ్రీకృష్ణ, బాపట్ల నియోజవర్గ నాయకులు కారుమూరి అంజేనేష్, పసుపులేటి మహేష్,పడమటి ధర్మారావు గౌడ్, విష్ణుమొలకల చంద్రమోహన్, మడసాని బాలాజీ, అంకిరెడ్డి అనూష్, సాయిన రాంబాబు, సంగీత యేసోబు, కంచర్లపల్లి నరేంద్ర,దండుప్రోలు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## పదిహేను రోజులుగా మంచినీరు రాకపోతే ఏం చేస్తున్నారు..

**అధికారుల తీరుపై ఎమ్మెల్యే నసీర్ ఆసహనం..**

**15 రోజులుగా ట్యాంకర్ ఎందుకు రాలేదు ?**

**కొబ్బరికాయల సాంబయ్య కాలనీలో మంచినీటి సమస్య తెలియదా ?**

**15 నిమిషాల్లో ట్యాంకర్ తెప్పించండి**

**అధికారులకు ఎమ్మెల్యే నసీర్ ఆదేశం**

**ఉదయాన్నే వార్డుల్లో పర్యటించిన ఎమ్మెల్యే**





**పెన్ పవర్ గుంటూరు జూన్10**

పదిహేను రోజులుగా మంచినీరు రాకపోతే ఏం చేస్తున్నారు. ఫిట్టర్ నుంచి ఏఈల వరకు విషయం తెలియదా ? అన్ని తెలిసి కూడా ట్యాంకర్లు ఎందుకు పంపడం లేదు. 15 నిమిషాల్లో వాటర్ ట్యాంకర్ రావాలి. వచ్చే వరకు నేను ఇక్కడే ఉంటాను' అంటూ అధికారుల తీరుపై ఎమ్మెల్యే నసీర్ ఆసహనం వ్యక్తం చేశారు. వార్డుల పర్యటనలో భాగంగా మంగళవారం గుంటూరులోని కొబ్బరికాయల సాంబయ్య కాలనీలో ఎమ్మెల్యే నసీర్ పర్యటించారు. అక్కడ మహిళలు ఎమ్మెల్యే వద్దకు వచ్చి తమకు మంచినీటి ట్యాంకర్ రావడం లేదని తెలపడంతో వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడారు. మంచినీటి సమస్య ఉంటే ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. మళ్లీ ఇలాంటి సమస్య రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మంచి నీటి ట్యాంకర్ వెంటనే వస్తుందని, ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే తనను సంప్రదించాలని స్థానికులకు సూచించారు. అనంతరం వార్డులోని ప్రజలతో మాట్లాడుతూ సమస్యలేమైనా ఉన్నాయా అని వాకబు చేశారు. వారు చెప్పిన విషయాలను నమోదు చేసుకుని వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. శానిటేషన్ పట్ల శ్రద్ధ వహించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే ప్రతి వార్డులో సమస్యలను గుర్తించి పరిష్కారం చూపుతున్నామని తెలిపారు. గతంలో ఈ కాలనీల్లో అడుగు పెట్టడానికి కూడా వీలు లేకుండా ఉండేదని, ప్రస్తుతం పరిస్థితి మారిపోయిందని చెప్పారు. రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణం చేపడుతున్నామని, శానిటేషన్ సమస్య రానీయకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## నరసరావుపేటలో మహిళల నిరసన ర్యాలీ



**పెన్ పవర్ నరసరావుపేట ప్రతినిధి జూన్ 10:**

రెండు రోజుల క్రిందట ఒక ప్రముఖ మీడియా ఛానల్ లో అమరావతి రాజధాని మహిళల శిల హననం గురించి మాట్లాడడన్ని ఖండిస్తూ నరసరావుపేట లో నిరసన ర్యాలీ నిరవశించారు నీరసనలో మహిళలు ప్రముఖ పత్రికను తక్షణమే మూసివేయాలంటూ నినాదాలు చేసారు.మహిళలు నిరసన ర్యాలీ చేపట్టారు. మహిళలకు క్షమాపణలు తెలియజేయాలని సజ్జల రామకృష్ణరెడ్డి ని అరెస్ట్ చేయాలనీ నినాదాలు చేసారు. ర్యాలీలో మహిళలు పెద్ద మొత్తంలో పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ విధానాలపై పోరాటాలకు సిద్ధం కండి

### కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చాల్సిందే

### సిపిఐ పల్నాడు జిల్లా సెక్రెటరీ మారుతి వరప్రసాదరావు



**మాచర్ల : జూన్ 10 మంగళవారం (పెన్ పవర్ న్యూస్)**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టి, రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాదరావు అన్నారు. మంగళవారం స్థానిక సిపిఐ కొమెరా వీరాస్వామి భవన్ తిరునగిరి రామాంజనేయులు మీటింగ్ హాల్లో మిద్దెపోగు బాబురావు అధ్యక్షతన జరిగిన మాచర్ల పట్టణ 16వ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మారుతి వరప్రసాదరావు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం మతోన్మాద విధానాలను విడనాడి మతసామరస్యాన్ని కాపాడాలని, మైనారిటీల రక్షణకు వారి హక్కులకు భంగం వాటిల్లే విధంగా ప్రవర్తిస్తున్న సంఘ పరివార శక్తులను కట్టడి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నిరుపేద ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి సొంత ఇంటి కల వెంటనే నెరవేర్చాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం కాలం నడుస్తున్నా హామీలు నెరవేర్చకపోవడం బాధాకరమన్నారు. వయోవృద్ధులు,వితంతువులకు, ఒంటరి మహిళలకు, వికలాంగులకు అర్హులైన వారందరికీ పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలని, రేషన్ కార్డులు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి వెంటనే రేషన్ కార్డులు మంజూరు చేయాలని ఆయన ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శు లు షేక్ హుస్సేన్, కాసా రాంబాబు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము, నియోజకవర్గ కార్యదర్శి మేకపోతు శ్రీనివాసరెడ్డి తదితరులు మాట్లాడుతూ 100 సంవత్సరాల భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమం స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్నదనిప్రజల కొరకు తమ ప్రాణాలను బలి ఇచ్చిందని భూమికోసం భుక్తి కోసం బడుగు జీవుల విముక్తి కోసం ఎన్నో పోరాటాలు ఎన్నో త్యాగాలు చేసిందని, దేశ స్వాతంత్ర్యం అనంతరం ప్రజల రైతుల కార్మికుల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేసి విజయాలు సాధించిందన్నారు. జూలై నెలలో జిల్లాలో మహాసభలు జరుగుతున్నందున అన్ని శాఖలు మండల మహాసభలు నిర్వహించుకునే కార్యక్రమంలో భాగంగా మాచర్ల పట్టణ మహాసభ విజయవంతంగా నిర్వహించామ న్నారు. అనంతరం మహాసభ మాచర్ల పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నర్రా రంగస్వామి, వెనగంటి చిన్న రామయోగి, వనపర్తి బ్రహ్మాచారి, కందుకూరి వీరబ్రహ్మాచారి, సాంబశివరావు, పెద మంగయ్య, కిరణ్, అమరయ్య, గురులింగం, రమేష్, శ్రీనివాసరావు, సాయికుమార్, మంజుల లక్ష్మయ్య, గరటారావు, చిట్టిప్రోలు అమరేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలి..!


### -ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

**మాచర్ల:: జూన్ 10 (పెన్ పవర్ న్యూస్ )**



కూటమి ఘన విజయం సాధించి.., ఏడాది పాలనలో మాచర్ల నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా సాగిన లక్ష్యాన్ని చాటి చెప్పేలా నిర్వహిస్తున్న విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో కూటమి శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ నెల 12, గురువారం ఉదయం 9.30 నిమిషాలకు స్థానిక శ్రీశైలం రోడ్డులోని పెద్ద ఆంజనేయస్వామి వారి దేవస్థానం వద్ద నుంచి పార్క్ సెంటర్ వరకు సాగనున్న భారీ ర్యాలీకి నియోజకవర్గంలోని అన్నీ మండలాలు నుంచి కూటమి నాయకులు,కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## తిరుమలకు భారీగా పెరిగిన రద్దీ



**తిరుమల, జూన్ 10, (న్యూస్ పల్స్):** వేసవి సెలవులు ముగిసి మరో నాలుగురోజుల్లో పాఠశాలలు ప్రారంభంకానుండటంతో తిరుమలకు భక్తులు పోటెత్తుతున్నారు. తిరుమల కొండపై ఎటుచూసిన భక్త జన సందోహమే కన్పిస్తోంది. సెలవుదినాలు కావడంతో భక్తుల రద్దీ కొనసాగుతోంది. తిరుమలలో ఉన్న 31 కంపార్టుమెంట్లు భక్తులతో నిండిపోయి శిలాతోరణం వరకు భక్తులు క్యూలైన్లలో నిలబడ్డారు. టోకెన్లు లేని భక్తులకు 24 గంటల్లో సర్వదర్శనం అవుతోందని టీటీడీ అధికారులు వివరించారు. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు దర్శనానికి 6 గంటలు పడుతోంది. కల్యాణకట్టలు, లడ్డూ కేంద్రం, అఖిలాండం, అన్నప్రసాద భవనాలూ రద్దీగా మారాయి. గదులకు డిమాండ్ మరింత పెరిగిపోయింది. గదులు పొందేందుకు భక్తులు క్యూలైన్లలో బారులు తీరాల్సి వచ్చింది. సీఆర్వో ప్రాంతమంతా భక్తులతో కిక్కిరిసిపోయింది. అలాగే అలిపిరి, శ్రీవారిమెట్టు మార్గాలు కూడా భక్తులతో కిటకిటలాడుతున్నాయిస్లాటెడ్ సర్వదర్శన టోకెన్లు జారీ చేసే భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాసం, విష్ణు నివాసం కూడా రద్దీగా మారాయి. నిన్న స్వామివారిని 88వేల2వందల57 మంది భక్తులు దర్శించుకోగా 45వేల068 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల రూపేణ శ్రీవారి హుండీకి రూ.3.68 కోట్లు వచ్చాయని తెలిపారు. ఈనెల 9 నుంచి 11వతేదీవరకు తిరుమలలో శ్రీవారి ఆలయంలో సాలకట్ల జ్యేష్ఠాభిషేకం జరుగనుంది. ఏటా జ్యేష్ఠమాసంలో మూడురోజుల పాటు తిరుమల శ్రీవారికి జ్యేష్టాభిషేకం నిర్వహించనున్నారు. మొదటి రోజున శ్రీ మలయప్ప స్వామివారి బంగారు కవచాన్ని తొలగించి హోమాలు, అభిషేకాలు, పంచామృత స్నానం, తిరుమంజనం నిర్వహిస్తారు. అనంతరం స్వామివారికి వజ్రకవచం అలంకరిస్తారు. రెండో రోజు ముత్యాల కవచంతో స్వామిని అలంకరిస్తారు. మూడోరోజు తిరుమంజనాదులు పూర్తిచేసి తిరిగి బంగారు కవచాన్ని సమర్పిస్తారు. జ్యేష్ఠాభిషేకం సందర్భంగా తిరుమలకు భక్తుల రాక మరింత పెరుగుతుందని టీటీడీ అంచనా వేస్తోంది.

## జగన్ అదే తప్పు... మళ్లీ..మళ్లీ చేస్తున్నారా

**విజయవాడ, జూన్ 10, (న్యూస్ పల్స్):** వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఎక్కడకు వెళ్లినా జనం వస్తున్నారు. అది చూసి తనకు మళ్లీ అధికారం వస్తుందని నమ్ముతున్నారు. అందుకే కొంత నిర్లక్ష్యం జగన్ లో కనపడుతుంది. ఈసారి కూడా తన ఫేస్ ను చూసి మాత్రమే జనం ఓట్లు వేస్తారన్న నమ్మకంతోనే జగన్ ఉన్నట్లు కనపడుతుంది. ఎందుకంటే నాయకులతో నిత్యం సమావేశాలు జరపడం, సమీక్షలు నిర్వహించుకోవడం వంటి వాటికి జగన్ నాడు- నేడు దూరమే. అంతా నావల్లనే జరగాలన్న ధోరణిలోనే ఇంకా జగన్ ఉన్నట్లు కనపడుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏదైనా కార్యక్రమాలను చేపట్టడం ప్రతిపక్ష పార్టీకి అవసరం. ఎందుకంటే ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సింది కూడా ప్రతిపక్షమే.... అయితే ఏడాది నుంచి అనేక కార్యక్రమాలకు వైసీపీ పిలుపు నిచ్చింది. కానీ జగన్ మాత్రం అందులో ప్రత్యక్షంగా పాల్గొనకపోవడం ఇప్పుడు పార్టీలో చర్చనీయాంశమైంది. అనేక కార్యక్రమాలు చేపట్టినా జగన్ వాటికి దూరంగా ఉండటం, తాను ఒక్క పిలుపు నిస్తే చాలు అన్న వైఖరి జగన్ లో స్పష్టంగా కనపడుతుంది. ఏడాది నుంచి జగన్ రైతులకు గిట్టుబాటు ధరల విషయంలో బయటకు రావడం, అక్కడక్కడా పరామర్శలు, భరోసా యాత్రలు, వివాహాది శుభకార్యాలకు హాజరు కావడం మినహా జగన్ నేరుగా ప్రత్యక్ష పోరాటాల్లో పాల్గొనింది లేదు. అధికారంలోకి రానప్పుడు జగన్ దీక్షలు, ధర్నాలు స్వయంగా చేస్తూ జనానికి దగ్గరయ్యారు. కానీ మాజీ ముఖ్యమంత్రిగా ఆయన ఉద్యమ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు.ఈ నెల 4వ తేదీన ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయలేదంటూ వెన్నుపోటు దినం అని జగన్ ప్రకటించారు. అంతవరకూ బాగానే ఉంది. అది కూడా అందరూ నేతలు ఇందులో పాల్గొనాలని కోరారు. తాను మాత్రం బెంగళూరులో ఉన్నారు. ఇది క్యాడర్ లోనూ, ప్రజల్లోనూ తప్పుడు సంకేతాలు వెళుతుందని నేతలు చెబుతున్నారు. అదే జగన్ ఏదో ఒక జిల్లాలో వెన్నుపోటు దినం కార్యక్రమంలో పాల్గొని ఉంటే కార్యక్రమానికి మంచి హైప్ వచ్చేదని, మీడియా అటెన్షన్ కూడా వచ్చేదని, జగన్ చేజేతులా ఈ అవకాశాలను తానే దూరం చేసుకుంటున్నారని సొంత పార్టీకి చెందిన సీనియర్ నేతలే వ్యాఖ్యానిస్తున్నారంటే జగన్ కు అర్థం కావడంలేదాజగన్ కూడా ఎన్నికలకు కొద్ది రోజులు ముందు మాత్రమే జనంలోకి రావాలని అనుకుంటున్నట్లుంది. అప్పటి వరకూ అడపా దడపా ఏవో కొన్ని కార్యక్రమాలు చేస్తూ ముందుకెళ్లడమే మంచిదని భావిస్తున్నారు. నేతలు, క్యాడర్ ను ముందుగా రోడ్డు మీదకు తీసుకు వచ్చి వారిని యాక్టివ్ చేసిన తర్వాత మాత్రమే తాను రంగంలోకి దిగాలని భావిస్తున్నట్లుంది. తాను హాజరయిన కార్యక్రమం సూపర్ సక్సెస్ కావాలని, అది అధికారాన్ని మళ్లీ తెచ్చే పెట్టేలా ఉండాలన్న ఆలోచనతోనే ఆయన ఈ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నట్లుందని పార్టీకి చెందిన సీనియర్ నేతలే అంటున్నారు. అంటే ఒకవేళ గెలిస్తే క్రెడిట్ తన ఖాతాలో పడేలా జగన్ వ్యవహరిస్తున్నారని, అది మంచిది కాదని కొందరు వైసీపీ సానుభూతి పరులు కూడా సూచిస్తున్నారు. అధికారంలోకి రాకముందు ఉన్న పరిస్థితులను, నాడు చేసిన కార్యక్రమాలను గుర్తు చేసుకోవాలని కోరుతున్నారు.

## రాజకీయాల్లోకి జూనియర్...

**విజయవాడ, జూన్ 10, (న్యూస్ పల్స్)**

ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికలు వచ్చినప్పుడల్లా జూనియర్ ఎన్టీఆర్ అంశం తెరపైకి వస్తుంది. తాజాగా కేకే సర్వే సంస్థలో కూడా ఎక్కువ మంది జూనియర్ ఎన్టీఆర్ రాజకీయాల్లోకి రావాలని కోరుకుంటున్నట్లు తేలింది. పార్టీలకు అతీతంగా ఆయనకు మద్దతు లభిస్తుందని, అదే సమయంలో జూనియర్ ఎన్టీఆర్ రాజకీయాల్లోకి రావాలని కోరుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉందని తమ సర్వేలో తేలినట్లు కేకే సంస్థకు చెందిన సర్వే తెలిపింది. అంతే కాకుండా జూనియర్ ఎన్టీఆర్ కు పద్దెనిమిదేళ్లకు పైబడిన వారు మాత్రమే కాకుండా 42 ఏళ్లకు పైబడిన వారు కూడా రాజకీయాల్లోకి వస్తే మద్దతు తెలుపుతామని చెబుతున్నారని ఆ సంస్థ సర్వే లో వెల్లడయినట్లు కేకే సంస్థకు చెందిన కిరణ్ కోటేటి తెలిపారు. 2009 ఎన్నికల తర్వాత జూనియర్ ఎన్టీఆర్ రాజకీయాల జోలికి రాకపోయినా ఆయన ను కావాలనుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉండటం ఒకింత ఆశ్చర్యకరమేనని చెప్పాలి. దీంతో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరోసారి జూనియర్ ఎన్టీఆర్ రాజకీయ ప్రవేశంపై చర్చ జరుగుతుంది. అయితే జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తుతం ఏ పార్టీకి మద్దతుదారుగా లేరు. తన తాత ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీకి విధేయుడిగా ఉన్నానంటూ పలు మార్లు ప్రకటించిన జూనియర్ ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వస్తే ఎందులోకి వస్తారు? తెలుగుదేశం పార్టీలో ఇప్పుడయితే ఖాళీ లేదు. ఎందుకంటే నారా లోకేశ్ యువనేతగా టీడీపీలో పాతుకుపోయారు. టీడీపీ భవిష్యత్ నేతగా ఆయన ఎమర్జ్ అయ్యారు కూడా. ఆయన టీడీపీ జాతీయ కార్యదర్శిగా ఉన్నారు. రేపో మాపో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యే అవకాశాలున్నాయి. అదే సమయంలో చంద్రబాబు తర్వాత టీడీపీ వారసత్వం కూడా లోకేశ్ కు మాత్రమే చెల్లుతుంది. . ఇక జూనియర్ ఎన్టీఆర్ విషయానికి వస్తే ఆయనకు తెలుగుదేశం పార్టీ అంటే వల్లమాలిన ప్రేమ. అదే సమయంలో నారా కుటుంబంతో అంత సఖ్యత లేదు. తన తండ్రి హరికృష్ణ నుంచి ఆ గ్యాప్ అలాగే కొనసాగుతుంది. అదే సమయంలో టీడీపీని టేకోవర్ చేసే అవకాశం కూడా లేదు. ఎవరో అభిమానులు ఆశించినంత మాత్రాన అది ఆచరణలో సాధ్యమయ్యే పనికాదు. రాజకీయం వేరు.. సిల్వర్ స్క్రీన్ వేరు. పైగా జూనియర్ ఎన్టీఆర్ ది చిన్న వయసు. ప్రస్తుతం పాన్ ఇండియా స్టార్ గా మరిన్ని సినిమాలు చేయాలని ఆయన ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ఈ సమయంలో ఏపీ రాజకీయాల్లోకి వేలు పెడతారని ఎవరూ అనుకోరు. ఎందుకంటే ఆయన అనేక సార్లు ఇందుకు సంబంధించిన క్లారిటీ ఇచ్చేశారు. చేర్చారు ఇప్పుడున్న సమయంలో... తనకు సినిమాలంటే పిచ్చి అని అదే సమయంలో తన తాత స్థాపించిన తెలుగుదేశం పార్టీ అంటే ప్రేమ అని చెప్పారు. అంత మాత్రాన బంగారం లాంటి అవకాశాలున్న సినీ రంగాన్ని వదులుకుని ఏదో సాధిద్దామని, సేవ చేద్దామని అయితే ఈ వయసులో ఆయన రాజకీయాల్లోకి వచ్చే అవకాశం లేదు. ఇంకా అందుకు చాలా సమయం ఉంది. ఇప్పుడు జూనియర్ ఎన్టీఆర్ ఆగమానికి కూడా సరైన సమయం కాదు. ఏపీలో పర్టిక్యులర్ గా టీడీపీ, వైసీపీ క్షేత్రస్థాయిలో బలంగా ఉన్నాయి. టీడీపీ దారుణంగా దెబ్బతిన్న సమయంలోనే ఆ ఛాన్స్ జూనియర్ కు దక్కే అవకాశముంది తప్పించి ఇప్పట్లో తారక్ రాజకీయ తెరపై మెరిసే అవకాశం లేదన్నది మాత్రం వాస్తవమని విశ్లేషణలు వెలువడుతున్నాయి.

# శభాష్ మాధవీలత...

**హైదరాబాద్ పెన్ పవర్:** కాశ్మీరాన్ని భారత దేశంతో కలపాలనే శతాబ్దాల కల సాకారమైంది. చీనాబ్ వంతెన నిర్మాణం పూర్తయింది. ఎప్పుడో 132 ఏళ్లకు పూర్వం ఆనాటి రాజరిక పాలకులు కన్న కలను ఈ నాటి ప్రజాస్వామ్య ప్రభుత్వం సాకారం చేసింది.

జమ్మూ కాశ్మీర్‌లోని రియాసీ జిల్లాలో చీనాబ్ నదిపై నిర్మించిన చీనాబ్ రైల్వే వంతెనను ఇటీవలనే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే ఆర్చ్ వంతెనగా గుర్తింపు పొందిన చీనాబ్ వంతెన ఒక సాకేతిక అద్భుతం. భారత రైల్వే చరిత్రలో ఇదొక మైలురాయి. అంతే కాదు ప్రపంచం ఎదుట మనం భారతీయులం తలెత్తుకుని నిలిచేలా చేసిన మరో సాంకేతిక అద్భుతం చీనాబ్ వంతెన నిర్మాణం.అత్యంత కఠిన వాతావరణ పరిస్థితులు, భౌగోళిక సంక్లిష్టతలు ఉన్న శివాలిక్ పీర్ పంజాల్ పర్వత శ్రేణులను కలుపుతూ చీనాబ్ నదిపై ఈ వంతెనను నిర్మించారు. వంతెన అంటే వంతెన కాదు.. అదొక ఇంగినీరింగ్ అద్భుతం.. చీనాబ్ నదీగర్భం నుండి 359 మీటర్ల ఎత్తులో నిర్మించిన చీనాబ్ వంతెన, ప్రపంచ పర్యాటక వింతల్లో ఒకటిగా పేర్కొనే పారిస్‌లోని ఐఫిల్ టవర్ ను తలదన్నేలా నిర్మితమైన మహాద్భుతం. అవును ఐఫిల్ టవర్ కంటే 35 మీటర్ల ఎత్తులో చీనాబ్ వంతెన నిర్మాణం అయింది.ఇలా చెప్పుకుంటూ పోతే చెప్పుకోలేనన్ని వింతలు, విశేషాల సమాహారం చీనాబ్ బ్రిడ్జి. ఈ ఆలోచన సాకారం కావడానికి ఏకంగా 132 ఏళ్లు పట్టింది. 1,315 మీటర్ల పొడవైన వంతెన నిర్మాణానికి ఇంతకాలం పట్టిందంటేనే అది ఎంతటి కష్ట సాధ్యమైన కార్యమో వేరే చెప్పనక్కర లేదు. అంతే కాదు ఎంతటి అసాధ్యాన్ని అయినా సుసాధ్యం చేయగల సామర్థ్యం మనకు ఉందని ప్రపంచానికి చాటి చెప్పిన మహాద్భుతం.నిజానికి.. ఇది ఈనాటి ఆలోచన కాదు. దేశ విభజనకు ముందు అప్పటి కాశ్మీర్ రాజు రాజా హరిసింగ్ ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైల్వే లైన్ నిర్మాణం కోసం తొలి అడుగు వేస్తే.. స్వాతంత్రం రాకముందు బ్రిటిష్ పాలకుల కాలంలో.. స్వాతంత్రం వచ్చిన తర్వాత నెహ్రూ మొదలు మన్మోహన్ సింగ్ ప్రభుత్వాల వరకు, రాజా హరిసింగ్ కలను సాకారం చేసేందుకు అనేక ప్రయత్నాలు జరిగాయి. ఒకప్పుడు,, అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ రూ.50 కోట్ల వ్యయంతో వంతెన నిర్మాణానికి ప్రణాళికను సిద్దం చేశారు. కానీ, అది అమలు కాలేదు. ఇప్పుడు.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం రూ.43,800 కోట్ల వ్యయంతో రాజా హరిసింగ్ కలను సాకారం చేసింది. ఆ రోజున.. ఆ మార్గంలో స్టీమ్ ఇంజిన్ రైలు చాలని అనుకుంటే, ఈ రోజున అదే మార్గంలో వందే భారత్ రైలు పరు గులు తీస్తోంది.ప్రదాని నరేంద్ర మోదీ మొదలు మన దాకా.. అందరం సగౌరవంగా తలెత్తుకుని నిలిచామంటే.. అసాధ్యాలను సుసాధ్యం చేసి.. ఇంతటి మహాద్భుతాన్ని మన ముందు నిలబెట్టిన మహనీయులు ఎందరో ఉన్నారు. సాకేతిక సాంకేతిక విజ్ఞానాన్ని వడపోసిన మేథా యోధుల మొదలు, రాళ్లెత్తిన కూలీల వరకూ.. ఎందరో.. ఎందరెందరో ఉన్నారు. అలాంటి వారిలో జి. మాధవీలత ఒకరు. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రాక్ ఇంజనీరింగ్ నిపుణురాలు. మాధవిలత ఈ ప్రాజెక్టుపై జియోటెక్నికల్ కన్సల్టెంట్‌గా 17 సంవత్సరాలు పని చేశారు. నిర్మాణం సవాళ్లతో నిండిపోయింది, అయినా ఆమె, తమ బృందంతో కలిసి వీచే ఎదురు గాలులను సవాలుగా తీసుకుని ఎదురు నిలిచి, డిజైన్ యాజ్ యు గో విధానంలో,ప్రపంచాన్ని అబ్బురపరిచే, ఇంజనీరింగ్ అదుతాన్ని ఆవిష్కరించారు.. చీనాబ్ వంతెన ప్రణాళిక 2005 లో ప్రారంభమైంది, 2022 లో ట్రయల్ రన్ పూర్తయింది. నిజానికి.. ఈ ప్రాజెక్ట్ పుర్తయిందంటే.. అందుకు, ప్రధాన కారణం మాధవీలత. కొండలు గుట్టలను పిండి చేస్తూ.. అసాధ్యాలను సుసాధ్యం చేస్తూ.. అధ్భుత నిర్మాణాలతో ముందుకు సాగిన మాధవీలత.. 17 ఏళ్ల చారిత్రక చీనాబ్ నిర్మాణ ప్రయణాన్ని మాటల్లో వర్ణించడం సామాన్యులకు సాధ్యం కాదు. అందుకే.. ఆమె మాటల్లోనే చెప్పాలంటే.. చీనాబ్ వంతెన వంటి సివిల్ ఇంజనీరింగ్ అద్భుత నిర్మాణం, ప్రణాళిక రూపకల్పనతో మొదలైన తొలి అడుగు నుంచే సవాళ్ళను ఎదుర్కొంది. ప్రతి అడుగులోనూ అవరోధాలు ఎదురయ్యాయి. ముదుకు సాగే కొద్దీ, భౌగోళిక పరిస్థితిలో వస్తున్న మార్పులు ఎప్పటికప్పుడు కొత్త సవాళ్ళను ముందుంచాయి. నిరంతరం మారుతున్న భౌగోళిక, భూసాంకేతిక పరిస్థితులను పరిగణ నలోకి తీసుకుంటే.. ముందుగా నిర్దేశించుకున్న ప్రణాళిక ఆధారంగా, ముందుగా నిర్ణయించిన పరిష్కారాలతో బలమైన డిజైన్ రూపొందించడం అసాధ్యంగా మారిందని ఆమె ఇటీవల ఒక పత్రికలో రాసిన వ్యాసంలో, వివిధ పత్రికలకు ఇచ్చిన ఇంటర్వ్యూలలో పేర్కొన్నారు. అందుకే.. డిజైన్ యాజ్ యు గో విధానం ఎంచుకుని ముందుకు సాగినట్లు చెప్పారు. డిజైన్ యాజ్ యు గో విధానం అవలబించడం వల్లనే నిర్మాణం పూర్తయిందని వివరించారు. నిటారుగా నిలిచిన ఎత్తైన రాతి కొండులు, ఏటవాలుగా నేలకు వాలిన పర్వత శ్రేణులను అనుసంధానం చేస్తూ నిర్మాణ పనులను సాగించడం, ముఖ్యంగా స్థంభాల పునాదులు నిర్మించడం ఒక ప్రధాన సవాలుగా మారిందని చెప్పారు. అయితే.. దృఢ చిత్తంతో ముందుకుసాగి అసాధ్యాలను సుసాధ్యం చేశామని మాధవీ లత చెప్పారు. నిజానికి.. చీనాబ్ వంతెన సాకారం చేయడంలో.. మెయిన్ పిల్లర్ పాత్రను పోషించిన మాధవీలతతో పాటుగా మరెందరో చేసిన కృషి అసాధారణం, అత్యద్భుతం. ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లాలోని యడుగుండ్లపాడు గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించిన మాధవి, %జీచీఖ% నుంచి %దీ.ఎవష్ట్ర, చీఝ% వరంగల్ నుంచి %వీ.ఎవష్ట్ర% (గోల్డ్ మెడల్), %××ఝ% మద్రాస్ నుంచి %భాష్ట్ర.ణ% (2000) పూర్తి చేశారు. 2003 నుంచి %××మాఎ%లో ప్రొఫెసర్‌గా, ప్రస్తుతం సెంటర్ ఫర్ సస్టైనబుల్ టెక్నాలజీస్ చైర్‌పర్సన్‌గా ఉన్నారు. 2021లో ఇండియన్ జియోటెక్నికల్ సొసైటీ నుంచి బెస్ట్ ఉమెన్ జియోటెక్నికల్ రీసెర్చర్ అవార్డు సైతం అందుకున్నారు. 2022లో భారతదేశంలోని టాప్ 75 ఉమెన్ ఇన్ %ూజూూవీ%లో చోటు దక్కించుకున్నారు.ప్రస్తుతం బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ లో జియోటెక్నికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్నారు. IIScలో

మొదటి మహిళా ఫ్యాకల్టీగా, జియోటెక్నికల్ ఇంజనీరింగ్ భవనంలో మహిళల కోసం టాయిలెట్ సౌకర్యం కోసం మాధవీలత పోరాడారు. ఆమె ల్యాబ్‌ను మహిళా విద్యార్థులకు సమాన అవకాశాల కల్పనకు కృషి చేశారు. 2007లో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నుంచి టీచర్ ఎక్స్‌ట్రాఆర్డినరీ అవార్డును మాధవీలత అందుకున్నారు. తెలుగు సంతతికి చెందిన మాధవి లత, ఒకప్పుడు డాక్టర్ కావాలని కలలు కన్నారు. కానీ ఇంజనీరింగ్ వైపు మళ్ళీ చినాబ్ వంతెన నిర్మాణంలో చారిత్రక విజయాన్ని సాధించారు.అందుకే.. ప్రదాని మోదీ.. ఈ అద్భుత సృష్టిలో భాగస్వాములు అయిన ప్రతి ఒక్కరినీ పేరు పేరున అభినందించారు. ముఖ్యంగా.. ప్రధాని మోదీ చీనాబ్ వంతెనను ప్రారంభించిన వెంటనే మాధవీ లతను ప్రత్యేకంగా ప్రశంసిస్తూ, చీనాబ్ వంతెన నిర్మాణంలో మాధవిలత, ఆమె బృందం చేసిన కృషికి దేశం మొత్తం గర్విస్తోందని అన్నారు. ప్రధాని సహా పలువురు ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకున్న మాధవీలత అనేక పురస్కారాలను అందుకున్నారు. మాధవీలత ప్రస్తుతం సెంటర్ ఫర్ సస్టైనబుల్ టెక్నాలజీస్ చైర్‌పర్సన్‌గా ఉన్నారు. ఆమెకు సహజంగానే, దేశం సెల్యూట్ చేస్తోంది

# లోకేష్ కు త్వరలో ప్రమోషన్.. హింట్ ఇచ్చిన చంద్రబాబు

**హైదరాబాద్ పెన్ పవర్:**

నారా లోకేష్ కు ప్రమోషన్ ఖాయమా? పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇస్తారా? లేకుంటే ఏకంగా జాతీయ అధ్యక్ష పదవి ఇస్తారా? ఇప్పుడు పొలిటికల్ వర్గాల్లో అదే చర్చ నడుస్తోంది. మహానాడు వేదికగా కీలక ప్రకటన ఉంటుందని పెద్ద ఎత్తున ప్రచారం నడిచింది. లోకేష్ కు ప్రమోషన్ కల్పించాలని రాష్ట్రవ్యాప్తంగా టిడిపి శ్రేణులు జిల్లాల నుంచి తీర్మానాలు చేసి పంపాయి. మహానాడు వేదికగా ప్రకటనే తరువాయి అన్నట్టు పరిస్థితి ఉండేది. అయితే మహానాడులో అటువంటి ప్రకటన రాలేదు. దీంతో పార్టీ శ్రేణులు తీవ్ర నిరాశలో మునిగిపోయాయి. అయితే ఇప్పుడు లోకేష్ భవిష్యత్తుపై ఆయన తండ్రి, సీఎం చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓ టీవీ ఛానల్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ నర్మగర్భంగా మాట్లాడారు.చంద్రబాబు ఏదైనా నిర్ణయం తీసుకోవాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తారు. పార్టీలో ఏకాభిప్రాయ సాధనకు ప్రయత్నిస్తారు. పార్టీలో ఎటువంటి వ్యతిరేకత రాకుండా చూసుకుంటారు. లోకేష్ విషయంలో కూడా చంద్రబాబు ఆలోచన అదే. లోకేష్ విషయంలో పార్టీ శ్రేణుల నుంచి అభ్యంతరాలు ఉండేవి. ఆయన నాయకత్వం పై అప నమ్మకం ఎక్కువగా ఉండేది. కానీ వాటన్నింటినీ అధిగమించి తనను తాను ప్రూవ్ చేసుకున్నారు నారా లోకేష్. అయితే ఆ పరిస్థితిని అనుకూలంగా మార్చింది మాత్రం



చంద్రబాబు. తండ్రి నుంచి సహనం, మంచి లక్షణాలను అలవరచుకున్నారు నారా లోకేష్. మరోవైపు పార్టీ శ్రేణుల అభిమానాన్ని కూడా చూరగొంటున్నారు. పార్టీలో పదవితో సంబంధం లేకుండా.. టిడిపిని ఒంటి చేత్తో నడిపిస్తున్నారు నారా లోకేష్.మహానాడుల లోకేష్ కు పార్టీ బాధ్యతలు అప్పగించాలన్న డిమాండ్ పార్టీ శ్రేణుల నుంచి విపరీతంగా వినిపించింది. ఇప్పుడు కాకుంటే ఎప్పుడు అని ఎక్కువమంది సీనియర్లు కూడా తమ అభిప్రాయాన్ని బయటపెట్టారు. పార్టీలో విస్తృత చర్చ జరగాలని.. అందరి ఆమోదంతోనే లోకేష్ కు పార్టీ బాధ్యతలు అప్పగించాలన్నది చంద్రబాబు అభిప్రాయం. అందుకే మహానాడు వేదికగా ఆ ప్రకటనకు బ్రేక్ పడినట్లు తెలుస్తోంది. కుటుంబం నుంచి కూడా ఎటువంటి అభ్యంతరాలు లేవు. లోకేష్ కు పోటీ కూడా లేదు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా లోకేష్ టీం తయారవుతోంది. చంద్రబాబు మాదిరిగానే నమ్మకస్తులైన యువ నేతలు లోకేష్ చుట్టూ ఇప్పుడు ఉన్నారు. అందుకే పార్టీ పగ్గాలు ముందుగా అప్పగించాలన్న డిమాండ్ వచ్చింది. అయితే పార్టీ శ్రేణులతో పాటు ప్రజల్లో బలమైన చర్చ నడిచింది. ఈ విషయంలో చంద్రబాబు వ్యూహం వర్కౌట్ అయినట్లు తెలుస్తోంది.

ఓ ఇంటర్వ్యూలో సీఎం చంద్రబాబు మాట్లాడారు. లోకేష్ కు ముఖ్యమంత్రి పదవి అని ప్రశ్న రాగా చంద్రబాబు తనదైన రీతిలో స్పందించారు. అందుకు చాలా సమయం ఉందని మాట్లాడారు. నాయకుడిగా తన ముద్ర చాటుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కష్టపడి పని చేస్తే తప్పకుండా అనుకున్నది సాధించగలరని కూడా అభిప్రాయపడ్డారు. పార్టీలో లోకేష్ పాత్రను గుర్తు చేసేలా చంద్రబాబు వ్యాఖ్యానాలు సాగాయి. ఈ విషయంలో నేరుగా స్పష్టత ఇవ్వకపోయినా.. కష్టపడి పని చేయడం ద్వారా భవిష్యత్తులో లోకేష్ అందరి ఆమోదంతో నాయకత్వ బాధ్యతలు తీసుకుంటాడని మాత్రం చంద్రబాబు చెప్పుకొచ్చారు. ఆ దిశగా సంకేతాలు ఇచ్చారు.

# కలకలం రేపుతున్న ఉత్తరాంధ్ర సర్వే

**హైదరాబాద్ పెన్ పవర్:**

ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది. ఈనెల 12 నాటికి ఏడాది పాలన పూర్తి కానుంది. గత ఏడాది అదే రోజు ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చంద్రబాబు, మరో 24 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. పాలనా బాధ్యతలు తీసుకున్నారు. అయితే ఏడాది కాలంలో ప్రభుత్వం దూకుడు నిర్ణయాలు తీసుకుంది. అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలకు పెద్దపీట వేసింది. ఈ నెలలో కీలకమైన రెండు సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు సిద్ధపడింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ బాగానే కష్టపడుతున్నారు. రాష్ట్ర అభివృద్ధికి తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. అయితే వారి విషయంలో ప్రజల నుంచి సానుకూలత వస్తోంది. కానీ ఎమ్మెల్యేల పనితీరుపై మాత్రం వ్యతిరేకత పెరుగుతోంది. ఈ విషయాన్ని పలు సర్వే సంస్థలు చెబుతున్నాయి. కూటమి ఎమ్మెల్యేలపై క్రమేపి వ్యతిరేకత పెరుగుతోందని హెచ్చరిస్తున్నాయి. వైసిపి హయాంలో కూటమికి అనుకూలంగా ఫలితాలు ఇచ్చిన రైజ్ సర్వే సంస్థ.. ఇప్పుడు కూటమికి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని సర్వే వివరాలు వెల్లడించడం విశేషం. సదరు సర్వే ప్రతినిధి ప్రవీణ్ పుల్లట ప్రాంతాలవారీగా ఎమ్మెల్యేల పనితీరుపై సర్వేలు ఇస్తున్నారు. తాజాగా ఉత్తరాంధ్రకు సంబంధించి సర్వే వివరాలను వెల్లడించారు. ఉత్తరాంధ్రలో 34 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలు, ఉమ్మడి విజయనగరంలో 9, ఉమ్మడి విశాఖ జిల్లాలో 15 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. 2024 ఎన్నికల్లో 34 అసెంబ్లీ స్థానాలకు గాను టిడిపి కూటమి 32 చోట్ల విజయం సాధించింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రెండు చోట్ల మాత్రమే గెలుపొందింది. శ్రీకాకుళం తో పాటు విజయనగరంలో టిడిపి కూటమి క్లీన్ స్వీప్ చేసింది. పార్లమెంట్ స్థానాలను సైతం టిడిపి కూటమి గెలుచుకుంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం అరకు పార్లమెంటు స్థానంతో సరిపెట్టుకుంది. అయితే ఇప్పుడు ఉత్తరాంధ్రలో టిడిపి కూటమి ఎమ్మెల్యేలపై ప్రజల్లో ఒక రకమైన అసంతృప్తి నెలకొని ఉందని రైజ్ సర్వే ఫలితాలు చెబుతున్నాయి. సగానికి పైగా ఎమ్మెల్యేలు వ్యతిరేకత ఎదుర్కొంటున్నారని ప్రవీణ్ పుల్లట సోషల్ మీడియాలో ట్వీట్ చేశారు. దీంతో ఇది టిడిపి కూటమికి మింగుడు పడని అంశంగా మారింది.32 మంది టిడిపి కూటమి ఎమ్మెల్యేలు 17 మంది పై అసంతృప్తి ఉందని తాజాగా ఈ సర్వే వెల్లడించింది. అయితే ఓ 9 మంది ఎమ్మెల్యేలపై మాత్రం తీవ్ర వ్యతిరేకత ఉన్నట్లు స్పష్టమైంది. ఏడాది పాలన సందర్భంగా ప్రవీణ్ పుల్లట ఈ సర్వే ఫలితాలను ద

వెల్లడించారు. నాలుగు ప్రాంతాల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటున్న మొత్తం ఎమ్మెల్యేల జాబితా మీకోసం అంటూ ఆయన హింట్ ఇచ్చారు. త్వరలో మిగిలిన మూడు ప్రాంతాల లెక్కలను విడుదల చేసేందుకు తమ రైజ్ సంస్థ సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. దీంతో టీడీపీ కూటమి శ్రేణుల్లో ఒక రకమైన ఆందోళన కనిపిస్తోంది. గతంలో ఇదే సంస్థ కూటమికి అనుకూల ఫలితాలు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు.అయితే ఇటీవల వరుసగా వస్తున్న సర్వేలు చూస్తే ఎమ్మెల్యేలపై వ్యతిరేకత వుంటోంది. కానీ అదే సమయంలో ప్రభుత్వంపై కొంత సానుకూలత కనిపిస్తోంది. సీఎంగా చంద్రబాబు, డిప్యూటీ సీఎం గా పవన్ కళ్యాణ్ చక్కగా పనిచేస్తున్నారని సర్వేల్లో తేలుతోంది. అయితే ప్రభుత్వ నిఘా వర్గాలు, అంతర్గత సర్వేలతోనే సీఎం చంద్రబాబుతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తమ పార్టీ ఎమ్మెల్యేలకు గట్టి హెచ్చరికలే పంపుతున్నారు. పనితీరు మార్చుకోవాలని సూచిస్తున్నారు. ఇటీవల సీఎం చంద్రబాబు గట్టిగానే మాట్లాడారు. మొత్తానికైతే ఈ సర్వే ఫలితాలు కూటమికి మింగుడు పడడం లేదు

## ఇంగ్లాండ్ సిరీస్‌కు దక్కని ఛాన్స్: కుటుంబంతో కలిసి క్రికెట్ ఆడుతోన్న మహ్మద్ షమీ



**హైదరాబాద్ పెన్ పవర్:** జూన్ 20వ తేదీ నుంచి భారత్, ఇంగ్లాండ్ మధ్య ఐదు మ్యాచుల టెస్ట్ సిరీస్ మొదలు కానుంది. ఈ ప్రతిష్టాత్మక సిరీస్‌కు టీమిండియా సీనియర్ పేసర్ మహ్మద్ షమీకి జట్టులో చోటు దక్కలేదు. ఫామ్ లేమి, ఫిటినెస్ వంటి కారణాలతో బీసీసీఐ షమీని పక్కన పెట్టింది. ఇటీవల ముగిసిన ఐపీఎల్?లో సన్ రైజర్స్ హైదరాబాద్ తరుపున భారీ అంచనాలతో బరిలోకి దిగిన షమీ పూర్తిగా నిరాశపర్చాడు. షమీ విఫలం కావడంతో మధ్యలోనే అతడి జట్టు నుంచి తప్పించింది ఎస్‌ఆర్‌హెచ్.

ఐపీఎల్?లో అట్టర్ ఫ్లాఫ్ షో కూడా ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్?కు షమీకి చోటు దక్కకపోవడానికి ఒక కారణం. ఇంగ్లాండ్ సిరీస్‌కు ఎంపిక కాకపోవడంతో దొరికిన సమయాన్ని షమీ ఫ్యామిలీతో ఎంజాయ్ చేస్తున్నాడు. సరదాగా కుటుంబ సభ్యులతో కలిసి బ్యాక్ యార్డ్ క్రికెట్ ఆడాడు. టీమిండియా ఐకానిక్ బ్లూ జెర్సీ ధరించి బ్యాటింగ్, బౌలింగ్ చేశాడు. స్వతహాగా బౌలరైన షమీ బ్యాటింగ్‌లో వెరైటీ షాట్లు ఆడి ఆలరించాడు. ఇందుకు సంబంధించిన వీడియోను ఇన్స్ స్టాగ్రామ్‌లో షేర్ చేశాడు షమీ. "ఈ రోజు కుటుంబంతో కలిసి మైదానంలో సరదాగా గడిపాను" అని రాసుకొచ్చాడు. ఈ వీడియోలో షమీ టీమిండియా బ్లూ జెర్సీ కలర్ దుస్తులు ధరించడం చూసి అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బ్యాక్‌యార్డ్ క్రికెట్ కూడా టీమిండియా జెర్సీ కలర్ డ్రెస్ ధరించి ఆడటం క్రికెట్ పట్ల ఆయనకున్న ప్రేమను ప్రతిబింబిస్తుందని కామెంట్స్ చేస్తున్నారు. గ్రౌండ్?లోనే కాకుండా వ్యక్తిగతంగా కూడా క్రికెట్ ఆటగాళ్ల జీవితంలో భాగంగా ఉంటుందనడానికి ఇదే నిదర్శనమం టున్నారు. మరికొందరు కమ్ బ్యాక్ షమీ సార్.. మిమ్మల్ని మళ్లీ గ్రౌండ్‌లో చూడాలని కామెంట్లు పెట్టారు. టెస్టు క్రికెట్ లోకి మీరు తిరిగి రావాల్సిన సమయం ఆసన్నమైందని మరికొందరు కోరుకుతున్నారు.

## నికోలస్ పూరన్ షాకింగ్ నిర్ణయం.. అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్ బై!




**హైదరాబాద్ పెన్ పవర్:** వెస్టిండీస్ స్టార్ బ్యాటర్ నికోలస్ పూరన్ షాకింగ్ నిర్ణయం తీసుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్ కు వీడ్కోలు ఇస్తున్నట్లు బాంబ్ పేల్చాడు. అంతర్జాతీయ టెస్టు, వండే, టీ20లకు వీడ్కోలు ఇస్తున్నట్లు సోమవారం (జూన్ 9) ప్రకటించాడు. కేవలం 29 ఏళ్లకే రిటైర్మెంట్ ప్రకటించడం క్రికెట్ ప్రపంచాన్ని షాకింగ్ కు గురిచేసింది. సౌత్ ఆఫ్రికా కీపర్-బ్యాటర్ హెన్రీ క్లాసెన్ రిటైర్మెంట్ ప్రకటించిన రోజుల వ్యవధిలోనే పూరన్ కూడా అదే దారిలో రిటైర్మెంట్ ప్రకటించడం క్రికెట్ అభిమానులను షాకింగ్ కు గురిచేస్తోంది. అయితే పూరన్ ఫ్రాంఛైజ్ క్రికెట్ ను కొనసాగిస్తానని ప్రకటించాడు. అంటే ఐపీఎల్ లాంటి మెగా టోర్నీలు మాత్రం ఆడనున్నాడు.

ఎంతో ఆలోచించాక రిటైర్మెంట్ తీసుకోవాలనే నిర్ణయానికి వచ్చానని ఇన్ స్టాలో పోస్ట్ చేశాడు పూరన్. ఇది చాలా కష్టమైన నిర్ణయమే అయినప్పటికీ.. పర్సనల్ లైఫ్, ఫ్యామిలీని దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నాడు.క్రికెట్ తనకు ఎంతో ఇచ్చిందని, ఎన్నో జ్ఞాపకాలు, అనుభవాలు ఉన్నాయని తెలిపాడు. వెస్ట్ ఇండీస్ ప్రజలకు ప్రాతినిథ్యం వహించడం అదృష్టంగా పేర్కొన్నాడు. దేశం కోసం ఆడటం, గ్రౌండ్ లో నిలబడి జాతీయ గీతం ఆలపించడం.. ఆ ఉద్వేఘ్నమైన క్షణాలను ఎప్పటికీ మరువలేనని చెప్పాడు పూరన్. ఇంతటి ప్రేమ, అభిమానాన్ని పంచిన ఫ్యాన్స్ కు రుణపడి ఉంటానని ఇన్ స్టాలో పోస్ట్ చేశాడు.

**పూరన్ కెరీర్ లో ముఖ్యాంశాలు :**

నికోలస్ పూరన్ 2016 సెప్టెంబర్ లో వెస్టిండీస్ తరపున అంతర్జాతీయ క్రికెట్ లోకి ప్రవేశించాడు. మొత్తం 61 వన్డేలు ఆడిన పూరన్ 1983 పరుగులు చేశాడు. 2023 జులై తర్వాత ఇంటర్నేషనల్ వండే మ్యాచ్ ఆడలేదు. అదేవిధంగా 106 టీ20ల్లో 2,275 పరుగులు చేశాడు. దీంతో కరీబియన్ %%20 లో అత్యధిక రన్స్ చేసిన బ్యాటర్ గా పూరన్ రికార్డు సృష్టించాడు. 136.39 స్ట్రైక్ రేట్ తో ఈ స్కోర్ సాధించడం విశేషం. పూరన్ 2022లో టెస్టు కెప్టెన్ గా సేవలు అందించాడు. అయితే ఆస్ట్రేలియాలో జరిగిన వండే వరల్డ్ కప్ లో ఫస్ట్ రౌండ్ లోనే వెస్టిండీస్ ఇంటి ముఖం పట్టడంతో కెప్టెన్సీకి రాజీనామా చేశాడు. ఇక పూరన్ ఇప్పటి వరకు అంతర్జాతీయ క్రికెట్ ఒక్క టెస్టు మ్యాచ్ కూడా ఆడలేదు. టీ20ల్లో మాత్రం పూరన్ సూపర్ ఫామ్ కొనసాగిస్తూనే వచ్చాడు. లాస్ట్ ఐపీఎల్ సీజన్ లో 36 సిక్సర్లు కొట్టి ఆ సీజన్ లో అత్యధిక సిక్సర్ల వీరుడిగా రికార్డుకెక్కాడు. 2025 ఐపీఎల్ లో కూడా 40 సిక్సులతో మోత మోగించాడు.

## ఆర్సీబీని అమ్మేయనున్నారా? తొలి టైటిల్ గెలిచిన తర్వాత కీలక పరిణామం!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో బలమైన అభిమానగణం కలిగిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఫ్రాంచైజీ యాజమాన్యం మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆర్సీబీ జట్టు తమ మొట్టమొదటి ఐపీఎల్ టైటిల్‌ను కైవసం చేసుకున్న కొద్ది కాలానికే, దాని మాతృసంస్థ, బ్రిటిష్ మద్యం తయారీ దిగ్గజం డయాజియో పీఎల్సీ, ఈ ఫ్రాంచైజీలో తమ వాటాను విక్రయించే దిశగా ఆలోచనలు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది.

డయాజియో పీఎల్సీ, తన భారతీయ అనుబంధ సంస్థ అయిన యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్ ద్వారా ఆర్సీబీ ఫ్రాంచైజీని కలిగి ఉంది. ప్రస్తుతం ఆర్సీబీలో తమ వాటాను పాక్షికంగా గానీ లేదా పూర్తిగా గానీ విక్రయించేందుకు ఉన్న అవకాశాలపై కంపెనీ సంభావ్య సలహాదారులతో ప్రాథమిక దశ చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఆర్సీబీ ఇటీవల ఐపీఎల్ ఛాంపియన్‌గా నిలవడంతో జట్టు బ్రాండ్ విలువ, వాణిజ్య ఆకర్షణ గణనీయంగా పెరిగాయి. ఈ నేపథ్యంలోనే డయాజియో ఈ నిర్ణయం వైపు మొగ్గు చూపుతున్నట్లు పరిశీలకులు భావిస్తున్నారు.

ఐపీఎల్ జట్ల విలువలు అమాంతం పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో ఆర్సీబీ ఫ్రాంచైజీ విలువ సుమారు 2 బిలియన్ డాలర్ల వరకు ఉండవచ్చని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఐపీఎల్ లీగ్ వాణిజ్యపరంగా వేగంగా వృద్ధి చెందుతుండటం కూడా ఈ అధిక విలువకు కారణంగా నిలుస్తోంది. ప్రపంచంలోని ఎన్ఎఫ్ఎల్, ఇంగ్లీష్ ప్రీమియర్ లీగ్ వంటి పెద్ద క్రీడా లీగ్‌లతో పోల్చదగిన స్థాయికి ఐపీఎల్ చేరుకుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఈ వాటా విక్రయ ఆలోచన వెనుక పలు కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఐపీఎల్ వంటి ప్రధాన క్రీడా ఈవెంట్‌ల సమయంలో మద్యం ప్రకటనలపై కఠినమైన ఆంక్షలు విధించాలని భారత కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ నుంచి డయాజియోపై ఒత్తిడి పెరుగుతోంది. దీనికి తోడు కంపెనీకి అతిపెద్ద మార్కెట్ అయిన అమెరికాలో ప్రీమియం మద్యం అమ్మకాలు తగ్గడం ప్రపంచవ్యాప్తంగా వ్యయ నియంత్రణ చర్యలు కూడా ఈ నిర్ణయానికి దారితీసి ఉండవచ్చని విశ్లేషకులు పేర్కొంటున్నారు. మొదట మద్యం వ్యాపారి విజయ్ మాల్యా యాజమాన్యంలో ఉన్న ఆర్సీబీ, ఆయన స్పిరిట్స్ వ్యాపారాన్ని డయాజియో స్వాధీనం చేసుకున్న తర్వాత వారి నియంత్రణలోకి వచ్చింది. భారత క్రికెట్ సూపర్ స్టార్ విరాట్ కోహ్లీ జట్టులో ఉండటం ఆర్సీబీ వాణిజ్య విలువను మరింత పెంచింది. ఆయనకు ప్రపంచవ్యాప్తంగా ఫాలోయింగ్ ఉంది. అయితే, ఈ వాటా విక్రయానికి సంబంధించిన వార్తలపై డయాజియో గానీ, యునైటెడ్ స్పిరిట్స్ గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. కానీ, ఇటీవలి ఐపీఎల్ విజయం తర్వాత ఫ్రాంచైజీని నగదుగా మార్చుకునే మార్గాలను మద్యం దిగ్గజం చురుకుగా అన్వేషిస్తోందని అంతర్గత వర్గాలు సూచిస్తున్నాయి. ఈ పరిణామం ఐపీఎల్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

### ఆకాన్షా రంజన్ దానిని క్లాసీగా మరియు చిక్‌గా ఉంచుతుంది





### మృణాల్ చంపలేని ది ఏదైనా ఉందా?



## సూపర్ హిట్టు వచ్చినా ఆమెను పట్టించుకోరేంటి..?

టాలెంట్ ఉన్నా కూడా కొంతమంది హీరోయిన్స్ కి ఎందుకో పెద్దగా లక్ కలిసి రాలేదు. అయినా సరే వాళ్ల టాలెంట్ తో నెట్టుకొస్తుంటారు. అలాంటి వారిలో ఒకరు చెన్నై చిన్నది ఐశ్వర్య రాజేష్. తెలుగు మూలాలున్న ఈ భామ తమిళ్ లో పుట్టి పెరగడం వల్ల అక్కడ హీరోయిన్ గా గుర్తింపు తెచ్చుకుంది. సినీ నేపథ్యం ఉన్నా కూడా అవకాశాల కోసం కొత్త వాళ్ల లానే కష్టపడింది. తమిళ్ తో పాటు మలయాళ, కన్నడ సినిమాలను చేస్తూ తెలుగు లో వరల్డ్ ఫేమస్ లవర్ చేసింది.ఆ సినిమా ఫ్లాప్ అవ్వడం వల్ల అమ్మడికి లక్ కలిసి రాలేదు. ఐతే ఐశ్వర్యని చూస్తే కట్టు బొట్టు చక్కని తెలుగు అమ్మాయిలానే ఉంటుంది. అందుకే అమ్మడికి లేట్ అయినా సక్సెస్ వచ్చింది. విక్టరీ వెంకటేష్ చేసిన సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో అమ్మడు సూపర్ హిట్ అందుకుంది. ఆ సినిమాలో ఐశ్వర్య రాజేష్ పాత్ర ఆడియన్స్ ని ఖుషి చేసింది. ఐతే ఇన్నాళ్లు తెలుగులో సక్సెస్ లేదు కాబట్టి అవకాశాలు రాలేదు అనుకున్నారు కానీ సంక్రాంతికి వస్తున్నాం లాంటి బ్లాక్ బస్టర్ పడ్డాక కూడా అమ్మడికి మరో ఛాన్స్ రాలేదు.సూపర్ హిట్ కొట్టాక కూడా అవకాశం రాకపోవడం షాకింగ్ గానే ఉంది. ఐశ్వర్య రాజేష్ ప్రస్తుతం తమిళ్ లో 3 సినిమాలు చేస్తుంది. అందులో ఒకటి పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటుంది. రెండు సినిమాలు సెట్స్ మీద ఉన్నాయి. వీటితో పాటు అమ్మడు ఓ కన్నడ సినిమా చేస్తుంది. తెలుగులో ఇంకా ఇంకా సినిమాలు చేయాలని ఉందని ఐశ్వర్య కోరుతున్నా ఆమెకు సరైన ఛాన్స్ లు మాత్రం రావట్లేదు.ఐశ్వర్య రాజేష్ మాత్రం ఓ పక్క కోలీవుడ్ లో వరుస ప్రాజెక్ట్ లు చేస్తూనే తెలుగు నుంచి వచ్చిన ఛాన్స్ లు చేస్తుంది. సంక్రాంతికి వస్తున్నాం తర్వాత అనిల్ రావిపూడి చేస్తున్న మెగా 157 లో కూడా ఐశ్వర్య రాజేష్ నటిస్తుందని టాక్ నడుస్తుంది. అదే నిజమైతే మాత్రం ఐశ్వర్య పంట పండినట్టే లెక్క. ఆల్రెడీ చిరంజీవి సినిమాలో నయనతార హీరోయిన్ గా ఫిక్స్ అయ్యింది. ఐశ్వర్య రాజేష్ చేసినా సెకండ్ హీరోయిన్ గా చేయాల్సిందే. మరి ఆ ఛాన్స్ కూడా ఉందో లేదో త్వరలో తెలుస్తుంది.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com